The Real Personality Development Magazine

# యుగశక్తి గాయత్రి

మార్చ్ - 2006 రూ. 8-00



హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో ప్రతిష్ఠించబడిన

## గాయత్రీ మాత

# వానప్రస్థ సంస్కార మహోత్సవ దృశ్యాలు



వానప్రస్థ సంస్కార మహోత్సవంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ.



వానప్రస్థ సంస్కార మహోత్సవంలో ప్రసంగిస్తున్న ఆదరణీయ శైలదీదీ.



హైదరాబాదు విమానాశ్రయం నుండి అశ్విని హౌస్‌కు విచ్చేసిన డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ, ఆదరణీయ శైలదీదీ, వారిప్రక్కన శ్రీ అశ్విని సుబ్బారావు.




పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ.




కలశ యాత్ర దృశ్యం.



కలశ యాత్రలో పాల్గొన్న మహిళామణులు.

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః



సజల శ్రద్ధ

**సంకల్పం**

**సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదకులు

**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 6 - సంచిక 12**

మార్చి 2006

పార్థివ పాల్గుణం

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**

సలహాలు, సూచనలకు:

శ్రీ అశ్విని సుబ్బారావు

ఫోన్ - 9848043256

E-mail :
hyderabad.ap.in@awgp.org
hyd@aswini.com

## తలుపు తడుతూన్న అదృష్టం

యుగ సంధి సమయం ఇది. లక్షల సంవత్సరాల తర్వాత వచ్చే తరుణం ఇది. భగవానుని లీల వ్యక్తమయ్యే శుభ ఘడియ ఇది. మేలుకొన్న వారిని తన సహచరులను చేసుకుని, వారికా అదృష్టం కలిగించడానికి భగవానుడు ఎంపిక చేసిన సుముహూర్తం ఇది.

మానవాళి సర్వనాశనానికి అంతం జరుగుతోంది ఈ సంధి సమయంలో. ఉజ్వల భవిష్యత్తు నిర్ణయం అవుతోంది ఈ సంధి సమయంలో

మేలుకొన్నవారు కొద్దిపాటి శ్రమతో ఒక మహత్తర అవకాశాన్ని పొందే శుభవేళ ఇది. జన్మ జన్మాంతరాల వరకు యోగం - తపస్సు చేసే వారికి సైతం అరుదుగా లభించే అదృష్టం ఇది.

అదృష్టం ఎప్పుడూ రాదు. అది మెరుపులా ఎప్పుడో మెరుస్తుంది; మేఘంలా ఎప్పుడో వర్షిస్తుంది. సమయ స్వభావం తెలిసిన వారు ఈ వాస్తవాన్ని గుర్తించగలుగుతారు.

ఈ సమయం కల్పించే ప్రయోజనాన్ని పొందేవారి దూరదృష్టి ప్రశంసనీయం అవుతుంది. చరిత్ర వారి గుణగణాలను గానం చేస్తుంది - అవిశ్రాంతంగా భావితరాలు వారికి ప్రణామం చేస్తాయి; వారిని అనుసరించేందుకు ప్రేరణను పొందుతాయి.

ఈ అవకాశాన్ని కోల్పోయేవారికి, మేలుకొన్నవారి సాఫల్యాలను చూచి చూచి లోలోపల కుళ్లిపోయేవారికి, పశ్చాత్తాపపడేవారికి - మొదట్లో చాతుర్యంగా కనిపించిన చౌకబారు స్వార్థ పరత్వం అప్పుడు మూర్ఖత్వపు శిఖరాగ్రంగా ఋజువవుతుంది.

విలువ వైభవంలో లేదు, దాన్ని వినియోగించుకోవడంలో ఉంది.

★★★

**గతం తిరిగిరాదు. భవిష్యత్తు అనిశ్చితం. నిర్మించవలసినది వర్తమానాన్నే.**



## సద్గురు వచనామృతం

### ఆత్మశక్తి వికాసం

ఆత్మిక శక్తులను వికసింప జేసుకోవడం మానవ జీవితం యొక్క ప్రధాన లక్ష్యం. మానవ శరీరాన్ని పొందికూడా తన ఆత్మిక శక్తులను వికసింపజేసుకొనని వ్యక్తి, తన ఆత్మను సమీపించని వ్యక్తి ఈ ప్రపంచంలో శాంతిని పొందజాలడు; పరలోకాన్ని కూడ సుఖమయం చేసుకోలేడు. కనుక – నిజమైన శాంతిని పొందాలని కోరుకునే వ్యక్తి, తన జీవితం సుఖమయం కావాలని కోరుకునే వ్యక్తి తన ఆత్మిక శక్తులను వికసింప జేసుకోవాలి. ఎందుకంటే – ఆత్మయే పరిపూర్ణమైన శాంతికీ, పరిపూర్ణమైన సుఖానికీ నిలయం, భండాగారం.

మనం పొరపాటుపడి ప్రాపంచిక విషయాలలో సుఖాన్ని వెదుకుతున్నాం. కానీ, ప్రాపంచిక విషయాలలో సుఖం ఎక్కడ ఉంది? అవి జడ పదార్థములు, ప్రాణం లేనివి. జడ పదార్థాలలో సుఖం ఎలా ఉంటుంది? 'సుఖం' అనేది చేతన పదార్థం యొక్క గుణం. జడ పదార్థం యొక్క గుణం కాదు. మరి – ఆ జడ పదార్థం మనకు సుఖాన్ని ఎలా ఇస్తుంది? క్షణ భంగురము అయిన వస్తువు, క్షణికము అయిన వస్తువు, తాత్కాలికము అయిన వస్తువు శాశ్వతమైన శాంతిని ఎలా ఇవ్వగలుగుతుంది?

బాలుడయిన నచికేతుడు చెపుతాడు – ప్రాపంచికమైన విషయ సుఖాలు రేపటి వరకు ఉండనివి అని.

ప్రాపంచిక విషయాలలో కొంచం సుఖం ఉంటుంది. అదయినా మన ఆత్మ పొందే సుఖమే; ఆ జడ పదార్థాల నుండి పొందే సుఖం కాదు. మన ఆత్మ పొందే సుఖాన్నే మనం ప్రాపంచికమైన సుఖంగా పరిగణించి, దానిలో మునిగితేలుతున్నాం.

★★★

## విషయ సూచిక


**ముఖచిత్రం : గాయత్రీ మాత**

1. **సంపాదకీయం :**
   తలుపు తడుతూన్న అదృష్టం 1
2. **సద్గురు వచనామృతం**
   విషయ సూచిక 2
3. **వేద మంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం**
   ఇది వానప్రస్థ విప్లవం 4
5. **వానప్రస్థ పునరుద్ధరణ తక్షణావసరం**
   హైదరాబాదు సభలో డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఉద్బోధ 6
6. **రామకృష్ణ పరమహంస జయంతి వ్యాసం**
   శ్రీరామకృష్ణుని వివేకానంద సాధన 8
7. **మనం – మన ఆరోగ్యం**
   నవ్వండి – నవ్వించండి – ఆరోగ్యం పొందండి 12
8. **పంచసూత్ర తపశ్చర్య**
   ఉపవాసం, మౌనం, బ్రహ్మచర్యం, తితిక్ష, అంశదానం 14
9. **తత్వచింతన**
   విగ్రహారాధనలో విశిష్టత 18
10. **బోధకథ**
    స్థిత ప్రజ్ఞుడు 20
11. **ఆచరణలో అధ్యాత్మ**
    ఆధ్యాత్మిక జీవన రహస్యం 23
12. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం – 9**
    ఆలోచనలో అద్భుత ఆకర్షణ శక్తి 24
13. **ధారావాహిక: మనఃస్థితి మారితే మారుతుంది పరిస్థితి–4**
    మనస్సు ముఖ్యమా, సాధన సంపత్తి ముఖ్యమా? 26
14. **ధారావాహిక: యువతరానికి మేలుకొలుపు – 4**
    సాధన, సంయమనం, స్వాధ్యాయం, సేవ 30
15. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం – 27**
    దీక్షా భూమికి యాత్ర – 3 33
16. **వివేక వాణి**
    జీవితం విజయవంతం కావాలంటే ... 3 37
17. **నావారితో నామాట :**
    యోగ విప్లవ, భావ విప్లవాల విస్తరణ 43
18. **వార్తలు :**
    ప్రతిభల సద్వినియోగానికి చతుస్సూత్ర పథకం 46
19. **సద్గురు లీలామృతం** 47


**జ్ఞానానికి అంతిమ లక్ష్యం శీల నిర్మాణం కావాలి.**

# వేద మంత్రం

## పవిత్రత ద్వారా దైవ కృప

**న పాపాసో మనామేహ నారాయాసో న జల్హవః ।**
**యదిన్నవస్ద్రం వృషణం సచా సుతే సఖాయం కృణవామహై ॥** (ఋగ్వేదం 8/61/11)

**భావార్థం** : అంతఃకరణ మలినం, అపవిత్రం అయితే పరమాత్మ ఉపాసన ఫలవంతం కాదు. కనుక ఈశ్వరుని ఉపాసన నిష్పాప హృదయంతో చేయాలి.

**సందేశం** : ప్రపంచంలో ఈశ్వరుని విషయంలో ప్రజలలో భిన్న భిన్న విశ్వాసాలు ఉన్నాయి. కొంతమంది ఈశ్వరుని నమ్మరు. కొంతమంది ఉంటే ఎందుకు కనపడదని అడుగుతారు. విద్యుత్తీగెలలో విద్యుత్తు ప్రవహిస్తూ బల్బు ద్వారా ప్రకాశాన్ని ఇస్తుంది. కానీ విద్యుత్తు మనకు కనపడుతున్నదా? అందువలన విద్యుత్తు ఉనికిని నిరాకరించ గలమా? ఈశ్వరుడు ఈ సృష్టికి కర్త, నియంత, పాలకుడు. ఆయన ఉపాసనలోనే మనకు మేలు ఉన్నది.

చాలా మంది వ్యక్తులు పరమేశ్వరుని ఉపాసిస్తున్నారు. అయినా దుఃఖాలు, కష్టాలలోనే ఉన్నారు. దీనికి కారణం – వారి అంతఃకరణ కల్మషాలతో నిండి ఉన్నది, పాపకర్మలలో మునిగి ఉన్నది. ఈ స్థితిలో ఉపాసన కేవలం ఒక కపట నాటకం అని అనవచ్చు. మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? ప్రభు కృపకు పవిత్రత అనేది ఏకైక షరతు. పరమపిత పరమేశ్వరుడు మన సర్వశ్రేష్ఠ మిత్రుడు, సఖుడు. మనం నిష్పాపులమై, ఉదారులమై, తెరచిన హృదయంతో కలసికొనుట లేదు. ఆయన తన మిత్రత్వ అమృతాన్ని మనపై ఎలా చిలకరిస్తాడు ?

నేటి యుగం అహం చుట్టూ తిరుగుతున్నది. ఇంద్రియ పరాయణులమై మనం నీడల వెంబడి పరుగెడుతున్నాం. ఒక భయానక నిస్సారతలో చిక్కుకొన్నాం. 'కామం – కాంచనం'ల రోగం అంతటా భయంకరంగా వ్యాపిస్తూ ఉన్నది. ఈ సుడిగుండం నుండి బయటపడాలని ప్రజలు అనుకోవటం లేదు.

ప్రజలు భోగ విలాసాలలో మునిగి తేలుతూఉన్నా, ఎప్పుడూ అసంతృప్తే. తమలో తృప్తి కలిగించగల సామర్థ్యం లేదని భోగాలు స్వయంగా ఎలుగెత్తి చాటుతూ ఉంటే, మనుష్యుడు ఈ తథ్యాన్ని మరచి మళ్ళీ మళ్ళీ మరింత వేగంతో అవే భోగాలను శరణుజొచ్చి తృప్తికొరకు అసఫల ప్రయాస చేస్తున్నాడు. దీనికి మించిన దౌర్భాగ్యం మరేముంటుంది? 'భోగా నభుక్తా స్వయమేవ భుక్త్వా'. అనగా – "మనం ప్రాపంచిక భోగాలను భోగించనే లేదు, పైగా ఆ భోగాలను ప్రాప్తించు కోవాలనే చింతయే మనల్ని భోగించింది." వేదము భౌతికమైనదంతా త్యజించమని చెప్పలేదు. కానీ ఈ ప్రకృతిని కేవలం సాధనం రూపంలో ఉపయోగించమని చెప్పింది. ఈ శరీరం లేకుండా, భౌతిక పదార్థాలు లేకుండా మన నిర్వహణ అసంభవం. కానీ ఇదే సర్వస్వంగా భావించి నడుచుట మనలను మనం మోసగించుకొనుటయే.

పరోపకార కార్యం, నైతిక ఆచరణ ఉన్నత ఆధ్యాత్మిక జీవితానికి సోపానాలు. చిత్తశుద్ధికి వీటి ద్వారా వెళ్ళ వలసి ఉంది. చిత్తశుద్ధి లేకుండా ఉన్నత జ్ఞానం ప్రాప్తించదు. మనసు మూలల్లో నిండిన మురికిని దూరం చేయుటకు దృఢ నైతికాచరణ, నిస్వార్థభావనతో ఇతరుల మేలు కొరకు చేసే పనులు, స్వాధ్యాయం, ఆధ్యాత్మిక సాధనలు ఆవశ్యకం. హృదయంలో దివ్యజ్ఞాన ప్రకాశం ఈ దారిలోనే అవతరిస్తుంది. ఈ దివ్యత్వ ప్రకాశాన్ని, తేజస్సును మన కల్మషాలు సహించలేవు, స్వతహాగానే దూరంగా పారిపోతాయి. వాటి ఖాళీల పూర్తి సద్గుణాల ద్వారా అవుతుంది.

ఇదంతా దృఢ ఆత్మబలం ద్వారానే సంభవం.

★★★

**లోభియొక్క కోరిక ఎన్నడూ ఫలించదు.**

ముఖచిత్ర కథనం

# ఇది వానప్రస్థ విప్లవం

## గాయత్రీ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, వానప్రస్థ సంస్కార మహోత్సవంలో డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఉద్ఘాటన

**అది చరిత్రలో ఒక మలుపు.**
**అది సేవాసాధనకు పిలుపు.**
**అది సామాజిక పరివర్తనకు సోపానం.**
**అది జాగృత ఆత్మలకు ఆహ్వానం.**
**అది శ్రద్ధా భక్తుల పావన సంగమం.**
**అది సమర్పణ ప్రభంజనం.**
**అది 2006 ఫిబ్రవరి 12 ఉదయం.**
**అది గాయత్రీ చేతనా, ధ్యాన కేంద్రం.**

ఆ శుభ ఘడియలో పరమాదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ, పరమాదరణీయ శైలదీదీ గాయత్రీ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిపారు. శ్రీ అశ్విని సుబ్బారావుతో పాటు పలువురికి వానప్రస్థ సంస్కారం ఇచ్చారు.

వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించిన శ్రీ అశ్విని సుబ్బారావు దంపతులకూ, మిగతావారికీ డాక్టర్ సాహబ్ తిలకం దిద్దారు. బ్రహ్మదండం, అంగవస్త్రం, సంచీ ఇచ్చారు. శ్రీ అశ్విని సుబ్బారావును ఎంతో అభిమానంతో "**వానప్రస్థి సుబ్బారావు**"గా పేర్కొన్నారు.

ఆ సందర్భంగా ప్రసంగిస్తూ, డాక్టర్ సాహబ్ ఇలా అన్నారు –

నేటి ఈ వానప్రస్థ సంస్కార కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ నుండి ప్రారంభం అవుతూన్న విప్లవం. ఇది క్రమంగా దక్షిణ భారతం అంతటా విస్తరిస్తుంది. సమాజంలో మహత్తర పరివర్తన సాధిస్తుంది. దక్షిణ భారతం మేలుకొన్నదనడానికి ఉజ్వల సంకేతం నేటి వానప్రస్థ సంస్కార మహోత్సవం. ఈవిధంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతానికి ఒక ఒరవడి అవుతోంది.

వానప్రస్థ ఆశ్రమంలో వ్యక్తి తరువాతి జన్మకు సన్నాహాలు చేస్తాడు. ఋషిగా, మునిగా రూపొందడానికి కృషి చేస్తాడు. అంతవరకు తన కుటుంబానికి పరిమితమైన తన ప్రేమానురాగాలను సమాజంలోని వ్యక్తులందరికీ పంచుతాడు. ప్రపంచ పౌరుడు అవుతాడు. కనుకనే – స్వామి వివేకానంద వానప్రస్థ, పరివ్రాజక వ్యవస్థకు విశేష ప్రాధాన్యం ఇచ్చారు.

వానప్రస్థం అంటే నవయుగానికి చెందిన సన్యాసం.

వానప్రస్థం అంటే కామబీజాన్ని జ్ఞానబీజంగా మార్చే సంస్కారం.

వానప్రస్థం స్వీకరించిన వ్యక్తి అడవికి వెళ్లవలసిన అవసరం లేదు. ఇంటిలోనే ఉండవచ్చు. అయితే అనాసక్తిని అలవరచుకోవాలి.

వానప్రస్థంలో మూడు శ్రేణులు ఉన్నాయి. ఉత్తమ వానప్రస్థం ఆత్మ కళ్యాణానికీ, లోక కళ్యాణానికీ పూర్తిగా అంకితం కావడం. మధ్యమ వానప్రస్థం కొన్ని నెలలు సమాజసేవ చేయడం. కనిష్ఠ వానప్రస్థం రోజుకు 2 నుండి 4 గంటలు సమాజ సేవకు కేటాయించడం. ఈ కనీస వానప్రస్థాన్ని 25 సంవత్సరాల వయస్సు నుండే ప్రారంభించాలి. అలా చేస్తే 50 సంవత్సరాల వయస్సు తర్వాత వానప్రస్థ

**పతనం సహజమే. పైకి లేవడానికే కార్యశూరత అవసరం.**

ఆశ్రమాన్ని స్వీకరించి అమలు చేయడం తేలిక అవుతుంది.

వానప్రస్థుడు పసుపు బట్టలు ధరిస్తాడు. వస్త్ర ధారణకు ప్రాధాన్యం ఉన్నది. రావణాసురుడు సీతను అపహరించడానికి మారువేషంతో వెళ్లాలని అనుకున్నాడు. రాముడి వేషం వేసుకుంటే సీతాపహరణ జరుపలేడు కనుక సాధువు వేషం వేసుకున్నాడు.

అయితే, వానప్రస్థులు ఎప్పుడూ పసుపు బట్టలు ధరించవలసిన అవసరం లేదు. ప్రత్యేక సమయాలలో ధరించవచ్చు.

వానప్రస్థునికి ఆహారంలో సంయమనం అవసరం.

మావద్దకు 50 ఏళ్ల వయస్సు దాటినవాళ్ళు వస్తూ ఉంటారు – సంతానం కావాలంటూ. 50 సంవత్సరాల తర్వాత పిల్లలను కనాలని అనుకోవడం పశు ప్రవృత్తి.

ఈరోజున వానప్రస్థ సంస్కారాన్ని స్వీకరించిన వ్యక్తులంతా తమ సమయదానాన్ని పెంచుకుంటూ ఆ ఆశ్రమాన్ని సార్థకం చేస్తారని నేను ఆశిస్తున్నాను.

## ఆదరణీయ శైలదీదీ ఆశీస్సులు

పరమాదరణీయ శైలదీదీ ప్రసంగిస్తూ, "వానప్రస్థ సంస్కారాన్ని పొందడంద్వారా మీరందరూ భగవంతుని అనుగ్రహానికి పాత్రులయినారు" – అన్నారు. రామాయణంలో వారధి నిర్మాణంలో పాల్గొని ఉడుత శాశ్వత కీర్తిని పొందిందనీ, హనుమంతుడు శ్రీరామ పంచాయతనంలో అంతర్భాగం అయినాడనీ ఆమె తెలిపారు. ఆమె వానప్రస్థులకు తమ ఆశీస్సులు అందించారు.

అంతకు ముందు సంత్ డాక్టర్ బ్రిజ్ మోహన్ గారు తమ ప్రసంగంలో ఇలా అన్నారు –

భగీరథుడు గంగను దివి నుండి భువికి తెచ్చాడు. పరమపూజ్య గురుదేవులు గాయత్రిని దివి నుండి భువికి తెచ్చారు.

పూర్వపు యుగాలలో వానరులు, గోపబాలకులు, బౌద్ధ భిక్షువులు దైవ కార్యం కోసం దిగివచ్చారు. మీరూ ఆ పనిమీదే వచ్చారు. యుగ పరివర్తన కోసం వచ్చారు.

వానప్రస్థాన్నీ స్వీకరించడంతో మీ బాధ్యత పెరిగింది. మీరంతా సమాజంలో ప్రేమనూ, సంస్కారాన్నీ, జ్ఞానాన్నీ పంచాలి.

## వానప్రస్థ సంస్కారానికి అనూహ్యమైన స్పందన

వానప్రస్థ సంస్కారానికి అనూహ్యమైన స్పందన లభించింది. శ్రీ అశ్విని సుబ్బారావుగారు వానప్రస్థ సంస్కారాన్ని తీసుకోవాలనే విప్లవాత్మక నిర్ణయం చేయడంతో, వారి అడుగు జాడలను అనుసరించడానికి పలువురు ముందుకువచ్చారు. 11 సాయంత్రం సభలో వానప్రస్థాన్ని గురించి డాక్టర్ సాహబ్ చేసిన ఉద్బోధతో వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. మొదట 35గా ఉన్న ఆ సంఖ్య పెరిగి, 60 దాటింది. కార్యక్రమం ప్రారంభమయ్యే క్షణంవరకు పరిజనులు వానప్రస్థం కోసం తమ పేర్లు నమోదు చేసుకుంటూనే ఉన్నారు.

★★★

### శ్రీరామనవమి నుండి ప్రజ్ఞా టి.వి చానల్

శ్రీరామనవమి నాడు ప్రజ్ఞా టి.వి చానల్ ప్రారంభించడానికి ప్రయత్నం జరుగుతోందని డాక్టర్ సాహెబ్ తమ ప్రసంగంలో తెలిపారు. ఈ చానల్ ద్వారా మిషన్ పని మరింత వేగవంతం కాగలదని వారు సూచించారు.

ఫిబ్రవరి 18న శాంతికుంజ్‌లో సాధు సంత్‌ల సమావేశం జరుగుతుందనీ, ఆతర్వాత ఆధ్యాత్మిక రంగంలో ఒక ఐక్య వేదిక ఏర్పడగలదనీ వారు తెలిపారు.

★★★

**పరిస్థితులను మార్చే సామర్థ్యం కార్యశూరతలో ఉంది.**

# వానప్రస్థ పునరుద్ధరణ తక్షణావసరం

## హైదరాబాదు సభలో డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఉద్బోధ

వానప్రస్థ సంస్కార పునరుద్ధరణ తక్షణావసరం అని డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఫిబ్రవరి 11 సాయంత్రం హైదరాబాదులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన సభలో ఉద్ఘాటించారు. గాయత్రీ పరివార్, చైతన్య ఆర్ట్ థియేటర్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆ సభ జరిగింది.

డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ తమ ఉపన్యాసంలో ఇలా అన్నారు -

సమాజంలో సంస్కృతి సజీవంగా ఉంటే అన్నీ సజీవంగా ఉంటాయి. సంస్కారాలద్వారా సంస్కృతి వికసిస్తుంది. **జన్మనా జాయతే శూద్రః సంస్కారాత్ ద్విజ ఉచ్యతే**. నేడు ప్రజలు వైశ్యులుగా, శూద్రులుగా జీవిస్తున్నారు. సంస్కారాలవల్ల వారు బ్రాహ్మణులు అవుతారు. సంస్కారాలలో అత్యంత ప్రముఖమైనది వానప్రస్థం.

వివాహం రెండు ఆత్మల ఏకీకరణ. ఆ సంస్కారం కలుషితం కావడంవల్ల విడాకులవంటి అనర్థాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితి మార్చేందుకై శాంతికుంజ్ ఆదర్శ వివాహాలను జరుపుతోంది. ఇంతవరకు 3.5 లక్షల ఆదర్శ వివాహాలు జరిగాయి.

వానప్రస్థంలో వ్యక్తి సమాజ ఋణాన్ని తీర్చుకుంటాడు. ఋణాలను తీర్చుకుంటూపోతే వ్యక్తి ఉత్తమ జన్మలు పొందుతూ, చివరికి మోక్షాన్ని సాధిస్తాడు.

ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడగలుగుతుంది. దేశ రక్షణ జరుపుతుంది. సమాజంలోని ఇతర బాధ్యతలను పౌరులు నిర్వహించాలి. వానప్రస్థ సంస్కారం అలాంటి పౌరులను, సమాజసేవకు అంకితమైన పౌరులను రూపొందించుతుంది.

పదవీ విరమణ చేసిన వ్యక్తి ఆ తర్వాత కుటుంబం కోసం ఎందుకు తాపత్రయపడాలి? ఊరు పొమ్మంటున్నా, కాడు రమ్మంటున్నా - సంసారాన్ని పట్టుకుని ఎందుకు వ్రేలాడాలి? ఇలాంటి ఆలోచనకు రూపం వానప్రస్థం.

చివరిగా ఒక మాట. 2020 నాటికి భారత్ జగద్గురు స్థానాన్ని అలంకరించబోతున్నది అందుకు కృషి చేసేవారందరూ ధన్యులు అవుతారు.

నాటి సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ భారత్ వికాస్ పరిషద్ సహ సంఘటనా కార్యదర్శి శ్రీ ఎస్.రామన్న వానప్రస్థం తీసుకుని ప్రజలకు ఒక ఆదర్శాన్ని చూపినందుకు శ్రీ అశ్విని సుబ్బారావును అభినందించారు. ఆయన ఉదాహరణ అందరికీ అనుకరణీయం కావాలని ఆకాంక్షించారు. టైటాన్ ఎనర్జీ సిస్టమ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరావ్ చోదగం, చైతన్య ఆర్ట్ థియేటర్స్ సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీ ఎమ్.బాబూరావు, ఐ.పి.ఎస్‌లు తమ ప్రసంగాలలో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుని వానప్రస్థాన్ని స్వీకరించినందుకు శ్రీ అశ్విని సుబ్బారావుకు తమ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

శ్రీ అశ్విని సుబ్బారావు తమ ప్రసంగంలో - సంత్ డాక్టర్ బ్రిజ్‌మోహన్ గారి ఉపన్యాసం వానప్రస్థ నిర్ణయాన్ని తీసుకోవడంలో తమను ఎంతగానో ప్రభావితం చేసిందని వెల్లడించారు. ఆ సందర్భంగా ఆయన వివిధ సేవా సంస్థలకు విరాళాలను అందజేశారు.

సభా ప్రారంభంలో హైదరాబాదులోని రామా నాటక నికేతన్ విద్యార్థినీ విద్యార్థులు పరమాద్భుతమైన భరతనాట్యం ప్రదర్శించారు. వారి గురువులు శ్రీ వి.ఎస్.రామమూర్తి, శ్రీమతి మంజులా రామస్వామిలను డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ, శ్రద్ధేయ శైలదీదీలు సత్కరించారు.

సభలో డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ "ధైర్యం విడువకండి" అనే పుస్తకాన్నీ, శ్రీ డి.వి.ఆర్.మూర్తి అనువదించిన పంచ తత్త్వాల ద్వారా సంపూర్ణ రోగముల నివారణ", "విశేష బాధలకు కొన్ని విశేష గాయత్రీ సాధనలు", "హిందూ పదమర్మం", "వైజ్ఞానికంగా దేవతలు - యథార్థత", "జ్ఞాన విజ్ఞానంలో విశ్వ నేతృత్వం వహించిన భారతీయులు" అనే పుస్తకాలను ఆవిష్కరించారు. శ్రీ డి.వి.ఆర్.మూర్తిని సత్కరించారు.

**భోగం, రోగం సహచరులు. బ్రహ్మచర్యం ఆరోగ్యానికి మూలం.**

## సమస్యలకు పరిష్కారం గాయత్రీ పరివార్

నాటి ఉదయం జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రసంగిస్తూ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ సమస్యలన్నింటికీ పరిష్కారం గాయత్రీ పరివార్ అని ఉద్ఘాటించారు. ఆ సమావేశంలో వారిలా అన్నారు –

హిమాలయ సందేశాన్ని దక్షిణ భారతానికి అందించే మా కృషిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నది. ధ్యానం, జపం, యోగం, తపస్సు, పూజ మున్నగు ఆధ్యాత్మిక ప్రక్రియలను శాస్త్రీయంగా వివరించడానికి గాయత్రీ పరివార్ కృషి చేస్తోంది.

అజ్ఞానం, అశక్తి, అభావం (లేమి)లను త్రిపద గాయత్రి తొలగిస్తుంది. గాయత్రి జపం యొక్క ఫలితాలు వెనువెంటనే రెండు రోజులలో కనిపిస్తాయి.

వ్యక్తి నిర్మాణానికీ, కుటుంబ నిర్మాణానికీ, సమాజ నిర్మాణానికీ గాయత్రీ పరివార్ కృషి చేస్తోంది. భావ విప్లవం ద్వారా యుగపరివర్తనకు గాయత్రీ పరివార్ ఉద్యమిస్తోంది. శాంతికుంజ్‌లో ఇందుకోసమై సంవత్సరం పొడవునా సాధకులకు, పరివ్రాజకులకు శిక్షణా శిబిరాలు నిర్వహించబడుతున్నాయి. స్వావలంబన ఉద్యమంలో భాగంగా సంస్థ 100 గ్రామీణ పరిశ్రమలలో శిక్షణ ఇస్తోంది.

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 500 కళాశాలలు త్వరలో ప్రారంభం అవుతాయి. విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన విద్యార్థినీ విద్యార్థులు దేశ విదేశాలలో ఆధ్యాత్మిక విలువలను, ప్రక్రియలను ప్రసారం చేస్తున్నారు, చేస్తారు.

12 మధ్యాహ్నం జరిగిన కార్యకర్తల గోష్ఠిలో ప్రసంగిస్తూ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఇలా అన్నారు –

కార్యకర్తలు గాయత్రీమయ చింతనను, యజ్ఞమయ జీవనాన్ని అవలంబించాలి; ప్రజల చేత అవలంబింప జేయాలి.

సాంస్కృతిక దిగ్విజయ మహోద్యమంలో భాగంగా పరివార్ దక్షిణ భారతంలో విస్తరిస్తోంది. మొదట తిరుపతిలో, ఇటీవల మదురైలో అశ్వమేధ యజ్ఞాలు జరిగాయి. ఇక కర్ణాటకలో, కేరళలో యజ్ఞాలు జరుగుతాయి. పరమపూజ్య గురుదేవుల శతజయంతి సంవత్సరం 2011-12 నాటికి ఈ దశ పూర్తవుతుంది.

ఆనాడు "వందేమాతరం" జాతీయోద్యమానికి స్ఫూర్తిని ఇచ్చింది. ఈనాడు గాయత్రీ మంత్రం యుగ పరివర్తనకు స్ఫూర్తిని ఇస్తోంది.

2006 నుండి 2030 వరకు గల కాలఖండం విప్లవాత్మక పరివర్తన జరిగే సమయం, భగవంతుని సమయం,

నేడు ప్రపంచం శ్రద్ధా సంక్షోభంలో మునిగి ఉంది. సాధనాల సంపాదనలో పోటీ పెరుగుతోంది. సాధనలో పోటీ కానరావడం లేదు. ప్రజలలో దుర్బుద్ధి పెరిగింది. ఫలితంగా ప్రాణశక్తి తగ్గింది. గాయత్రీ మహాశక్తి ఈ ప్రాణశక్తిని ప్రసాదిస్తుంది.

### మూడు సూత్రాల పథకం

గోష్ఠిలో శ్రీ అశ్విని సుబ్బారావు ప్రసంగిస్తూ – వానప్రస్థ స్వీకరణలో ఇవ్వబడిన సంచీ తీసుకుని సమయదానం కోసం పర్యటిస్తామని చెప్పారు. తాము చేపట్టబోయే మూడు కార్యక్రమాలను వివరించారు –

1. విద్యాలయాలలో ప్రార్థనలో గాయత్రీ మంత్రాన్ని చేర్పించడం.
2. దేవాలయాలలో సద్వాక్యాలను ప్రదర్శించడం.
3. ప్రముఖుల జన్మదిన, వివాహదిన సంస్కారాలను పెద్ద యెత్తున జరిపించడం.

### మద్రాసు, విజయవాడలలో గాయత్రీ చేతనా కేంద్రాలు

మద్రాసుకు చెందిన వరిష్ఠ పరిజనులు శ్రీ జైన్, శ్రీమతి కస్తూరి ప్రసంగిస్తూ మద్రాసు వద్ద 4.5 ఎకరాల స్థలంలో భవ్యమైన గాయత్రీ చేతనా కేంద్రం త్వరలో స్థాపించబడుతుందనీ, శ్రీ అశ్విని సుబ్బారావు అందుకు ప్రేరణ ఇచ్చారనీ తెలిపారు. విజయవాడలోని ప్రముఖ వాణిజ్యవేత్త శ్రీ తొండెపు హనుమంతరావు ప్రసంగిస్తూ, విజయవాడలో గాయత్రీ చేతనా కేంద్రం స్థాపనకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

నాటి సాయంత్రం భవ్యమైన దీపయజ్ఞం జరిగింది. 11వ తేదీ ఉదయం పరమాదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీకి, పరిజనులు పరమాదరణీయ శైల దీదీకి హైదరాబాదు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం చెప్పారు. 10వ తేదీ సాయంత్రం మూసాపేటలోని గాయత్రీ చేతనా కేంద్రం నుండి శోభాయమానంగా కలశయాత్ర జరిగింది.

★★★

**కులంవల్ల, పుట్టుకవల్ల కాక – పనివల్ల మనిషి బ్రాహ్మణుడు అవుతాడు** – భారతం అరణ్యపర్వం

## రామకృష్ణ పరమహంస జయంతి వ్యాసం

# శ్రీరామకృష్ణుని వివేకానంద సాధన

### చిర ఉన్మాద ప్రేమ సాగరం

మనిషి పట్ల భగవానుని ప్రేమలోని సృజనాత్మక అనుభూతిని మానవాళికి వ్యక్తపరచడం రామకృష్ణ పరమహంస జీవన లక్ష్యం. జీవించే దేవుడు ప్రేమించే దేవుడనే సత్యాన్ని మనిషి తెలుసుకుంటే – ప్రపంచం విప్లవాత్మకంగా పరివర్తన చెందుతుంది. భగవంతుడు మనిషికి తన ప్రేమను ఉన్మాదివలె ఇస్తాడు; తన రక్తాన్ని మూల్యం కోరకుండా ఇస్తాడు; మోక్షాన్ని అలవోకగా ప్రసాదిస్తాడు. ఈ సత్యాన్ని గుర్తించిన మనిషి పూర్తిగా మారిపోతాడు. స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంసను 'చిర ఉన్మాద ప్రేమ సాగరం'గా వర్ణించాడు ఒక స్తోత్రంలో. ఈ వర్ణన రామకృష్ణుని హృదయాంతరాళంలోని ఆకాంక్షకు అద్దం పడుతోంది.

ఈ ఆకాంక్షను మానవాళికి అందించడానికి స్వామి వివేకానంద ప్రధాన ఉపకరణం కావలసి ఉంది.

### నరేంద్రుడుగా దిగివచ్చిన మహర్షి

నరేంద్రుడు తన వద్దకు రాకముందు శ్రీరామకృష్ణుడు పొందిన దివ్య దర్శనం అత్యంత ఆశ్చర్యకరమైనది. దానిని ఆయన ఇలా వర్ణించారు –

"ఒక రోజున సమాధి స్థితిలో నా చిత్తం తేజోమార్గంలో పయనిస్తోంది. క్రమంగా స్థూల జగత్తును, సూక్ష్మ భావ ప్రపంచాన్ని, దేవతామూర్తులను, తేజోనిర్మిత ఆవరణాన్ని దాటి నిరామయమైన లోకాన్ని ప్రవేశించింది. దివ్య తేజోమూర్తులు, సమాధి నిమగ్నులు అయిన సప్తర్షులు నాకు కనిపించారు. జ్ఞానంలో, పవిత్రతలో, త్యాగంలో, ప్రేమలో ఈ ఋషులు మానవులనేకాక దేవతలను కూడ అధిగమించారని నాకు అనిపించింది. నేను వారి గొప్పతనాన్ని మెచ్చుకోవడంలో మునిగిపోయాను. అపుడు ఆ తేజోమండలంలోని ఒక భాగం దివ్య శిశువు రూపం దాల్చింది. ఆ శిశువు సప్తర్షులలో ఒకరిని తన చిన్న ముద్దు చేతులతో కౌగలించుకున్నాడు. మధుర స్వరంతో ఆయనను పలకరిస్తున్నాడు. ఆయనను సమాధి స్థితి నుండి వెలుపలికి తేవడానికి ప్రయత్నించసాగాడు. ఆ దివ్య స్పర్శ వల్ల ఆ ఋషి అతీంద్రియ స్థితి నుండి వెలువడి, అర్ధనిమీలిత లోచనుడై ప్రేమ తరంగాలను ఆ బాలునిపై ప్రసరింపజేశాడు. బాలుడు ఆనందపరవశుడై 'నేను క్రిందికి వెళుతున్నాను. నీవు నాతో రావాలిసుమా' – అన్నాడు. ప్రేమపూరితములైన మహర్షి చూపులే అంగీకారాన్ని సూచించాయి. ఆ మహర్షి తిరిగి సమాధిలోకి వెళ్లిపోయాడు. ఆయన మనశ్శరీరాల అంశం ఒకటి వెంటనే తేజోరూపంలో భూమండలానికి దిగిరావడం చూచి నేను ఆశ్చర్యపడ్డాను. నరేంద్రుణ్ణి చూడగానే, అతడు ఆ మహర్షియేనని నేను గుర్తుపట్టాను."

### నరేంద్ర సాధన ప్రారంభం

ఆ దివ్య శిశువు తానే అని శ్రీరామకృష్ణుడు ఆతర్వాత తెలిపారు.

తమ ప్రేమ శక్తి ద్వారా శ్రీరామకృష్ణుడు సమాధిలో ఉన్న ఆ మహర్షిని భూలోకానికి దింపారు.

కాళీమాత సాక్షాత్కారానికై తాను వినియోగించిన ఏకాగ్రతనూ, శక్తినీ, తదేకదీక్షనూ శ్రీరామకృష్ణుడు ఇప్పుడు నరేంద్రునిపై వినియోగించారు.

కొద్ది రోజులు నరేంద్రుడు తన వద్దకు రాకపోతే,

**నేర్చుకోవాలని నిశ్చయించుకుంటే – ప్రతి పొరపాటూ ఒక గుణపాఠమే.**

ఆయన బాధతో నిద్రలేకుండా రాత్రులు గడిపారు.

గతంలో కాళీమాత సాధన జరిపిన విధంగా - శ్రీరామకృష్ణుడు నరేంద్ర సాధన ప్రారంభించారు.

## కాళీమాత శిశువుగా నరేంద్రుడు

తన కుటుంబపు ఆర్థిక బాధలను తొలగించ వలసిందిగా కాళీమాతను అడగవలసిందని నరేంద్రుడు ఒకనాడు శ్రీరామకృష్ణుడిని ప్రార్థించాడు. శ్రీరామకృష్ణుడు ఇలా అన్నారు -

"నాయనా! నేను అలాంటి కోరికలు కోరలేను. మరి నీవే వెళ్లి కాళీమాతను ఎందుకు అడగకూడదు? నీ బాధలన్నింటికీ కారణం ఆమెను నీవు నమ్మకపోవడమే."

ఈ మాటలు చెపుతూ ఆయన నరేంద్రుడిని కాళికాలయం గర్భగుడిలోకి పంపారు. కాళీమాత ఎదుట నిలబడ్డ నరేంద్రుడు నిశ్చేష్టుడు అయినాడు. శ్రీ రామకృష్ణుడు పూజించే కాళీమాత సజీవంగా, మహావైభవంగా వెలుగొందుతూ ఉండడం చూచి, నరేంద్రుడు ఆశ్చర్యచకితుడు అయినాడు. అతడి నోట మాట రాలేదు. ఆ దివ్యమాత అతడిని బయటనుండి కదిలించి, అతడి అంతస్సును మేలుకొలిపింది; అతడి చేతనలో కలగలసిపోయింది శాశ్వతంగా.

ఇలా నరేంద్రుడు కాళీమాతను స్వీకరించిన రోజు శ్రీరామకృష్ణుడిని పరమానందభరితుడిని చేసిన రోజు. "నరేంద్రుడు కాళీమాతను స్వీకరించాడు" - అని ఆయన మహోత్సాహంతో ప్రకటించారు దక్షిణేశ్వర్ వచ్చిన వారందరికీ. నరేంద్రుడు కాళీమాత ఒడిలోని శిశువు అయిపోయాడు. ఇక అతడిని గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదని శ్రీరామకృష్ణుడు భావించారు.

## బ్రహ్మతత్వం + శక్తితత్వం

ఎందుకంటే - ఆదిశక్తి ప్రసాదించినప్పుడే మనిషికి బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. మాయను కల్పించేదీ ఆమెయే. ఆ మాయ వెనుక ఉన్న బంధాలను త్రెంచేదీ ఆమెయే. బంధించే అవిద్యా శక్తి ఆమెయే. విముక్తి చేసే విద్యాశక్తి కూడ ఆమెయే.

కాళీమాతను అంగీకరించనిదే నరేంద్రుడు మనిషిపట్ల భగవానుని ప్రేమను ప్రసారం చేయ జాలడు. ఇంతకాలం నరేంద్రుడు నిరాశ్రయుడుగా ఉన్నాడు. ఇప్పుడు అతడు కాళీ మాత ఒడిలో ఉన్న శిశువు అయినాడు. ఇక అతడిని గురించి ఆందోళన చెందవలసిన అవసరం ఏముంది?

కాళీమాత నరేంద్రుని చేతనలో ప్రవేశించింది. అతడు తన శరీరాన్ని వదిలేవరకు ఆమె అతడిని వదలలేదు. అతడిని తనకు కావలసిన విధంగా మలచుకున్న తర్వాత, ఆమె అతడిచేత తన పని చేయించుకున్నది.

కాళీమాతను స్వీకరించడంవల్ల బ్రహ్మతత్వం శక్తితత్వం ఒకటి అయినాయి. జీవ శివుల తదాత్మ్యం యొక్క అనుభూతి చేతనలో కలిగింది.

## మానవ ఆరాధనయే దైవారాధన

ఆ తర్వాత - ప్రపంచాన్ని మరచిపోయి, నిర్వికల్ప సమాధిలో ఉండిపోవాలని నరేంద్రుడు కోరుకున్నాడు. కాని శ్రీరామకృష్ణుడు అతడు కన్న ఆ కలను పటాపంచలు చేశారు. అతడిలోని ఆధ్యాత్మిక శక్తులనూ, ప్రపంచ ప్రగతికి వాటి అవసరాన్నీ ఆయన ఒక్క మాటతో అతడికి బోధించారు. సమాధిలో మునిగిపోయే హక్కు నరేంద్రునికి లేదని ఆయన బోధించారు. వెలుగుతో నిండిన నరేంద్రుని చేతనను ఆయన మనిషి వైపు మళ్లించారు. మానవ ఆరాధనయే దైవారాధన అనే సత్యాన్ని ఆయన చేతనలో ప్రతిష్ఠించారు. ఆయన అడిగిన విప్లవాత్మకమైన ప్రశ్న ఒకే ఒకటి -

"విగ్రహం ద్వారా భగవంతుణ్ణి ఆరాధించడం సాధ్యమైనప్పుడు, జీవించి ఉన్న మనిషి ద్వారా ఆయనను

**సంస్కరణకు అందనంత విషమంగా ఏ పరిస్థితీ ఉండదు.**

ఆరాధించడం ఎందుకు సాధ్యం కాదు?"

ఈ మాటలలోని సత్యమే ఆతర్వాత నరేంద్రుని సందేశంలో, ఆయన చేసిన కార్యాలలో ప్రతిబింబించింది.

## ఫకీరు అయిన పరమహంస

తాను శరీరాన్ని వదలడానికి రెండు రోజుల ముందు – శ్రీరామకృష్ణుడు తన తపోబలం మొత్తాన్ని నరేంద్రునికి ధారపోశారు. తాను 'ఫకీరును' అయినానని ఆయన స్వయంగా చెప్పారు. దాని అర్థం – ఆయన నరేంద్రునిలో ప్రవేశించారని. ఆ తర్వాత నరేంద్రునికి ప్రత్యేక అస్తిత్వం ఏదీ మిగులలేదు. కనుక – నరేంద్రుడు తన ఆత్మ అని శ్రీరామకృష్ణుడు ప్రకటించారు.

## సనాతన ధర్మం + యుగ ధర్మం

శ్రీరామకృష్ణుడు తన నరేంద్ర–సాధనలో – అనగా నరేంద్రుడిని వివేకానందునిగా మలచడంలో – సనాతన ధర్మాన్నీ, యుగధర్మాన్నీ జోడించి బోధించారు. మతంలోని అప్రధాన విషయాలను వదలి మూల సూత్రాలను గ్రహించడం ఎలాగో అతడికి నేర్పారు. మాయ అనే మాలిన్యాన్ని తొలగించి, సచ్చిదానందం అనే స్వచ్ఛమైన జలాన్ని త్రాగడం ఎలాగో వివరించారు.

'నేను చెపుతున్నాను కనుక నీవు వినవలసిందే.'

– అని శ్రీరామకృష్ణుడు ఎన్నడూ ఎవ్వరికీ చెప్పలేదు. తన మాటలనూ, అనుభవాలనూ పరీక్షించి, ఆ తర్వాతనే స్వీకరించవలసిందని ఆయన ప్రత్యేకంగా నరేంద్రుణ్ణి ప్రోత్సహించారు.

## నూటికి నూరుపాళ్లు వైజ్ఞానిక దృక్పథం

వాస్తవానికి – శ్రీరామకృష్ణునిది నూటికి నూరుపాళ్లు వైజ్ఞానిక దృక్పథం. ఆయన తాను చూడనిదే దేనినీ ఎన్నడూ అంగీకరించలేదు. చూడడంకోసం ఆయన నెలల తరబడి, సంవత్సరాల తరబడి కళ్లు మూసుకోలేదు. కనుకనే – దృష్టికి అందని వాస్తవాల గురించి ఆయన చెప్పిన మాటలు అంత సరళంగా, అంత బలంగా, అంత నమ్మదగినవిగా ఉంటాయి.

కనుకనే – పరీక్షించే తన శిష్యుని ఎదుట విద్యార్థిలా కనబడడానికి శ్రీరామకృష్ణుడు ఎన్నడూ వెనుకాడలేదు. మరో ప్రక్క మత సిద్ధాంతాలను వైజ్ఞానిక పరీక్షకు గురిచేయడం నరేంద్రునికి ఆసక్తికరమైన అంశం. శ్రీరామకృష్ణుడు నరేంద్రునిలోని ఈ అన్వేషణ తత్వాన్ని ప్రోత్సహించారు. తనను పరీక్షించవలసిందిగా ఆయన నరేంద్రుణ్ణి ప్రోత్సహించారు. వాస్తవానికి – 'భగవత్ ప్రేమ' అన్నది అనురాగపూర్వకమైన సత్యాన్వేషణకు మరోపేరు. నరేంద్రుడు ఈ వైజ్ఞానిక భావనను మెచ్చుకున్నాడు. ఆరాధించాడు. కనుకనే శ్రీరామకృష్ణునికి శరణాగతి పొందడం ఆయనకు సాధ్యపడింది. కనుకనే – తాను విజ్ఞాన శాస్త్రాన్ని శ్రీరామకృష్ణుని నుండి నేర్చుకున్నానని ఆయన ప్రకటించాడు.

## నిజమైన మతం విప్లవాత్మకం

నిజమైన మతం విప్లవాత్మకమైనది. అది భ్రమలను పటాపంచలు చేస్తుంది; అలసత్వాన్ని అంతం చేస్తుంది; మూఢాచారాల మబ్బులను తునాతునకలు చేస్తుంది. ఇలాంటి మతానికి ప్రతిబింబం శ్రీరామకృష్ణుడు.

ఈ విప్లవాత్మకతకు ఉదాహరణలు అనేకం మనకు ఆయన జీవితంలో కనిపిస్తాయి.

ఆయన కమ్మరి స్త్రీ నుండి భిక్ష గ్రహించారు. నౌకరీ కోసం నేర్పే విద్యను అభ్యసించడానికి ఆయన నిరాకరించారు. ఆయన తమ సాధనలో అంతర్భాగంగా కొంతకాలం ఇస్లాం మత సూత్రాలను అనుసరించారు. ఆయన తన సతీమణిలో కాళీమాతను దర్శించారు. ఆయన జీవ–శివ మంత్రాన్ని ఇచ్చారు.

ఆధునిక భారతంలో కానవచ్చిన మహత్తరమైన ధార్మిక

**సూర్యరశ్మికి మంచు కరిగిపోతుంది. వివేకం ముందు దుఃఖం కరిగిపోతుంది.**

జాగరణ సనాతన సత్యాలలోని ఈ విప్లవాత్మక చైతన్యం పెట్టిన భిక్ష. తనలోని ఈ ఆంతరిక జ్యోతితో శ్రీరామకృష్ణుడు నరేంద్రునిలోని విప్లవాత్మక చైతన్యాన్ని రగిలించారు. వివేకానందుని ధార్మిక ప్రవచనాలలోని తీక్షణత, స్పష్టత, అద్భుతమైన ప్రాణ శక్తి, మేలుకొలిపే శక్తి – అన్నింటికీ మూలం ఈ విప్లవాత్మకతయే.

## శ్రీ రామకృష్ణుని బోధనా విధానం

శ్రీరామకృష్ణుడు నరేంద్రునికి మరో విషయం బోధించారు – భగవంతుణ్ణి పెక్కు విధములుగా ప్రేమించాలని. భగవంతుడు ఒక్కడే. అయినా, అతడిని ఎన్నెన్నో మార్గాల ద్వారా పూజించవచ్చు, సాక్షాత్కరింప జేసుకోవచ్చు.

నరేంద్రుణ్ణి నిర్మాణం చేయడంలో శ్రీరామకృష్ణుడు అతడి ఆంతరిక శక్తులను వెలికితీశారు; వాటికి పదునుపెట్టారు. అంతేకాని – దేనినీ అతడిమీద బయట నుండి రుద్దలేదు.

## నరేంద్రుని నిర్వికల్ప సమాధి

శ్రీరామకృష్ణుడు గొంతులో కాన్సరు వ్యాధి వచ్చి, శారీరికంగా ఎంతో బాధపడ్డారు. ఆయన యోగసిద్ధి పొందిన పరమహంస. కనుక – ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తన శరీరాన్ని వదిలివేసే సామర్థ్యం ఆయనలో ఉంది. అయినా ఆయన ఆ బాధను ఎందుకు భరిస్తూ వచ్చారు ? నరేంద్రుని శిక్షణలో ఇంకా చేయవలసింది ఉండిపోవడం అందుకొక కారణం కావచ్చు. శ్రీరామకృష్ణులు శరీరం విడవడానికి కొద్దిరోజుల పూర్వమే నరేంద్రుడు నిర్వికల్ప సమాధిని సాధించాడు. కనుక అతడి ఆధ్యాత్మిక సాధన పూర్తయింది. శ్రీరామకృష్ణుడు ఇక జాప్యం చేయలేదు. తన తపోబలం మొత్తాన్ని అతడికి బదిలీ చేసి, తాను ఖాళీగా మిగిలిపోయారు, నరేంద్రునిలో కలసిపోయారు. అలా ఆయన నరేంద్ర సాధన పూర్తయింది. ఆ తర్వాత శ్రీరామకృష్ణుడు రెండు మూడు రోజులు మాత్రమే జీవించారు. ఎందుకంటే – ఇక ఆ శరీరపు అవసరం తీరిపోయింది.

## శ్రీరామకృష్ణుని శిల్ప నైపుణ్యం

నరేంద్రుడు తనను కలుసుకున్న రోజునుండి తన జీవితం చివరి రోజువరకు ఒక మహాశిల్పివలె నరేంద్రుని ఆంతరిక వ్యక్తిత్వాన్ని మలచడంలో శ్రీరామకృష్ణుడు చూపిన అద్భుత నైపుణ్యం మననం చేయదగిన మహత్తర ఇతివృత్తం. నరేంద్రుడు కేంద్ర బిందువుగా శ్రీరామకృష్ణుని సందేశం మానవాళికి అందవలసి ఉంది. కనుకనే శ్రీరామకృష్ణుడు నరేంద్రుణ్ణి నిర్మించడానికై తన శ్రద్ధను, తన ఉద్యమశీలతను, తన ప్రావీణ్యాన్ని మొత్తాన్ని అంకితం చేశారు.

పన్నెండు సంవత్సరాల కఠోర సాధన ఫలితంగా శ్రీరామకృష్ణుని శరీరం చాలా సున్నితం అయిపోయింది. ఇంటింటికీ వెళ్లి తన జ్ఞానంతో, ప్రేమతో ప్రజల కష్టాలను తొలగించాలని శ్రీరామకృష్ణుడు మనసారా కోరుకున్నారు. సున్నితం అయిపోయిన తన శరీరంతో ఆ బృహత్ కార్యాన్ని నిర్వహించడం అసాధ్యం అయింది. ఈ విషయం ఆయనను ఎంతగానో వేధించింది.

నరేంద్రుణ్ణి చూడగానే తన సమస్యకు పరిష్కారం దొరికిందని శ్రీరామకృష్ణుడు తృప్తిపడ్డారు. భగీరథుడు గంగను దివి నుండి భువికి తెచ్చిన విధంగా – నరేంద్రుడు మానవాళి పట్ల తన ప్రేమను దశదిశలకూ వ్యాప్తి చేస్తాడనే నమ్మకం ఆయనకు కలిగింది. అనంతర కాలంలో ఆ నమ్మకం వాస్తవ రూపం ధరించింది.

శ్రీరామకృష్ణుడే వివేకానందుడు. వివేకానందుడే శ్రీరామకృష్ణుడు.

– స్వామి బుధానంద

★★★

**తన లోపల కూర్చున్న పరమాత్మను గుర్తించనివాడే డబ్బువెంట పరిగెడతాడు.**

## మనం - మన ఆరోగ్యం

# నవ్వండి - నవ్వించండి - ఆరోగ్యం పొందండి

### అద్భుత ఔషధం నవ్వు

ప్రకృతి మనిషికి ఇచ్చిన అమూల్య బహుమతి నవ్వు. ఏ ఇతర ప్రాణికీ నవ్వే లక్షణం లేదు. మనిషిలోని 14 ప్రముఖ ప్రవృత్తులలో నవ్వు ఒకటి. నవ్వడం, కడుపుబ్బ నవ్వడం ఒక బలమైన వ్యాయామం. ఆరోగ్యం కోసం ప్రకృతి ఇచ్చిన టానిక్ నవ్వు. 'లాఫ్టర్ ఈజ్ ది బెస్ట్ మెడిసిన్' - అనే ఆంగ్ల సామెత అర్థవంతమైనది. నవ్వును మించిన ఔషధం లేదు - అన్నది దాని అర్థం. మానసిక ఒత్తిడిని దూరంచేసే అద్భుత ఔషధం నవ్వు. నవ్వు మానవ సంబంధాలలో మాధుర్యం నింపుతుంది. కుటుంబ జీవితాన్నీ, సామాజిక జీవితాన్నీ సఫలం చేసే మహత్తర సాధనం నవ్వు. నవ్వువల్ల కలిగే ప్రయోజనాలు కోకొల్లలు. కనుక, నవ్వుమీద శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు.

### నవ్వు - లోపలి 'జాగింగ్'

ఆరోగ్యానికి సరైన ఆహార విహారాలు ఎంత అవసరమో నవ్వు అంత అవసరమని ఇంతవరకు జరిగిన పరిశోధనలవల్ల స్పష్టమయింది. క్రోధం, భయం, అసూయ, ద్వేషం వంటి వ్యతిరేకాత్మక భావాలు శరీరాన్ని క్రుంగదీస్తాయి. నవ్వువల్ల శరీరంలో స్రవించే జీవ రసాయనాలు ఆరోగ్యాన్ని పెంచుతాయి. కడుపుబ్బ నవ్వితే, గలగలా నవ్వితే శరీరంలో ఎండోర్ఫిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఈ హార్మోన్ శరీరంలో క్రియాశీలతనూ, స్ఫూర్తినీ, ప్రసన్నతనూ మేలుకొలుపుతుంది. నవ్వువల్ల ఎపినేఫ్రిన్, నారయేఫ్రిన్, డొపమైన్ వంటి హార్మోన్‌లు క్రియాశీలం అవుతాయి. ఇవన్నీ ఆరోగ్యాన్ని పెంచే జీవ రసాయనాలు.

అట్టహాసంవల్ల, బిగ్గరగా నవ్వడంవల్ల శరీరంలోని లోపలి అవయవాలకు మంచి వ్యాయామం జరుగుతుంది. ప్రఖ్యాత శాస్త్ర నిపుణుడు నార్మన్ కజిన్స్ దీన్ని లోపలి 'జాగింగ్' అని వర్ణిస్తారు. నవ్వడంవల్ల లోపలి అవయవాలకు మాలిష్ కావడమేకాక, మెదడుకు కలిగిన ఒత్తిడి తొలగిపోతుందని ఆయన చెపుతారు. పగలబడి నవ్వడంవల్ల శరీరంలో రక్త ప్రసరణ వేగం పెరుగుతుంది. కనుక ఎక్కువగా చెమట పడుతుంది. దానితోపాటు విజాతీయ ద్రవ్యాలు తేలికగా శరీరం నుండి బయటికి పోతాయి. బిగ్గరగా నవ్వడంవల్ల కడుపు, వీపులలోని స్నాయువులు గట్టిపడతాయి, ఆక్సిజన్ ప్రసారం పెరుగుతుంది. అందువల్ల శరీరంలో శక్తి, స్ఫూర్తి, చురుకుతనం పెరుగుతాయి. దీనితోపాటు ఒత్తిడి, తలనొప్పి, విసుగుదల, నీరసం వాటికవిగా తొలగిపోతాయి. నవ్వడంవల్ల వ్యక్తి తన ఒత్తిళ్ళను, తన మనసుపై ఉన్న బరువులను మరచిపోయి తేలికతనాన్ని అనుభవిస్తాడని డాక్టర్ నార్మన్ చెపుతారు. నాలుగైదు కిలోమీటర్లు పరుగెత్తడంవల్ల కలిగే వ్యాయామం కొద్దిసేపు గలగలా నవ్వడం వల్ల కలుగుతుందని ప్రకృతి చికిత్స నిపుణులు చెపుతున్నారు. మనం నవ్వినప్పుడు మన స్నాయువులు, శ్వాస వ్యవస్థ మరింతగా సాగుతాయి. ఫలితంగా మనలోపల మరింత ప్రాణవాయువు ప్రసారం అవుతుంది. ప్రఖ్యాత వైద్య నిపుణుడు విలియమ్ ఫ్రాయ్ చెప్పిన మాట ఇది. నవ్వడంవల్ల ముఖంలోని మాంస కండరాలకు మంచి కసరత్తు జరుగుతుంది. డయాఫ్రమ్‌కు వ్యాయామం జరగడంవల్ల రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది; జీర్ణ ప్రక్రియ బాగుపడుతుంది.

### ... డాక్టర్ బిల్లు కట్టవలసిరాదు

నవ్వువల్ల జరిగే చికిత్సపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. వాటి ఫలితాలు అద్భుతంగా, ఆశ్చర్యకరంగా ఉన్నాయి. రోజుకు 15 సార్లు నవ్వే వ్యక్తికి డాక్టరు బిల్లు కట్టే అవసరం రాదని న్యూయార్క్‌లోని 'హ్యూమర్ ప్రాజెక్ట్' స్థాపించిన డా॥గుడ్‌మన్ పేర్కొన్నారు. ప్రసిద్ధ మనస్తత్వ నిపుణుడు జొనథాన్ స్విఫ్ట్ ప్రపంచంలో ముగ్గురు గొప్ప వైద్యులు ఉన్నారని చెప్పారు. వారు - డాక్టర్ డయెట్ (సంతులిత ఆహారం), డాక్టర్ పీస్ (శాంతి), డాక్టర్ స్మైల్ (నవ్వు).

**ముడి ఖనిజాన్ని బంగారంగా మార్చే పరుసవేది - పాత్రత.**

యుగోస్లావియా మనస్తత్వ నిపుణుడు ఒరోకో బోకుల్ 'ట్రీట్‌మెంట్ బై హ్యూమర్' అనే తన గ్రంథంలో నవ్వు చికిత్స ప్రభావాన్ని వర్ణించారు. బలహీనత, తలనొప్పి, రక్తపోటులకు నవ్వు అమోఘమైన ఔషధమని ఆయన వివరించారు. కాన్సరువంటి ప్రమాదకరమైన రోగాలపై కూడ నవ్వు అద్భుత ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. తన దీర్ఘ జీవనానికి కారణం ప్రసన్నంగా, నవ్వుముఖంతో ఉండడం అని డా॥ఫ్రాయ్ 'హ్యూమర్ అండ్ ఏజింగ్' అనే గ్రంథంలో తెలిపారు. ఫ్రేక్ ఇర్వింగ్ ఫ్లెచర్ అనే విద్వాంసుడు హాస్యంవల్ల కలిగే ప్రయోజనాలను ఇలా వర్ణించారు – హాస్యం అలసట పొందినవారికి విశ్రాంతి; నీరసించిన వారికి టానిక్; ఉదాసీనులకు స్ఫూర్తి కేంద్రం; రోగికి ప్రకృతి చికిత్స. నవ్వు ఖర్చులేని పని. అయినా ఎన్నింటినో ఇస్తుంది. పొందేవాడు ఆనందిస్తాడు. ఇచ్చేవారికి పోయేదేమీ ఉండదు.

ప్రసిద్ధ మనస్తత్వవేత్త ఫ్రాయిడ్ హాస్యానికి విశేష ప్రాధాన్యం ఇచ్చాడు. భార్యా భర్తలమధ్య హాస్యం ఉంటే వారి దాంపత్య జీవితం సుఖమయంగా, సరసంగా ఉంటుందనీ, హాస్యం లేకపోతే ఆ జీవితం నీరసించి విడాకులకు దారి తీస్తుందనీ ఆయన పేర్కొన్నారు.

ప్రసిద్ధ కార్టూనిస్టు ఆర్.కె.లక్ష్మణ్ ఇలా అంటారు – హాస్యరసం ఒక ఆయుధం; దాన్ని చూస్తే దుష్టత్వం, సంశయం, అపోహ, దుర్భావం, ద్వేషంవంటి అవగుణాలు పలాయనం చిత్తగిస్తాయి.

## హాస్య యోగం

నేడు మనిషి జీవితం సంక్లిష్టం అయిపోయింది. అన్ని రకాల చెడుగులూ సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఉరుకులు – పరుగుల జీవితం మనిషిలో రకరకాల ఉద్విగ్నతలనూ, ఒత్తిళ్లనూ కలిగిస్తోంది. నిద్రలేమి, రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, నపుంసకత్వం, చిత్రవిచిత్రములైన మానసిక రోగాలు ప్రబలిపోతున్నాయి. ఈ విషమ పరిస్థితిలో ప్రకృతి ప్రసాదించిన హాస్యమనే టానిక్ దివ్యాస్త్రంగా పని చేస్తుంది.

నవ్వు గలగలా పారే సెలయేరు లాంటిది. నవ్వుకునే సందర్భాల కోసం ఎదురుచూడవలసిన అవసరం లేదు. ఏదో ఒక హాస్య ఘట్టాన్ని గుర్తు తెచ్చుకుని, ఆ వినోద భరిత క్షణాలను అనుభూతి పొంది – మనమంతా మనలోపల హాస్యాన్ని సృష్టించుకోవచ్చు. ఆ విధంగా రోజువారీ జీవితంలోని బరువును తొలగించుకోవచ్చు. ఇలాంటి అభ్యాసం ముసలితనంలోని ఏకాకితనంలో బాగా ఉపయోగపడుతుంది. నవ్వు ముసలితనాన్ని దరిజేరనివ్వదు. అది శరీరానికి సంజీవనిగా పనిచేస్తుంది. కనుక మనం సంతోషంగా ఉన్నప్పుడు గలగలా నవ్వాలి. సంతోషంగా లేనప్పుడుకూడ నవ్వడానికి ప్రయత్నించాలి. ఈ అభ్యాసం అద్భుతమైన ఆత్మసంతోషాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ మేలుకొలుపుతుంది.

కారణం లేకుండా నవ్వడం ఒక టానిక్‌లా పనిచేస్తుంది. ఈ వాస్తవం ఆధారంగానే మన దేశంలో ఇటీవల "లాఫ్టర్ క్లబ్"ల స్థాపన ప్రారంభమయింది. నేడు దేశంలో 400లకు పైగా ఇలాంటి క్లబ్‌లు ఉన్నాయి. ఈ క్లబ్‌ల ప్రారంభకుడు డా॥మదన్ కటారియా 'హాస్యయోగం'పై ప్రయోగాలు జరుపుతున్నారు.

## ఆధ్యాత్మిక జీవన సరళి హాస్యానికి దోహదకారి

వాస్తవానికి – నేడు భౌతికవాదపు పెను తుపానులో మనిషి పూర్తిగా చిక్కుకుపోయాడు. వర్తమానంలో, తన జీవిత వాస్తవికతలో జీవించడం మరచిపోయాడు. అతడి ఆశలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎన్ని సాఫల్యాలను పొందినా అతడికి తృప్తి ఉండడం లేదు. ఈ స్థితిలో – ఇతరుల సంతోషం, ఇతరుల ప్రగతి అసూయకూ, ద్వేషానికి కారణాలు అవుతున్నాయి. నవ్వడానికి యాంత్రికంగా అభ్యాసం చేయడంతోపాటు మనం ఆధ్యాత్మిక జీవన సరళిని అలవరచుకుంటే – సాదాగా, సరళంగా, సంయమనయుతంగా, నిరాడంబరంగా ఉండే అలాంటి జీవితంలో నవ్వుకూ, హాస్యానికీ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. మనం వీటి సత్ఫలితాల నుండి ప్రయోజనం పొందుతాం. అంతే కాదు. కుటుంబ జీవితాన్నీ, సామాజిక జీవితాన్ని మరింత సరసంగా, సుఖమయంగా, సఫలంగా రూపొందించుకుంటాం.

★★★

**ఆధ్యాత్మిక సాధనకు ఉపకరణాలు – మెదడు, హృదయం, శరీరం.**

# పంచసూత్ర తపశ్చర్య

# ఉపవాసం, మౌనం, బ్రహ్మచర్యం, తితిక్ష, అంశదానం

### తపస్సు ద్వారా కుసంస్కారాల క్షాళన

పాలను వేడి చేస్తే దానిలోని నేయి భాగం మీగడ కడుతుంది. ఎండవల్ల పగులు ఇచ్చిన ప్రత్యేక శిలలనుండి వాటిలో ఇమిడి ఉన్న శిలాజిత్ వెలికి వస్తుంది. సూర్యుని వేడిమి పెరుగగానే, ప్రాణులన్నీ నిద్ర మేలుకుంటాయి, తమ పనులలో నిమగ్నం అవుతాయి.

అలాగే – తపంలోని వేడిమివల్ల మనిషి యొక్క అంతః చేతన మేలుకుంటుంది; క్రియాశీలం అవుతుంది; సమర్థం అవుతుంది. గట్టిగా కుదిపితే నిద్రపోతూన్న వ్యక్తి మేలుకుంటాడు. అలాగే – ఆంతరిక మూర్ఛనూ, అకర్మణ్యతనూ తొలగించడానికై తపశ్చర్యనుండి జనించే శక్తి అద్భుతంగా పని చేస్తుంది. తపస్సు కలిగించే ప్రభావం సంచితమైన, పేరుకుపోయిన దుష్ట సంస్కారాలను కరిగించి బూడిద చేస్తుంది; నూతన శక్తిని ప్రదానం చేస్తుంది. ఆ శక్తి ప్రభావంతో ప్రగతి పథంలో మరింత వేగంగా పురోగమించగలుగుతాము. వేడి తగిలితే, చల్లదనం తొలగిపోతుంది. స్తబ్దతనూ, అకర్మణ్యతనూ నిర్మూలించడంలో ఆ పని చేస్తుంది తపం నుండి జనించే అగ్ని.

గాయత్రి సాధన అయిదు ముఖములు కలిగినది. ప్రాణరూపంలో ఉన్న సాధనలో అయిదు అధ్యాయాలు, అయిదు సోపానాలు ఉన్నాయి. తప సాధనలో కూడ అయిదు విభాగాలు ఉన్నాయి. పంచ తత్వాలతో ఏర్పడిన శరీరం, పంచ ప్రాణాలతో ఏర్పడిన చేతన వ్యవస్థ అయిదు విధముల తపశ్చర్యవల్ల ప్రభావితం అవుతుంది, సంస్కరించబడుతుంది. గాయత్రీ ఉపాసనను సఫలం చేసే అయిదు తపశ్చర్యలు ఇవి – 1.ఉపవాసం, 2.మౌనం, 3.బ్రహ్మచర్యం, 4.తితిక్ష, 5.దానం. సాధనతో పాటు ఈ తపశ్చర్యలు ఏ మేరకు సమన్వయించబడితే ఆ మేరకు దాని సామర్థ్యం పెరుగుతుంది.

### ఉపవాసం ద్వారా ఆత్మానుశాసనం

ఉపవాసం అనగా ఆహారంలో సంయమనం, సాత్వికత. పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి చాంద్రాయణ, సంతాపన మున్నగు ప్రత్యేక వ్రతాలు అనేకం ఉన్నాయి. అమావాస్య, పౌర్ణమి, ఏకాదశి రోజులలో ఉపవాసం, వారానికి ఒక రోజు ఉపవాసం పలువురు నిర్వహిస్తూ ఉంటారు. శ్రావణ, కార్తీక, మాఘ, వైశాఖ మాసాలలో జరిపే వ్రత సాధనలకు ఎంతో మహిమ ఉంది. రంజాన్‌లో ముస్లింలు కూడా ఉపవాసం ఉంటారు. కృష్ణాష్టమి, శ్రీరామనవమి, శివరాత్రి, గంగా దసరా, నవరాత్రి మున్నగు పర్వదినాలలో ఉపవాసం ఉండే సంప్రదాయం ఉంది.

ఆహారం తీసుకొనక పోవడంవల్ల కడుపుకు విశ్రాంతి లభిస్తుంది. కడుపుకు కొత్త శక్తి, కొత్త స్ఫూర్తి లభిస్తాయి. ఇది ఆరోగ్య రీత్యా ప్రయోజనకరం. దాని ప్రభావం మనస్సుపైన కూడ పడుతుంది.

శరీరం యొక్క అవసరం ఆకలిగా వ్యక్త మవుతుంది; ఆహారాన్ని కోరుతుంది. మత విశ్వాసంతో ముడిపడిన సంకల్ప శక్తి ఆ కోరిక తీర్చడానికి నిరాకరిస్తుంది. సంస్కారానికీ, సంకల్పానికీ మధ్య సంఘర్షణ ఏర్పడుతుంది. నచ్చ జెప్పడం ద్వారా లేక పట్టుపట్టడం ద్వారా సంస్కారం అణచివేయబడుతుంది. మత విశ్వాసం ఆధారంగా శరీరాన్ని ఒప్పించడం జరుగుతుంది. ఇలా ఉపవాసం ద్వారా ఆత్మానుశాసనాన్ని స్థాపించగలుగుతాము.

ఉపవాసం ఏ విధంగా, ఎంత సమయం చేయాలి – అన్నది సాధకుని మనఃస్థితిపైనా, పరిస్థితిపైనా ఆధారపడి ఉంది. నీరు మాత్రమే తీసుకోవడం పూర్ణ ఉపవాసం. పాక్షిక ఉపవాసాలు అయిదురకాలు. 1.పాలు, మజ్జిగ, పండ్ల రసం, కాయకూరల రసం వంటి ద్రవ పదార్థాలను తీసుకోవడం, 2.అన్నం వదలి కూరగాయలు, పండ్లు, పాలు వంటివి తీసుకోవడం, 3.ఒక పూట మాత్రమే భోజనం చేయడం, 4.అన్నం మాత్రమే, ఒక రొట్టె మాత్రమే, ఒక్క కూర మాత్రమే తీసుకోవడం, 5.పులగం, దలియా (గోధుమ జావ) వంటి ఒకే పాత్రలో వండిన వాటిని, మాత్రమే తీసుకోవడం.

**నిర్దయ, పిసినారితనం కలిగిన భక్తుడు దొంగ భక్తుడు.**

## జిహ్వపై అదుపునకు అస్వాద వ్రతం

అస్వాద వ్రతం ఈ ఉపవాస ప్రక్రియలోని అంతర్భాగం. ఉప్పు, పంచదార, మసాలా లేకుండా రుచిలేని భోజనం చేయడం ఇంద్రియ నిగ్రహానికి ఒక ముఖ్యమైన మెట్టు. ఇది ఆరోగ్యానికి ఎంతమాత్రం హాని చేయదు. ఆహార పదార్థాలలో ఉపయోగకరమైన లవణాల మోతాదు సహజంగానే ఉంటుంది. వాటిలో ఉప్పు, పంచదారల వంటివి కలపడం ఆరోగ్యరీత్యా ఏమాత్రం అవసరం కాదు. సృష్టిలోని ఏ ప్రాణీ ఉప్పు, మసాలా తినదు. శరీరానికి అవసరమైన తత్వాలన్నీ మామూలు ఆహార పదార్థాలలో ఉన్నాయి. జిహ్వాచాపల్యం వల్ల మనం భోజనాన్ని తినకూడనిదిగా తయారు చేస్తున్నాం. దానిని అనవసరంగా తిని మనం పొట్టను పాడుచేసుకుంటున్నాం. ఈ కల్తీలవల్ల మనస్సు చంచలం అవుతోంది. మనిషిలో తామస గుణం పెరుగుతోంది.

అస్వాద వ్రతం అంటే జిహ్వపై సంయమనం. జిహ్వా చాపల్యం అనే దుర్గుణాన్ని వదులుకునే సాహసం ఇందులో ఉంది. జిహ్వపై విజయం సాధిస్తే, ఇతర ఇంద్రియాలన్నింటిపై అనుశాసనాన్ని అమలుపరచడం తేలికవుతుంది. ఈ వ్రతం వల్ల ఆత్మనిగ్రహం, ఆత్మానుశాసనాల సంకల్పం తీవ్రతరం అవుతుంది. సాహసం పెరుగుతుంది. ఇలా పెరిగిన సాహసం ఇతర కుసంస్కారాలపై, దుష్ట ప్రవృత్తులపై విజయం పొందే సామర్థ్యాన్ని ఇస్తుంది. రుచిని వదిలిపెట్టి తినే ఆహారం పరిమితంగా, సాత్వికంగా ఉండడం సహజం.

ఆహార సంయమనం మానసిక సంయమనం అవుతుంది. ఇది ఆత్మిక ప్రగతికి ఎంతో దోహదం చేస్తుంది. కనుకనే, ఉపవాసం, దానిలో అంతర్భాగం అయిన అస్వాద వ్రతం తపశ్చర్యలో చేర్చబడ్డాయి. కనీసం వారంలో ఒక రోజు ఈ తపస్సును అభ్యాసం చేయాలి.

## వాణిపై అదుపునకు మౌనం

జపం, స్తోత్రం, కీర్తనం, పఠనం మున్నగునవి జిహ్వతో జరిగేవి; నాలుకతో జరిగేవి. కనుక నాలుక పరిశుద్ధంగా ఉండడం అత్యంత ఆవశ్యకం. నాలుక అనే తుపాకీతో మంత్రం అనే తుపాకీ గుండును వదులుతాము. కనుక ఆ నాలుక-తుపాకీని ముందుగానే శుభ్రపరచుకోవాలి. తుపాకీ గొట్టంలో చెత్తా చెదారం చేరితే, తుపాకీ నొక్కే మీటా, ఇతర విభాగాలూ అస్తవ్యస్తంగా ఉంటే - తుపాకీ గుండు మంచిదే అయినా గురి తప్పుతుంది. మురళి వాయించే వ్యక్తి దాని రంధ్రాలు శుభ్రంగా ఉన్నాయో లేదో చూచుకుంటాడు. మురికి గిన్నెలో పాలు కాచితే, అవి విరిగిపోతాయి. ఇది అపరిశుభ్రమైన నాలుకకు కూడ వర్తిస్తుంది. అలాంటి నాలుకతో చేసే పూజలు, మంత్ర పఠనాలు సఫలం కావు. కనుక - ఉపాసన సార్థకం కావాలంటే జిహ్వాశుద్ధి ప్రక్రియకు ప్రాముఖ్యం ఇవ్వాలి.

జిహ్వ చేసే ఒక పని ఆహారం తీసుకోవడం. రెండవ పని ఉచ్చారణ. కనుక సాధకుని సంభాషణలో పవిత్రత నిండి ఉండాలి. అబద్ధం చెప్పడం. దగా, పెత్తనం చెలాయించడం, కువిమర్శ, అవమానించడం, తిరస్కారం, కటుత్వం, ధైర్యాన్ని నీరు కార్చడం - ఇలాంటివి వాణిలోని దోషాలు. ఈ దోషాలు చేరినప్పుడు వాణి పవిత్రంగా ఉండదు. కనుక సాధకుడు ఆచితూచి మాట్లాడాలి. అతి వాగుడు తగదు. వాణిలోని ఇతర దోషాలను కూడ తొలగించుకోవాలి.

ఈ సందర్భంగా - వాణికి విశ్రాంతి ఇవ్వడానికీ, దానికి సంస్కరణ జరపడానికీ మౌనాన్ని అభ్యాసం చేయాలి. మౌనం వాణియొక్క తపస్సు.

అవకాశాన్ని బట్టి ప్రతిరోజూ ఒకటి రెండు గంటలు మౌనం పాటించాలి. భోజన సమయంలో, మలమూత్ర విసర్జన సమయంలో, ఉపాసన సమయంలో మౌనం పాటించే సంప్రదాయం ఉంది. వారంలో, నెలలో ఒక రోజు పూర్తిగా మౌనం పాటించడం జిహ్వయొక్క అవాంఛనీయ కార్యకలాపాలను అరికట్టడానికీ, పాత అలవాట్లను తప్పించడానికీ మంచి ఉపాయం.

తక్కువ మాట్లాడడం శక్తి సంచయానికి ఉపకరిస్తుంది. మనిషి బాగా నీరసించిపోతే - అతడి మాట తడబడుతుంది. మాట్లాడడంలో అంతఃశక్తులపై తీవ్రమైన ఒత్తిడి కలుగుతుంది. అనేక అవయవాల ఉమ్మడి శక్తి, శరీరంలోని విద్యుచ్ఛక్తి మాట్లాడడంవల్ల బాగా ఖర్చవుతాయి. నీరసించిన స్థితిలో ఆ శక్తి లేనందువల్ల మాట్లాడడం కష్ట మవుతుంది.

**సాధువు కావడానికి గీటురాళ్లు అద్భుతాలు కావు - శీలం, జ్ఞానం.**

మౌన స్థితిలో దైవ వాణిని వినే అవకాశం లభిస్తుందని "వాయిస్ అఫ్ సైలెన్స్" అనే గ్రంథంలో దివ్యజ్ఞాన సమాజ సంస్థాపకులు వ్రాశారు. చెప్పడం, వినడం అనే రెండు క్రియలనూ ఒకేసారి జరపడం కష్టం. పరమేశ్వరుని వాణిని వినడానికీ, అదృశ్యలోకపు దివ్య సందేశాలను అందుకోవడానికీ మౌన ధారణను అభ్యాసం చేయడం సముచితం.

## బ్రహ్మచర్యం అంటే వీర్యరక్షణ

మూడవ తపస్సు బ్రహ్మచర్యం. బ్రహ్మచర్యం అంటే స్థూలమైన అర్థం వీర్య రక్షణ. ఆరోగ్య పరిరక్షణకు కూడ ఇది అవసరం. అమూల్యమైన ఈ వీర్య ధాతువుకు సూక్ష్మరూపం ఓజస్సు. కళ్లలో వెలుగు, వాణిలో ప్రభావం, మెదడులో స్మృతి, వ్యక్తిత్వంలో ప్రతిభ, శరీరంలో స్ఫూర్తి, ముఖంలో తేజస్సు, మనస్సులో సాహసికత – ఈ రూపాలలో ఓజస్సు పని చేస్తుంది. జీవన జ్యోతిలోని వెలుగుకు కావలసిన నూనె వీర్య రక్షణద్వారానే సమకూరుతుంది. ఆత్మిక ప్రగతికి ప్రచండమైన సంకల్ప బలం అవసరమవుతుంది. భౌతిక ఆకర్షణలతో, కుసంస్కారాల ఆటంకాలతో సాధకుడు క్షణక్షణం సంఘర్షణ జరపవలసి ఉంటుంది. ఇందుకై వీరయోధుల శౌర్య సాహసాలు అవసరమవుతాయి. వాటికి అవసరమయ్యే శక్తిని సమీకరించుకోవడానికి బ్రహ్మచర్య పాలన ఆవశ్యకం. దాంపత్య జీవనం అంటే అర్థం ఆత్మహత్య కాదు. భార్యా భర్తలు కూడ అన్నదమ్ములవలె, అక్క చెల్లెళ్లవలె, మిత్రులవలె స్నేహంతో ప్రసన్నతతో నిండిన జీవితాన్ని సరళంగా, సఫలంగా గడపవచ్చు.

## బ్రహ్మచర్యం అంటే కాముక దృష్టి లేకపోవడం

బ్రహ్మచర్యానికి సూక్ష్మమూ, మహత్తరమూ అయిన మరో అర్థం ఉంది – పురుషుడు స్త్రీనీ, స్త్రీ పురుషుడినీ కాముక దృష్టితో చూడకుండా ఉండడం; మామూలు ప్రాణిగా చూడడం. అశ్లీలమైన ఆలోచనలు, వాసనాత్మకమైన కుదృష్టి ఇందుకు ఆటంకాలు. స్త్రీ పురుషులు స్నేహపూర్వకంగా ఒకరిని ఒకరు చూడడం అవసరమయితే – కుమారుడుగా, సోదరుడుగా, తండ్రిగా, కుమార్తెగా, సోదరిగా, తల్లిగా పవిత్ర దృష్టితో సన్నిహితంగా, మైత్రీపూర్వకంగా వ్యవహరించవచ్చు. మెదడును అనవసరంగా ఉత్తేజపరచడంలో, ఆలోచనను ఉన్నత లక్ష్యాలవైపు మళ్లనివ్వక పోవడంలో కాముకత ప్రముఖ పాత్ర వహిస్తుంది. కల్పనా శక్తిలోని అత్యధిక భాగం ఈ చెడు సందర్భాలను అల్లడంలో వృథా అవుతుంది. కాముక దృష్టి ఉండడంవల్ల నేత్రముల దివ్య దృష్టి దుర్వినియోగం అవుతుంది. ఇలాంటి ఆలోచన వీర్యనష్టంకన్న హానికరం. రతికార్యం వల్ల స్థూల శరీరానికి జరిగే హాని కాముక ఆలోచనలవల్ల సూక్ష్మ శరీరపు ప్రాణ ప్రతిభకు కలుగుతుంది. కనుక, బ్రహ్మచర్యంలో వీర్య రక్షణతోపాటు కాముక దృష్టిని జయించడం కూడ అంతర్భాగం.

గాయత్రీ మాత చిత్రం యువతిది. ఆ చిత్రం పట్ల పవిత్రతతో నిండిన మాతృశ్రద్ధను చూపాలి. దీని వెనుక ఉన్న ఒక ఉద్దేశ్యం ఏ యువతిపై దృష్టి పడినా ఉత్కృష్టమైన ఆలోచన కలిగే అభ్యాసం జరుగుతూ ఉండాలన్నది. సరస్వతి, లక్ష్మి, కాళిక మున్నగు ఇతర దేవతల విగ్రహాలు కూడ యౌవనాన్ని శ్రద్ధా భక్తులతో దర్శించాలనే పాఠాన్ని నేర్పుతాయి. అలాగే, దేవతల విగ్రహాలను రూప యౌవన సంపన్నములుగా తయారు చేయడం వెనుక గల ఉద్దేశ్యం యౌవనం నుండి కాముకమైన ఉద్రేకాన్ని పొందకూడదనీ, వారిపట్ల పరమేశ్వర సమానమైన గౌరవాన్ని చూపాలనీ ఒక భావనను స్త్రీలలో కలిగించడం. మీరా వంటివారి ఆరాధన ఈ స్థాయికి చెందినదే.

## తితిక్ష అంటే కష్ట సహనం

నాల్గవ తపశ్చర్య తితిక్ష. తితిక్ష అంటే అర్థం –సౌకర్యాలను స్వచ్ఛందంగా వదులుకోవడం, కష్టసాధ్యమైన జీవన సరళిని అభ్యాసం చేయడం. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. మితవ్యయంతో కూడిన బ్రాహ్మణోచిత జీవనాన్ని అవలంబించడం వల్ల పారమార్థిక కార్యక్రమాల కోసం సమయాన్ని, మనస్సును, ధనాన్ని మిగుల్చుకోగలుగుతాము. విలాస జీవితం గడిపే వ్యక్తికి అవసరాలూ, ఆకాంక్షలూ పెచ్చు పెరిగిపోతాయి. కనుక అతడు పారమార్థిక కార్యకలాపాల కోసం ఏమీ చేయలేడు. అతడికి అలా ఆలోచించడమే కష్ట మవుతుంది. తక్కువ ఖర్చుతో జీవించే వ్యక్తి రకరకాల అసౌకర్యాలను సహించవలసివస్తుంది. తితిక్ష వల్లనే

**సత్కర్మకు ప్రేరణ ఇవ్వడాన్ని మించిన పుణ్యం లేదు.**

ఇందుకు తగు అభ్యాసం జరుగుతుంది.

లోక కళ్యాణం కోసం సేవా సాధన పరమేశ్వర ఉపాసనలోని అంతర్భాగం. **విరాట్ బ్రహ్మను, విశాల విశ్వాన్ని సేవ చేసే, ఆరాధించే వ్రతాన్ని వదులుకొని, పూజలు, అర్చనలూ మాత్రం జరిపితే – ఏ జీవన లక్ష్యాన్నీ సాధించలేము.** సేవా సాధనలో నిమగ్నులైన వ్యక్తులు ఎన్నెన్నో కష్టాలను సహించవలసి వస్తుంది. పరివ్రాజక జీవనం కష్టాల కడలి. వానప్రస్థ, సన్యాస జీవనంలో ఎన్నెన్నో ఆటంకాలనూ, అవరోధాలనూ ఎదుర్కొనవలసి వస్తుంది. తితిక్ష వీటన్నింటికీ పూర్వాభ్యాసం. తరుణం వచ్చినప్పుడు అభ్యాస ప్రక్రియను చేపట్టడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకై ముందుగా చేసుకునే తయారీ.

సత్య పథాన్నీ, న్యాయ నిష్ఠనూ స్వీకరించినవారు అవినీతిపై సంఘర్షణ కూడ జరపవలసివస్తుంది. ఈ పోరాటంలో ఎదిరి పక్షం అయిన అసురత్వం ఎదురుదాడి చేయడం సహజం. ఏసుక్రీస్తు, గాంధీ, సోక్రటీసు, దయానంద, మంసూర్, బందా బైరాగి, గురుగోవింద సింగ్ పుత్రులు మున్నగు ఎందరెందరో వ్యక్తులు ఈ సంఘర్షణలో తమ ప్రాణాలను ఆహుతి చేశారు. లెక్కకు మిక్కిలి అయిన వ్యక్తులు అష్ట కష్టాలు అనుభవించారు.

తమ ఆక్రమణను మరొకరు అడ్డుకున్నప్పుడు పెద్దపులివంటి క్రూర జంతువులు అలాంటివారిపై విరుచుకుపడతాయి. అసురత్వం అనుసరించే విధానం ఇదే. సజ్జనత్వం తన మనుగడకు ప్రమాదమని అసురత్వం భావిస్తుంది. ఆ సజ్జనత్వంపై దురాక్రమణ జరుపుతుంది. తమ నిహిత స్వార్థాలకు దెబ్బతగిలినప్పుడు దుర్జనులు అధ్యాత్మవాదులపై కోపం తెచ్చుకుంటారు; వారికి హాని చేయడానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి ఆపదలలో చిక్కుకుంటామనే అవగాహన, వాటిని ఎదుర్కొనేందుకు సన్నద్ధత మొదటి నుండీ సాధకునికి అలవడడం అవసరం. కనుకనే, రకరకాల కాయ కష్టాలను సహించే తితిక్షను పెద్దలు తపశ్చర్యగా పరిగణించారు; సాధకుడు ఈ తితిక్షను అభ్యాసం చేస్తూ ఉండాలని బోధించారు.

చలినీ, వేడినీ, ఆకలినీ, దప్పికనూ సహించే అభ్యాసం తితిక్ష. నేలమీద పరుండడం, చెప్పులు లేకుండా నడవడం, తక్కువ వస్త్రాలను ఉపయోగించడం వంటివి ఇలాంటి అభ్యాసాలు. ఇతరుల సహాయం లేకుండా స్వావలంబనతో జీవించడం, తన శరీర యాత్రలోని పనులను తన చేతులతో చేసుకునే అభ్యాసం కూడ ఇలాంటివే. బట్టలు ఉతుక్కోవడం, క్షవరం చేసుకోవడం వంటి రోజువారీ పనులను ఇతరుల సహాయం లేకుండా స్వయంగా చేసుకునే నియమం ఈ తితిక్ష తపస్సులో అంతర్భాగాలు.

## దానం ఈ యుగ ధర్మం

అయిదవ తపస్సు అంశ దానం. తన సౌకర్యాలనూ, సాధనాలనూ తగ్గించుకుని, ఆ మిగులును సత్కార్యాలకు వినియోగించడం అంశదానం. సమయ దానం, శ్రమ దానం, ధన దానం, జ్ఞాన దానం ఈ కోవలోనివి. మనం చేసే మతపరమైన ప్రతి కర్మకాండలోనూ ఏదో ఒక రూపంలో దానం ఇచ్చే విధి విధానం జోడించబడింది. దానం పుణ్య కార్యంగా పరిగణించబడింది.

అంశదానం అంటే అర్థం – మన సంపాదనలో ఒక కనీస భాగాన్ని మన జీవితం గడపడానికి ఖర్చు చేయడం, మిగితా దాన్ని పరమార్థ ప్రయోజనాలకు వినియోగించడం. గాయత్రీ పరివార్ సభ్యులు జ్ఞానయజ్ఞం కోసం కనీసమైన సమయదానం, ధనదానం చేయవలసి ఉంటుంది. జ్ఞాన ఘటాల స్థాపనతో ఈ తపశ్చర్య ప్రారంభ మవుతుంది. జ్ఞాన యజ్ఞం ఈ యుగంలో అన్నింటినీ మించిన పుణ్యకార్యం. ప్రాచీనకాలంలోని ఋషులు, మహామానవులు, దేవ పురుషులవలె – పీడ, పతనముల సమగ్ర నివారణకై జ్ఞాన దానం జరిపేందుకై మనం భారీయెత్తున అంశదానం ఇస్తూ ఉండాలి. దేవసంస్కృతి విశ్వవిద్యాలయం అనే పుణ్య కార్యంకోసం అధికాధికంగా అంశదానం ఇవ్వడం కూడ ఒక తపస్సు.

ఈ అయిదు తపశ్చర్యలనూ ఏదో ఒక రూపంలో అమలు చేయడం ద్వారా గాయత్రీ ఉపాసన ఇచ్చే నిజమైన సత్ఫలితాలను చవిచూచే అవకాశాన్ని పొందడం మన కర్తవ్యం.

★★★

**ఆపదలతో పోరాటమే పౌరుషానికి గీటురాయి.**

## తత్వచింతన
# విగ్రహారాధనలో విశిష్టత

మనిషి ఔన్నత్యాన్ని పొందాలని చూస్తాడు. ప్రతివానికి తాను సుందరుడుగాను, అందమైన రూపముగల వాడుగాను, ఆరోగ్యవంతుడుగాను, తేజోవంతుడుగాను, ప్రతాపము కలవాడుగాను, ఐశ్వర్యవంతుడుగాను, అసాధారణమైన శక్తులుగలవాడుగాను తయారు కావలెనని ఉంటుంది. కానీ అన్నివిధాలైన ఉన్నతిని పొందే మార్గంలో ముందుకు సాగే పనిని ఏ విధంగా ప్రారంభించడమన్నది ఆలోచించవలసిన విషయం. స్వర్ణకారుడు ఒక మూసను తయారు చేసి వెండిని కరిగించి దానిలో పోస్తాడు. అప్పుడది ఆ మూస ఆకారంలో తయారౌతుంది. మూస తయారు చేయకుంటే టంకశాల పని ఎలా కొనసాగుతుంది? కావున మనిషి తానేవిధంగా తయారు కాదలిచాడో ఆవిధంగా తయారవడానికి ఒకమూస తయారు చేసుకొనవలసిన అవసరముంటుంది. ఈశ్వరునికి చెందిన ధ్యానమూర్తి (విగ్రహం) ఇటువంటి మూసయే!

పదం వెనుక ఒక చిత్రం జోడింపబడి ఉంటుంది. ఏనుగు అన్న పదాన్ని పలకగానే ఒక భారీ శరీరంగల జంతువుకు చెందిన స్మరణ (గుర్తు) కలుగుతుంది. ఆ చిత్రం మనముందుకు రాకుంటే ఏనుగు అన్న ఆ పదం అర్థంలేని పదమౌతుంది. అందమైన పదంతో జోడింపబడిన సుందర చిత్రం దివ్యనేత్రాల ముందు నాట్యం చేస్తుంది. అదే విధంగా – మీరు మీలో ఏవిధమైన ఉన్నతులను చూడవలెనని కోరుకుంటారో వాటితో కూడిన ఒక చిత్రం తయారవుతుంది. ఐతే కోరిక బలహీనమైనదైతే ఆ చిత్రం కూడ బలహీనమైనదిగా, పట్టించుకొనబడనిదిగా తయారౌతుంది. ఔన్నత్యానికి సంబంధించిన కోరిక ఎంత ప్రబలమైనదో ఆ చిత్రం అంత స్పష్టమైనదిగాను, అంత తేజోవంతంగాను, అంత కాంతితోను, అంత స్థిరమైనదిగాను, ఉత్సుకత నింపినదిగాను ఉంటుంది.

కొలంబస్‌ను భారతభూమిని కనుగొనవలెనన్న కోరిక ఎంతో వ్యాకులపరుస్తోంది. సర్వస్వం మీదుగట్టి తన తను, మనములను సమర్పించి ఓడను నడుపుతున్నాడు. అప్పుడతను ఒక బంగరు భూమిని వెతికి పట్టుకోగలిగాడు. అతనికి తీవ్రమైన ఆకాంక్ష (కోరిక) లేకుంటే సముద్రంలో ఓడ మరొక చోటకు పోయి ఉండేది. భారతదేశాన్ని కనుగొనవలెనన్న ధ్యేయరూప ప్రతిమ లేకుంటే అతని కోరిక తీరి ఉండేది కాదు.

ఇదే విధంగా పూర్వజులు అతిలోతయిన మానసిక తత్వజ్ఞానం ఆధారంగా పరమాత్మయొక్క సుందర విగ్రహాన్ని ధ్యానించడానికి దానిని పూజించే విధానాన్ని ఏర్పాటు చేశారు. మన వివిధ రకాల ఉన్నతులకు సంబంధించిన పరిజ్ఞానాన్ని మనకు కలిగించే, మనస్సును మోహింపజేసే ఒక ప్రతిమను ధ్యానించడం ఎంతో అవసరం. ఆ ప్రతిమతో ఈశ్వరుని పవిత్ర నామాన్ని జోడించడం వలన దానిలో ఒక విశేషత ఏర్పడుతుంది. ఆ విగ్రహం కేవలం భౌతికం, ప్రాపంచికమునైన ఉన్నతివరకే పరిమితంగాక – ఆధ్యాత్మికతతో, సద్గుణములతో కూడిన దివ్య ప్రవృత్తులతో కూడ సంబంధం కలదౌతుంది. దీని వలన భౌతిక ఆధ్యాత్మికములైన రెండు విధములైన ఉన్నతులతో కూడిన మన భవిష్యత్తు ఏర్పడే వీలు కలుగుతుంది.

ఈశ్వరుడు నిరాకారుడని నమ్మే సజ్జనులు పరమాత్మ ఒక ప్రత్యేక విగ్రహంలోనే ఉండునన్న మాటను అంగీకరించరు. వారికి మా ప్రార్థన ఏమనగా – వారు తమ సిద్ధాంతాన్ని మార్చుకోవలసిన అవసరం లేకుండానే ధ్యేయ విగ్రహాన్ని ధ్యానించడం వలన కలిగే ప్రయోజనాలను గురించి ఆలోచించమని, దానియందు దాగి ఉన్న గొప్ప లాభాన్ని గ్రహించమని. ప్రస్తుతం మన శరీరంలో ఉన్న అన్ని లోపాలను పోగొట్టుకుని ఉత్తమోత్తమ శరీరాన్ని ఏవిధంగా కోరుకుంటామో, ఏవిధంగా ఉత్తమ గుణాలను ఆశిస్తామో, ఎట్టి శక్తులను

**మనిషి తన విలువ తగ్గకుండా జాగ్రతపడడమే ప్రగతిశీలత.**

కోరుతామో, వాటినన్నిటినీ మన చిత్రాని కలంకరించండి. అంతే! అదే ఈశ్వరుని చిత్రమై కూర్చుంటుంది. దానినే ధ్యానిస్తూ ఉండండి. ఆ మూర్తి పట్ల మీకెంత ప్రేమ ఉండునో అంతగా మీరు భ్రమర కీటకమువలె ఆ ఆదర్శ విగ్రహంలో లీనమౌతూ పోతారు. ఆ ఆధ్యాత్మికమైన ఆ తల్లీనత అత్యంత మహత్తుతో నిండినదై - మీకున్న కోరికలలో అధిక శాతం ఈ జన్మలో పూర్తిగా తీరిపోతాయి.

కేవలం ధ్యానంతోనే ఏమీ సాధింపబడదని భావించడం తప్పు. ధ్యానమన్నది మొదటి మెట్టు. ఆదర్శం నిర్మాణం కాగానే శరీరం, మనస్సులు తమకుగల సకల శక్తులతో సహా దానిని పొందద మారంభిస్తాయి. కనబడేవి, కనబడనివీ అయిన లోకాలనుంచి సాఫల్యతను సంపాదించడానికి కావలసిన అనేక విచిత్ర సాధనాలు సూక్ష్మతత్వాల సహాయంతో పోగవుతాయి. అప్పుడప్పుడు ఆ సహాయాలు అద్భుతాలవలె అనిపిస్తాయి. ఈశ్వరుని పవిత్ర విగ్రహంతో ఎంతగానో లీనమయేటట్లు చేస్తాయి. ఆత్మోన్నతికి అన్నిటికన్న గొప్పదైన ధ్యేయ ప్రతిమ తయారయిందని కూడా చెప్పవచ్చు. దానితో ఏకాకారతను పొందడం కోసం ప్రేమతో కూడిన విహ్వలత కలుగుతుంది. అది సాఫల్యత యొక్క పరాకాష్టతను అందిస్తుంది. నిజమైన భక్తితత్వమిదే.

- అనువాదం : కె.బి.సోమయాజులు

★★★

## సంవేదన శీలం

బెంజిమన్ ఫ్రాంక్లిన్ ధనికుడైన తన మిత్రుని బల్లమీద ఇరవై డాలర్లు చేసే బంగారు నాణేన్ని ఉంచి ఇలా అన్నాడు, 'కష్టంలో ఉన్నప్పుడు మీరు నన్ను ఆదుకున్నారు. అందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రారంభ దినాలలో ఒక ముద్రణాలయంలో పత్రికను అచ్చువేయడం మొదలు పెట్టాను. నాకు అకస్మాత్తుగా జబ్బు చేసింది. నా పని ఆగిపోయింది. అప్పుడు మీ దగ్గర ఇరవై డాలర్లు తీసుకొన్నాను. ఆ సొమ్ము తిరిగి ఇచ్చేందుకు వచ్చాను. మీరు సమయానికి సాయం చేశారు. దాని వల్ల పత్రిక మరల ప్రచురణకు నోచుకొంది. దానికి నేనే సంపాదకత్వం వహిస్తున్నాను. చందాదారుల సంఖ్య కూడా పెరిగింది. ఇప్పుడు నిశ్చింతగా ఉన్నాను తీసుకోండి. ఈ గిన్నీని.'

ఆ ధనిక మిత్రునికి ఆ విషయం అసలు గుర్తులేదు. బెంజిమన్ వివరించిన తరువాత గుర్తుకు వచ్చింది. ధనికుడు అప్పుడు అన్నాడు, 'అవును, నిజమే. కాని నా దగ్గర మీరు డబ్బు తీసుకొన్నప్పుడు తిరిగి ఇచ్చే విషయం నిర్ణయించుకోలేదు కదా. ఆనాడు మీరు ఇబ్బందులలో ఉన్నారు. మీకు సాయపడడం నా కర్తవ్యంగా భావించాను. నా కర్తవ్యాన్ని నేను చూశాను. ఇదే కదా మానవత్వం. ఈ నాణాన్ని మీ దగ్గరే ఉంచండి. ఎప్పుడైనా కష్టంలో ఉన్నవారు ఎవరైనా మీ దగ్గరకు వస్తే దీనిని వారికి ఇవ్వండి. ఇచ్చి దానిని తిరిగి తీసుకోకండి. అతడు కూడా అటు తర్వాత అదేవిధంగా ఎవరికైనా సహాయం చేయటానికి వీలవుతుంది. ఇలా ఈ క్రమం కొనసాగుతుంటే ఎంత బాగుంటుంది!'

ఇలాగే జరిగింది. ఫ్రాంక్లిన్ ఆ నాణాన్ని తిరిగి తీసుకున్నాడు. ఇతరుల అవసరాన్ని తీరుస్తూ అది అలా తిరుగుతూ ఉంది. అది ఎవరి దగ్గరకి పోతే వారికి మేలు జరుగుతోంది. అలాగే ఇంకొకరికి.

సమాజ జీవనంలో హృదయ సంవేదనతో కూడిన ఇట్టి మానవత్వ విలువల వల్ల స్వర్గతుల్యమైన వాతావరణం నిర్మింపబడుతుంది.

**తన దుష్ట ప్రవృత్తులతో సంఘర్షణయే మనిషికి సాధన.**

# బోధకథ

# స్థిత ప్రజ్ఞుడు

పఠాన్ యూసఫ్‌కి చెప్పలేనంత ఆనందంగా ఉంది. గాలిలో తేలిపోతున్నట్లు వచ్చాడు ఇంటికి. "బేగమ్! అల్లా దయవల్ల హజ్ యాత్రకి కావలసిన పనులన్నీ పూర్తయ్యాయి. నిజంగా మనం చాలా అదృష్టవంతులం. హజ్ యాత్ర చేసే అవకాశం అందరికీ వస్తుందా?" – అంటూ ఉత్సాహంగా చెప్పాడు భార్యతో.

"ఇంట్లో సామాను జాగ్రత్తగా సర్దిపెట్టావా? హజ్ నించి తిరిగి రావడానికి ఏడెనిమిది నెలలుపైగా పడుతుంది. ఊళ్లో దొంగల బెడద ఎక్కువగా ఉందసలే." – అన్నాడు మళ్లీ భార్యతో.

"అన్నీ బాగానే సర్దానుగాని, ఒక్కవిషయంలోనే ఏం చెయ్యాలో తోచకుండా ఉంది. ఎన్నాళ్లనించో పొదుపుచేసి వంద అశర్ఫీలు పోగు చేశాను. వాటిని ఎక్కడ దాచాలో అర్థంకావడం లేదు" – అంది ఫాతిమా.

యూసఫ్ తేలిగ్గా నవ్వేశాడు. అతడికి అదొక సమస్యలాగే తోచలేదు. "ఆ అశర్ఫీలు ఇటివ్వు. ఊళ్లో ఏ షావుకారుకైనా చేబదులుగా ఇస్తాను. తిరిగిరాగానే తెచ్చుకోవచ్చు. వాళ్ల దగ్గరైతే సొమ్ము భద్రంగా ఉంటుంది. అడగగానే తిరిగి ఇవ్వగలుగుతారు. మనలాంటి వాళ్లంతా చేసే పని అదే." – అన్నాడు.

భర్త ప్రతిపాదన ఫాతిమాకి అసలు నచ్చలేదు. "నాకు ఈ షావుకార్ల మీద అసలు నమ్మకం లేదు. దురాశాపరులు. ఎన్ని మోసాలు చెయ్యడానికైనా వెనుకాడరు. మనం చూడబోతే నోరూవాయీ లేని అమాయకులం." – అంది పెదవి విరుస్తూ.

"నా ఉద్దేశ్యం ఏమిటంటే – మన ఊళ్లోనే ఉన్న పరమభక్త శిఖామణి సంత్ తుకారాం గారి దగ్గర దాచిపెడితే బాగుంటుందని. ఆయన మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. అక్కడైతే మన డబ్బు సురక్షితంగా ఉంటుంది" – అన్నది ఫాతిమా ఒక నిర్ధారణకు వస్తూ.

పఠానుకి నవ్వాగలేదు. ఏం మాట్లాడుతున్నది ఈ తెలివితక్కువ మనిషి! సాధు సన్యాసుల దగ్గర డబ్బులు దాచుకునే దద్దమ్మలుంటారా ఎక్కడైనా? తుకారాం భగవద్భక్తుడన్న విషయం కాదనరు ఎవరూగాని. గృహస్థుగా ఉంటూ కూడా లోభ మోహాలకి మాయా మమతలకి లొంగని అసలైన వైరాగి. అయితే, ఆయనకు కట్టుకోడానికి ఒంటి నిండాబట్టలే లేవు. ఖర్చుపెట్టుకోడానికి రాగి డబ్బులే ఉండవు. ఇక ఇతరులవి వందలూ వేలూ భద్రపరచడం ఏం తెలుస్తుంది? వాటిని దాయడానికి ఇనప్పెట్టె కాదు గదా తుప్పుపట్టిన రేకు పెట్టెకూడా ఉండదా ఇంట్లో...." – అంటూ పఠాను భార్యకి రకరకాలుగా చెప్పిచూచాడు. ఈ పకీర్లని నమ్ముకుని మనం మోసపోతాం అనికూడా చెప్పాడు చివరగా.

కానీ ఫాతిమా తన పట్టు విడువలేదు. షావుకార్ల దగ్గర దాచడానికి ఒప్పుకోలేదు. సంత్‌తుకారాంగారి దగ్గర దాచిపెట్టడమే మేలని పదేపదే చెప్పింది. "ఈ సేట్లు, షావుకార్లు రోజంతా అబద్ధాలాడుతూ వ్యాపారం చేస్తారు. లాభాలకోసం జనాలని మోసం చేస్తూనే ఉంటారు. తాకట్టు పెట్టుకున్న వస్తువులని వాకట్టు చేస్తారు. లేదా కోర్టుల చుట్టూ తిప్పి చివరికి మొండిచెయ్యి చూపిస్తారు. ఎంత మందిని చూడడంలేదు ఏడుస్తూ, మొత్తుకుంటూపోయిన వాళ్లని! నాకు ఈ షావుకార్ల మీద వీసమంత నమ్మకం లేదు." – అంటూ నిష్కర్షగా చెప్పింది ఫాతిమా.

"నీకు చెప్పలేను గాని బేగమ్ సాహిబా! ఇంతకూ ఈ డబ్బు ఎవరిదగ్గర దాచిపెట్టాలని నీ ఉద్దేశ్యం." – అన్నాడు పఠాను విసుగ్గా.

"చెపుతున్నానుగా. తుకారాం సాధువుగారికి ఇవ్వమని. ఆయన పవిత్రమైన మనిషి. మాయా మోహాలను పూర్తిగా జయించినవాడు."

"నిజాయితీ పరుడన్నమాట నిజమేగాని డబ్బు విలువ తెలియని మనిషి. ఆ డబ్బులనేమి జాగ్రత్త చేస్తాడూ, ఆ పూరి పాకలో పెట్టేబేడా లేనివాడు వాటి నెక్కడ దాస్తాడూ అని నా అనుమానం" – అంటూ మరో పుల్ల వేయబోయాడు పఠాను. కానీ ఫాతిమా పట్టు విడవకపోయేసరికి చేసేదిలేక అషర్ఫీల సంచి తీసుకొని తుకారాం ఇంటికి వెళ్లాడు.

తుకారాంకి నమస్కారం చేసి "సంత్‌జీ! మీరు నాకో సాయం చెయ్యాలి." అన్నాడు యూసఫ్.

**సాదాగా జీవించు; ఉన్నతంగా ఆలోచించు.**

"ఖాన్‌సాబ్, ఏమి సహాయం కావాలో చెప్పు. ఏదైనా ఆధ్యాత్మిక సమస్య గురించైతే మాత్రం తప్పకుండా సహాయం చేస్తాను" – అన్నాడు తుకారాం.

"ఆధ్యాత్మిక సంబంధం కాదు. మామూలు కుటుంబ విషయాలే. నా భార్య వంద అశర్ఫీలు ఎలాగో పొదుపు చేసి కూడబెట్టింది. మేము హజ్‌యాత్రకు వెళుతున్నాము. మేము వచ్చేవరకూ అవి మీదగ్గర భద్రపరచాలి. ఆమెకు షావుకార్లమీద, సేట్లమీద నమ్మకం లేదు. మీమీద గొప్ప నమ్మకం పెట్టుకుంది. ఇదుగో సొమ్ము." – అన్నాడు.

సంత్‌కు ఆశ్చర్యం కలిగింది. చిత్రంగా ఉందే. మొట్టమొదటిసారిగా డబ్బులు దాచవలసిన అవసరం వచ్చిపడింది. ఒప్పుకోవాలా! నిరాకరించాలా! తేల్చుకోలేక సందిగ్ధంలో పడ్డాడు సంత్ తుకారాం.

మొహమాటపడుతూ ఇలా అన్నాడు – "ఖాన్ సాబ్! మీకు తెలియంది ఏముంది. నాదగ్గర పెట్టెగాని బీరువాగాని ఏదీ లేదు. జీవితంలో నా స్వంత డబ్బే దాచుకునేంత లేదు. ఆ వ్యవహారాలు నాకసలు తెలియవు. మీరు మరెక్కడైనా ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది."

తిరిగి తీసుకువెళ్ళినా ఫాతిమా మళ్ళీ పంపిస్తుందని తెలుసుగాబట్టి పఠాను ఆశర్ఫీల సంచిని ఆయన దగ్గర పెట్టి, "అదంతా నాకు తెలియదు. మీకు డబ్బులిచ్చాను. మీరేం చేస్తారో అది చేసుకోండి. నేను వెళుతున్నాను." – అన్నాడు లేచి నిలబడుతూ.

"తప్పదంటే ఒక పని చెయ్యండి ఖాన్‌గారూ. అక్కడ ఒక గూడు ఖాళీగా ఉంది. అందులో పెట్టండి ఈ సంచి. మీరు యాత్ర నించి వచ్చాక తీసుకువెళుదురుగాని." – అన్నాడు తుకారాం.

పఠాన్‌వ్యాపారి అశర్ఫీల సంచి తుకారాం చూపించిన గూట్లో పెట్టి వెళ్ళిపోయాడు.

భార్యాభర్తలిద్దరూ సంతోషంగా ఓడమీద మక్కామదీనా యాత్రకు బయలుదేరారు.

ఆరోజుల్లో ఈ యాత్ర పూర్తి చేసుకురావడానికి పదినెలలపైగా పట్టేది. దారిలో ఎన్నో ఇబ్బందులకు గురికావలసి వచ్చేది. ఎంతో మంది జబ్బుపడి ప్రాణాలు కూడా కోల్పోయేవారు. హజ్ నించి క్షేమంగా ఇల్లు చేరగలమన్న నమ్మకం లేదు. అంతా దైవాధీనం.

మంచి మనసు, దేవునియందు నమ్మకమూగల ఖాన్‌సాహెబ్ దంపతులు యాత్ర పూర్తిచేసుకొని క్షేమంగా ఇల్లు చేరారు. తిరిగి సంసార జంజాటంలో పడ్డారు. హజ్‌యాత్రలో అనుకున్నదానికన్నా ఖర్చులు ఎక్కువ కావడంతో చేతిలో పైసా మిగల్లేదు.

దాంతో సంత్ తుకారాం దగ్గర దాచిన డబ్బులు తెచ్చుకోవడానికి వెళ్లాడు ఖాన్. సంత్‌గారికి నమస్కరించి తను వచ్చిన పని చెప్పాడు. "అయ్యా! పది నెలల క్రిందట నేను హజ్‌కు వెళుతూ మీ దగ్గర వంద అశర్ఫీల సంచి అమానతుగా దాచిపెట్టాను. ఇప్పుడు నాకు వాటి అవసరం కలిగింది. దయచేసి వాటిని ఇస్తే తీసుకువెళతాను." – అన్నాడు ఎంతో వినయంగా.

తుకారాం కాసేపు ఆలోచించి, "పఠానుగారూ! పూజలు చేసుకోవడం, అభంగాలు రాసుకోవడంలో క్షణం తీరికలేక నేను వాటిగురించే మర్చిపోయాను. మీరు సంచి ఎక్కడ పెట్టారో అక్కడ చూడండి" – అన్నాడు.

యూసఫ్ గూడు దగ్గరకు వెళ్లాడు. గూడంతా దుమ్మూ ధూళి బూజులతో నిండి పోయి ఉంది. తను పెట్టిన సంచి పదినెలలుగా ఎవరూ తాకలేదన్న గుర్తుకి సంచిమీద పేరుకుపోయిన దుమ్మూ బూజులే సాక్ష్యం. ఖాన్‌గారు దుమ్మంతా దులుపుకొని సంచీ తీసుకుని ఇంటికి వచ్చాడు.

తలుపు వేసుకొని సంచి ఊడదీసి అశర్ఫీలు లెక్కపెట్టాడు. తొంభైఐదు ఉన్నాయి. పొరపాటు పడ్డానేమో అనుకొని మరోసారి జాగ్రత్తగా లెక్కపెట్టాడు. ఐదు అశర్ఫీలు తగ్గాయి. ఎవరు తీసుకుంటారు? వాటిని కాజేసే అవకాశం ఎవరికుంది? ఇంకెవరు? తుకారాంకి తప్ప మరెవరికీ వాటి సంగతి తెలియను కూడా తెలియదు గదా! ఫాతిమాకి ఆ సంత్‌గారి మీద అంతులేని నమ్మకం. ఈ సంగతి చెప్పినా ఆమె నమ్మదు.

ఖాన్ సాహెబ్‌కి ఒళ్లు మండిపోయింది. నమ్మినందుకు ఎంత దగా, ఎంత మోసం చేశాడు! పైకి పెద్ద భక్తుడిలా వేషం. మాటలు చూడబోతే పరమవైరాగ్యం. పనులు మాత్రం ఇలాగ. ఆలోచిస్తున్నకొద్దీ ఆగ్రహం పెరిగిపోసాగింది. ఇక ఆగలేక తుకారాం

**జ్ఞానమంతటికీ మూలం ఆత్మజ్ఞానం.**

ఇంటికి బయలు దేరాడు. దారంతా తుకారాంని తిడుతూనే ఉన్నాడు. విమర్శిస్తూనే ఉన్నాడు.

మొదట యూసఫ్‌ఖాన్ మాటలు ఎవరూ నమ్మలేదు కానీ అతడు గుండెలు బాదుకుంటూ, ఆవేశంతో తిడుతూ ఉంటే నమ్మక తప్పలేదు. నిజమే అయి ఉంటుంది  పాపం! వట్టి పుణ్యానికి ఒక పెద్దమనిషిని, అందునా పరమభక్తుడిని అలా బజారున పడి తిడతారా ఎవరైనా? అని అనుకున్నారు.

అంతకుముందు తుకారాం అంటే గిట్టని వాళ్లు సందుదొరికిందే చాలని ఖాన్‌సాహెబ్‌కి మద్దతుగా ఇంటిమీదికి వచ్చారు. మనసులో ఉన్న అక్కసు తీరా సూటీపోటీ మాటలతో నిందలు వేశారు.

అంతమంది గుంపుగా కలసి అన్ని తిట్లు తిడుతున్నా, అన్యాయంగా దొంగతనం అంటగట్టి నిందలు వేస్తున్నా – సంత్ తుకారాం ఏమాత్రం కోపం తెచ్చుకోలేదు. నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోయాడు. దీంతో జనం నమ్మకం మరింత బలపడింది. "డబ్బులు నిజంగానే కాజేసి ఉంటాడు. లేకపోతే నాకేం తెలియదు. నేను తీసుకోలేదు అనైనా అనేవాడు కదా! నోరుమూసుకుని గుడ్లప్పగించి బెల్లంకొట్టినరాయిలాగా ఎందుకుంటాడు" – అనుకొని మరింత రెచ్చిపోయారు. భక్తి ముసుగులో మోసం చేస్తున్నావన్నారు. ప్రజల కళ్లలో దుమ్ముకొడుతున్నావన్నారు.

తిట్టితిట్టి అలసిపోయిన యూసఫ్ ఇంటికి తిరిగి వెళ్లాడు. గుమ్మంలోనే పట్టుకుంది ఫాతిమా. "ఎంత అజాగ్రత్త మనిషివి! బాధ్యతలేని మనిషివి! అశర్ఫీల మూట ఊడదీసి నట్టింట్లో పడేసి ఎక్కడికి వెళ్లావు?" – అంటూ విరుచుకుపడింది.

జరిగిందంతా చెప్పాడు పఠాను – ఐదు అశర్ఫీలు తక్కువ వచ్చినట్లు, తుకారాం ఇంటికివెళ్లి దుమ్ముదులిపివచ్చినట్లూ.

"నీలాంటి తొందరమనిషిని నేనెక్కడా చూడలేదు. నీకేది తోస్తే అది చేసెయ్యడమేనా? ఆలోచించే పని లేదా? ఆవేశంలో వివేకం నశిస్తుందని తెలియదా? కనీసం నాతో ఒక్కమాట చెప్పినా బాగుండేది గదా!" అని మండిపడింది.

"ఇప్పుడేమయింది? తుకారాం నిజాయితీపరుడు, పరమభక్తుడు అని తెగపొగిడావు. చూశావా ఇప్పుడేం జరిగిందో?" – అన్నాడు తనూ తగ్గకుండా.

"తుకారాంగారు అలాంటి నీచపు పనులు ఎప్పుడూ చెయ్యరు. ఆయనేగాని అలాంటి పనులు చేస్తే నిప్పుకు చెదలుపట్టినట్లే" – అంది ఫాతిమా.

"సామెతలు చెప్పడం కాదు. ఐదు అశర్ఫీలు కాజేసినదాని గురించి చెప్పు." – అన్నాడు యూసఫ్.

"మనం హజ్‌యాత్రకు వెళ్లేటపుడు దారిలో అవసరాలకు అక్కరకు వస్తాయని ఐదు అశర్ఫీలు ముందే తీసి నాదగ్గరుంచుకున్నాను. తొంభై ఐదు అశర్ఫీలున్న సంచే నీకిచ్చాను. అటువంటి పవిత్రమైన మనిషి మీద అన్యాయంగా నిందలు వేసి పాపం మూట గట్టుకున్నావు. హజ్ యాత్ర చేసిన పుణ్యం అంతా బూడిదలో పోసిన పన్నీరయింది." – అంది బాధగా.

పఠాను గాబరాపడ్డాడు. "ఎంత పని జరిగింది? ఇప్పుడేం చెయ్యాలి?" – అన్నాడు దిక్కుతోచక.

"ఇప్పటికైనా మించిపోయింది లేదు. త్వరగా వెళ్లి తుకారాంగారిని క్షమాపణ కోరు. ఆయన నిన్ను తప్పక క్షమిస్తాడు. ఆయన క్షమిస్తే ఖుదా క్షమించినట్లే. చేసిన తప్పుఒప్పుకొని భవిష్యత్తులో మళ్లీ అలాటి పొరపాటు చెయ్యకుండా ఉండడమే ప్రాయశ్చిత్తం అంటే" – అని నచ్చచెప్పిందామె.

పఠాన్ యూసఫ్‌ఖాన్ తుకారాం దగ్గరకు వెళ్లాడు. ఆయన రెండుచేతులూ పట్టుకొని తన తప్పు క్షమించమని కోరాడు సిగ్గుపడుతూ.

సంత్‌జీ యూసఫ్‌ని ఆలింగనం చేసుకున్నాడు. "పఠాన్‌సాబ్! మీరేమీ బాధపడవద్దు. నిందలుగాని ప్రశంసలుగాని అన్నీ ఆ ప్రభువు ఇచ్చే ప్రసాదాలే." – అన్నాడు నవ్వుతూ.

పఠానుతో సహా చుట్టూ ఉన్నవాళ్లు ఆశ్చర్యానందాలు పొందారు ఆమాటలు విని. భగవద్గీతలోని స్థితప్రజ్ఞుడి దర్శనం అయినట్లు అనుభూతి పొందారు. తుకారాం సుగుణ సంపదకు జేజేలు పలికారంతా.

అనువాదం : విజయకుమారి

★★★

**మనిషి జీవితం క్షణికం. ఆత్మ సంస్కరణ దాన్ని అనంతం వరకు వ్యాప్తి చేస్తుంది.**

## ఆచరణలో అధ్యాత్మ

# ఆధ్యాత్మిక జీవన రహస్యం

ఆధ్యాత్మిక జీవనం, భౌతిక జీవనం పరస్పర విరుద్ధములని జనం భావిస్తారు. భౌతిక సంసారం మాయ అనీ, ఆత్మ పతనం కావడానికి కారణమనీ మన దేశంలో కొందరు మత పెద్దలు చెపుతారు. ఆ మాట నమ్మిన వ్యక్తులు సంసారాన్ని వదలి ఏకాకులుగా జీవిస్తారు.

ఈ దృక్పథం సముచితం కాదు. అలాంటి ఏకాకి జీవితం ఆధ్యాత్మిక జీవితమూ కాదు. ఇలాంటి బలవంతపు త్యాగం ఆత్మను ఉన్నతం చేయదు. పరీక్ష వచ్చినప్పుడు అది విఫలం కావచ్చుకూడా. కర్మయోగం ప్రకారం – భౌతిక, ఆధ్యాత్మిక పక్షాల సముచిత సమన్వయమే నిజమైన ఆధ్యాత్మికత. అలాంటి జీవితంలో ఆత్మిక చేతన భౌతిక పదార్థాలవల్ల ఆటంకపడదు. దీనితో పాటు జీవితంలోని రోజువారీ పనులనుండి తప్పుకునే అవసరమూ ఉండదు.

మన జీవితంలో ఆధ్యాత్మిక, భౌతిక పక్షాలకు సమానమైన ప్రాముఖ్యం ఉండాలన్నది కాదు దీని అర్థం. ప్రధానమైన జీవన లక్ష్యాన్ని సాధించడంలో భౌతిక పదార్థాల కన్న ఆత్మకు హెచ్చు విలువ ఇవ్వడం తప్పనిసరి. భౌతిక వస్తువులను లక్ష్యాలుగా కాక సాధనాలుగా మాత్రమే పరిగణించాలి. భౌతిక వస్తువులను ఆత్మయొక్క ప్రకటీకరణకు వినియోగించాలి. గాయకునికి సహకారిగా ఉన్నంతవరకే వాద్యం యొక్క ఉపయోగం. వాద్యం చెడిపోయి గానానికి తోడ్పడకపోతే – అది బరువుగా మిగిలిపోతుంది. అలాగే – ఆత్మిక జీవన ప్రవాహ ప్రకటీకరణకు సహకారిగా ఉన్నంతవరకు భౌతిక పదార్థాలు పనికివస్తాయి. ఆ ప్రవాహానికి అడ్డు తగిలితే అవి ఇబ్బంది కలిగిస్తాయి.

సాంసారిక వాసనలలో, దాహాలలో చిక్కుకున్న వ్యక్తి భౌతిక జగత్తుకే పెద్దపీట వేస్తాడు. త్రాగుబోతుకు మద్యమే సర్వస్వం. లోభికి వెండి బంగారాలే సర్వస్వం. భోగపరాయణునికి ఇంద్రియ సుఖాలే సర్వస్వం. ఇలాంటి పరిస్థితులలో భౌతిక వస్తువులు ఆత్మపై అధికారం చెలాయిస్తాయి, లేనిపోని పెత్తనం చేస్తాయి. ఈ స్థితి మనిషిని పతనం చేస్తుంది. ఫలితంగా అతడు కష్టాలు పడవలసివస్తుంది. కానీ, ఈ కారణంవల్ల భౌతిక జగత్తును వదిలివేయకూడదు. భౌతిక జీవనం ఆత్మయొక్క అధికారాన్ని అంగీకరించాలి, ఆత్మను ప్రకటించాలి. కావసింది ఇదే.

ఆత్మకూ, వస్తు జగత్తుకూ మధ్య నిజమైన వ్యవస్థ ఏర్పడినప్పుడు – జీవితంలోని విభాగాలన్నీ ఆత్మయొక్క దివ్యత్వాన్ని ప్రకటించడానికి వినియోగపడతాయి. అప్పుడు రోజువారీ జీవితంనుండీ, దాని ఒడిదుడుకులనుండీ పారిపోవలసిన అవసరంఉండదు. అప్పుడు భౌతిక పదార్థాలు ఆత్మ ఇచ్చే ఆజ్ఞలను పాటిస్తాయి. వాటికి తమదంటూ విలువ ఏదీ ఉండదు. అవి వాటికవిగా మంచివీ కావు, చెడ్డవీ కావు. ఆత్మను ప్రకటించడంలో, వ్యక్తీకరించడంలో సహకరిస్తే అవి మంచివి అవుతాయి, అడ్డుపడితే అవి చెడ్డవి అవుతాయి. సైనికుడికి యుద్ధం చేయడానికి గుర్రం అవసరం అవుతుంది. కానీ, గుర్రం అతడి సైగప్రకారం నడవక తన ఇష్టం వచ్చినట్లు నడిస్తే – అది అతడికి ఆటంకం అవుతుంది. అలాగే – ఈ వస్తు జగత్తును ఆత్మకు వాహనంగా వినియోగించాలి. అప్పుడు దానిద్వారా ఆత్మయొక్క శక్తులు వ్యక్తం అవుతాయి. ఆత్మకు లోబడి ఉండడానికి ఒప్పుకొనకపోతే – ఆ జగత్తు అడ్డుగోడ అవుతుంది. మానవ శరీరం ఆధ్యాత్మిక లక్ష్యాన్ని సాధించడానికి సహాయకారి అయితే – అది ఈ భూగోళంమీద ఉన్న దేవాలయం అవుతుంది.

ఇలాగే – ప్రపంచంలోని కళాఖండాలు, వైజ్ఞానిక ఆవిష్కరణలు, రాజకీయ సాఫల్యాలు కూడ ఆధ్యాత్మిక జీవనానికి సహాయకారి కాగలుగుతాయి. నేడు కళ చాలావరకు భోగ విలాసాలకు వినియోగపడుతోంది. వైజ్ఞానిక ఆవిష్కరణలు మానవ మారణహోమాలకు వినియోగపడుతున్నాయి. రాజకీయ సాఫల్యాలు ఇతర జన సముదాయాల వినాశానికి వినియోగపడుతున్నాయి. ఇది వాస్తవమే. అయితే ఇవన్నీ పొరపాటు కార్యపద్ధతుల ఫలితాలు. మనం మన దృక్పథాన్ని మార్చుకుంటే – వీటన్నిటినీ పవిత్రతకూ, ఆనందానికీ, జ్ఞానానికీ పుట్టిళ్లుగా మార్చవచ్చు.

ఆధ్యాత్మిక జ్ఞానం జీవితానికి పూర్ణత్వాన్నీ, నిండుతనాన్నీ ఇస్తుంది. ఆధ్యాత్మిక జ్ఞానం వేరు; ప్రపంచ జ్ఞానం వేరు. ప్రపంచంలోని ఆచార వ్యవహారాలను గ్రుడ్డిగా అనుసరించడంలో ఆధ్యాత్మికత రాణించదు. ఎందుకంటే – పెక్కు సందర్భాలలో ప్రాపంచికమైన ఆచారాలు, నియమ నిబంధనలు ప్రపంచంలో ఆసక్తి కలిగిన వ్యక్తుల పనుల ఫలితాలుగా ఉంటాయి. కనుక – పూర్వాచారాలను గ్రుడ్డిగా అనుసరించడం విజ్ఞత కాదు. అది ఆధ్యాత్మికతను పెంచదు. వస్తువుల వాస్తవ స్వరూపాన్నీ, విలువనూ సరిగా తెలుసుకోవడం, వాటిని సరిగా వినియోగించడం – ఇదే ఆధ్యాత్మిక జీవనం.

★★★

**శరీరం కోసం చేసేటంత పని ఆత్మకోసం చేస్తే – మనిషి దేవత అవుతాడు.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 9

# ఆలోచనలో అద్భుత ఆకర్షణ శక్తి

### ఆకాశతత్వము

ఆకాశతత్వము మిగిలిన నాలుగు తత్వములకంటె సూక్ష్మతరమగుట వలన అధికశక్తి శాలియైయున్నది. విశ్వవ్యాప్తమై శూన్యమందు ఒక శక్తి తత్వము పరిపూర్ణమైయున్నది. దానిని ఆంగ్లభాషలో "ఈథర్" అని పిలుస్తారు. ఆకాశమును శూన్యముగా భావించవద్దు. ప్రత్యక్షానుభవం కలుగకపోయినా ఆకాశతత్వము యొక్క అస్తిత్వము నిస్సందేహముగా సత్యము.

రేడియోద్వారా పాటలు, వార్తలు, ప్రకటనలు మనము వింటూనే ఉంటాము. అవి ఈథర్‌లో ప్రకాశతత్వంలో తరంగాల రూపములో ప్రయాణం చేస్తున్నాయి. నీటిలో మట్టిగడ్డ విసిరితే తరంగాలు బయలుదేరినట్లు, అవి జలాశయముయొక్క అంచువరకు చేరుకున్నట్లు ఈథర్‌లో శబ్ద తరంగా లుత్పన్నమై విశ్వమంతటా వ్యాపిస్తున్నాయి. ఈ విజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని రేడియో కనిపెట్టబడింది. ఒకచోట నుండి శబ్దతరంగములు విద్యుత్తరంగములలో కలుపబడి అధిక శక్తితో ప్రసారము చేయబడుతాయి. మరోచోట రేడియోని ట్యూన్ చేస్తే ఆ ప్రసారిత తరంగాలు గ్రహింపబడి ప్రేషితమైన సందేశాన్ని వినిపింపజేస్తాయి.

వాణి నాలుగు విధాలుగా ఉంటుంది.

**1. వైఖరీవాణి** : ఇది నోటి నుండి వెలువడి చెవితో గ్రహింపబడుతుంది. దీనినే శబ్దమని పిలుస్తారు.

**2. మధ్యమవాణి** : సంకేతములవలన, ముఖాకృతి వలన, నేత్ర భావ భంగిమలద్వారా చెప్పబడినది. ఇదియే భావము.

**3. పశ్యంతీవాణి** : మనస్సు చేత ప్రసారం చేయబడి మనస్సు చేతనే గ్రహింపదగినది. దీనినే ఆలోచన అంటారు.

**4. పరావాణి** : ఇది ఆకాంక్ష, కోరిక, నిశ్చయము, ప్రేరణ, శాపము, వరదానము మొదలైన రూపములలో అంతఃకరణ యందు మెదులుతూ ఉంటుంది. దీనినే సంకల్పమని పిలుస్తారు.

ఈ నాలుగు రకాలైన వాక్కులు ఆకాశంలో తరంగాల రూపంలో ప్రసారిత మవుతుంటాయి. వ్యక్తియొక్క ప్రభావాన్ననుసరించి అతడు ప్రసారము చేసిన శబ్దము, భావము. ఆలోచన, సంకల్పము ఆకాశములో అంత ప్రబలమై ప్రసారం చేయబడుతుంది.

ఆకాశమందు అసంఖ్య ప్రకృతులు కలిగిన లెక్కకు మీరిన వ్యక్తుల ద్వారా, అసంఖ్య ప్రకారములైన స్థూల, సూక్ష్మ శబ్దావళి ప్రేరితం కాబడుతూ ఉంటుంది. మన మనస్సు ఏ కేంద్రము మీద స్థిరమైతే ఆ జాతియొక్క అసంఖ్య ప్రకారములైన ఆలోచనలు మన తలలో దూరి వాని పూర్వ సిద్ధాంత, విచారములకు పుష్టి కలిగించుట ప్రారంభిస్తాయి. మనస్సు వ్యభిచారం వంకకు మరలితే విశ్వమందుగల అసంఖ్య వ్యభిచారుల నుండి ఆకాశంలోనికి ప్రసారం చేయబడిన శబ్ద, భావ, ఆలోచన, సంకల్పములు మనపైన వర్షించి మనను ఆ మార్గంలో ఉత్సాహితులను చేస్తాయి.

మనచే నిర్మితమైన ఆలోచనా ధారలో ఒక మౌలికమైన ఆకర్షణ శక్తి ఉంటుంది. అదే విధమైన ఆలోచనలు ఆకాశము నుండి మనచే ఆకర్షించబడతాయి. రేడియోను ఒక మీటరుకు ఆన్‌చేస్తే, ఆ ప్రత్యేకమయిన స్టేషనులో ప్రసారమయ్యే కార్యక్రమాలు మాత్రమే వినిపిస్తాయి; ఇతర రేడియో స్టేషన్లు ప్రసారము చేసే కార్యక్రమాలు వినిపించవు. అదే విధంగా మనకు తగిన ఆలోచనలను మాత్రమే మనం ఆకర్షించుకో గలుగుతాము.

శవాన్ని చూచి ఒక కాకి అరిస్తే వందలాది కాకులు అక్కడ గుమిగూడుతాయి. అదే విధంగా ఆలోచనలుగూడ స్వజాతిని పిలిచి ఒక గొప్ప విశేషమైన సేనను తయారుచేసుకుంటాయి. సైన్యము యొక్క ప్రాబల్యాన్ననుసరించి ఆ ఆలోచనలు ఆ ప్రత్యేక దిశలో కార్యోన్ముఖమై దండు వెడలుతాయి.

ఆకాశతత్వము యొక్క ఈ ప్రత్యేక లక్షణాన్ని దృష్టిలో ఉంచుకొని, మనస్సు దురాలోచనలనుండి విషయుక్త సర్పముల నుండివలె సావధానంగా ఉండాలి. లేకున్న అది అనేకములైన స్వజాతీయ దురాలోచనలను ఆహ్వానించి మనను సంకటంలో పడవేయుట తథ్యము. మన మనస్సులో ఎటువంటి దురాలోచనలు తల ఎత్తినా వెంటనే వానిని త్రుంచివేయాలి. లేకపోతే అది సంపూర్ణ మానస క్షేత్రాన్ని కలుషితం చేస్తుంది. ఒక చుక్క విషం మొత్తం భోజనాన్ని విషయుక్తం చేయదా?

**చెమటోడ్చి సంపాదించిన డబ్బు సత్క్రమంగా ఖర్చవుతుంది.**

మనసునందు ఎల్లప్పుడు ఉత్తమ, ఉచ్చ, ఉదార, సాత్వికభావ, సదాలోచన సమన్వితమైన ఆలోచనలకు మాత్రమే తావునీయాలి. అప్పుడు అదేవిధమైన సదాలోచన ఆకాశము నుండి మనపైన వర్షించి ప్రోగుబడి, మనలను సన్మార్గము దెసలో ప్రేరేపించి, ఉత్తమమైన విషయములనే ఆలోచింపజేసి, స్వాధ్యాయము, మననము, ఆత్మచింతనము, పరమార్థముల ద్వారా ఉపాసనామయ మనోభూమికను సిద్ధముచేసి కళ్యాణమయ కార్యములను మనము చేయ ప్రేరేపించును. ఉచ్చ ఆలోచనాధార ద్వారా సత్కార్యములు చేయుటద్వారా సద్గతి ప్రాప్తి కలుగును.

సంకల్పములు ఎప్పుడూ నశించవు. పూర్వకాలమందు ఋషులు, మునులు, సత్పురుషులయొక్క ఏ ఆలోచనా, ప్రవచన సంకల్పములున్నవో అవి ఇప్పటికినీ ఆకాశమందు ప్రతిధ్వనిస్తూనే ఉన్నవి. మన మనోభూమి అనుకూలంగా ఉంటే ఆ దివ్యాత్ముల యొక్క మార్గదర్శనము, అండ మనకు తప్పక లభిస్తాయి.

పరబ్రహ్మ యొక్క బ్రాహ్మీప్రేరణలు, శక్తులు, కిరణములు, తరంగములు ఆకాశము ద్వారా మానవ అంతఃకరణమునకు ప్రాప్తించును. దైవీశక్తులు, ఈశ్వరీయ వివిధ గుణయుక్త కిరణములుగూడ ఆకాశము నుండి మనసుద్వారా భూమికి అవతరిస్తాయి.

శివుడు ఆకాశవాణియైన గంగను తన శిరస్సున ధరించాడు. అప్పుడే గంగ నేలపై ప్రవహించినది. బ్రహ్మయొక్క సర్వోత్కృష్ట దివ్యశక్తి, ఆకాశవాహిని, గాయత్రీ గంగను సాధకుడు అన్నిటికన్నా ముందు తన మనోక్షేత్రమునకు దింపి ప్రవహింపజేస్తాడు. అందువలన సాధకునకు తన మనోక్షేత్రము శుద్ధమై, పరిమార్జితమై, స్వస్థమై, సచేతనమగును. అది గాయత్రివలన మాత్రమే సాధ్యము. మరి వేరు ఉపాయము లేదు.

★★★

## రాణా, ఈ రొట్టెలు...

దుద్ధా ఒక భిల్లు బాలుడు. అతని తండ్రి మహారాణా ప్రతాప్ సైన్యంలో ఒక సైనికుడు. గొప్ప వీరుడు. యుద్ధంలో వీర మరణాన్ని పొందాడు. కుటుంబంలో దుద్ధా, అతని తల్లి మిగిలారు. ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉంది. ఒకసారి రెండురోజుల దాకా వారికి తినడానికి ఏమీ లేదు. మూడవ రోజున తల్లి దుద్ధా కొరకు మందమైన రొట్టెలు, గడ్డితో పచ్చడి చేసి ఉంచింది. శత్రువుల కళ్లు గప్పి తల్లి ఎలాగో రొట్టెపిండి తేగలిగింది. దుద్ధా ఒకసారి తల్లివైపు చూశాడు. మరోసారి రొట్టెలవైపు చూశాడు. అతని మనస్సు వికలమయింది. చేయి రొట్టెలవైపు పోవడంలేదు. తల్లి దుద్ధాను అడిగింది – 'బాబూ, రెండురోజుల నుండి ఒక ముద్ద కూడా తినలేదు. రొట్టెలు ఎందుచేత తినవు? అమ్మ దగ్గర కూడా దాపరికమా.' బాలుడు చెప్పాడు – 'అమ్మా, మనం రెండు రోజుల నుండి మాత్రమే పస్తున్నాం. మన రాణా, ఆయన పసిపిల్లలు ఏడురోజుల నుండి ఎంగిలి పడలేదు. వాళ్ల పరిస్థితి ఏమిటి? ఈ ఆలోచనతో కొంచెం కూడా తినాలని అనిపించటంలేదు.'

దుద్ధా మాటలు విని తల్లి కళ్ల వెంట అశ్రుధారలు కారాయి. దుద్ధా తల్లికి కండ్లు తుడిచాడు. 'అమ్మా, ఏడువవద్దు. నేను ఇప్పుడే వెళ్లి రాణాకు రొట్టెలు ఇచ్చి వస్తాను' – అన్నాడు. దుద్ధా రొట్టెలు దుస్తులలో దాచుకొని మహారాణాప్రతాప్ దాగిఉన్న స్థలానికి బయలుదేరాడు. తల్లి అలా చూస్తూ ఉండిపోయింది.

రాత్రిపూట చీకటిలో దుద్ధా పరుగులు తీస్తూ వెడుతున్నాడు. శత్రు సైనికులు పహారా ఇస్తున్నారు. హఠాత్తుగా వారికి చీకటిలో ఏదో ఆకారం కనిపించింది. వాళ్లు తుపాకీ పేల్చారు. దుద్ధా చేయి నెత్తురు వరదైంది. సాహసంతో నిర్భయంగా బాలుడు రొట్టెల మూటను రెండవ చేతిలోకి తీసుకున్నాడు. ప్రాణాలకు లెక్క చేయకుండా శత్రువుల కళ్లుగప్పి పోతూ ఒక కొండగుట్ట ఎక్కసాగాడు. రాణా ఉన్నచోటు దాకా దుద్ధా చేరలేకపోయాడు. కొద్దిదూరం నుండి ఈలవేసి కుప్పకూలిపోయాడు. రాణా ఈ ఈల శబ్దాన్ని విని, అక్కడికి వచ్చి చూశాడు. దుద్ధా చివరిశ్వాస వదులుతున్నాడు. రాణా మధుర స్పర్శతో కండ్లు తెరిచాడు. చూశాడు. చిరునవ్వు నవ్వాడు. నెమ్మదిగా గొణిగాడు. – 'మహారాణా, ఈ రొట్టెలు.....మా అమ్మ.....' ఆపైన చెప్పలేకపోయాడు. సజల నయనాలతో రాణా దుద్ధా రక్తాన్ని తన నుదుట దిద్దుకొన్నాడు. కుంభల్ గఢ విజయానికి దుద్ధాయే కారణమేమో? అతడు అమరుడు. ఇట్టి వీర పుత్రులే భారతమాతకు గర్వకారణం.

**ఉపేక్షను మించిన తిరస్కారం లేదు.**

# ధారావాహిక : మనఃస్థితి మారితే మారుతుంది పరిస్థితి - 4

## మనస్సు ముఖ్యమా, సాధన సంపత్తి ముఖ్యమా?

చిరకాలం నుండీ ప్రపంచంలో రెండు సిద్ధాంతాల మధ్య సంఘర్షణ జరుగుతూ వస్తూన్నది. ఒక సిద్ధాంతం ఏమిటంటే - కోరుకున్నవన్నీ పొందగల్గితే మనిషి సుఖంగా, సంతోషంగా అభివృద్ధిని సాధించగలడు. మరొక సిద్ధాంతం ఉంది : "మనిషి మనస్సే పరిస్థితులను సృష్టిస్తుంది." దీనిని ఆధారంగా చేసుకునే కావలసిన ఉపకరణా సంపాదన, వాటిని సద్వినియోగం జరుగుతాయి. సద్వినియోగం జరగపోతే - కోరిన వస్తువు తగినంత పరిమాణంలో దొరికినా, దారిద్ర్యం, దుఃఖం వ్యాపిస్తూనే ఉంటాయి.

మనస్సును నియంత్రించగల్గితే, సంసారాన్ని నిర్వహించటానికి కావలసిన వనరులకు లోటు ఎప్పటికీ రాదు. ఎప్పుడైనా వచ్చినా ఆ దరిద్రంతోపాటు సంయమనం, సహానుభూతి, సంతోషం లాంటి సద్గుణములు మిళితమై ఉంటాయి. మొదటి సిద్ధాంతం ప్రకారం - ఉపకరణాలు ఎంత ఎక్కువగా ఉంటే అంత సుఖ శాంతులు దొరుకుతాయి. సమర్థత, సంపద ఉన్నట్లయితే - ఇతరుల సంపదను ఆక్రమించి, అనుభవించవచ్చు.

రెండింటికీ వాటి తర్కం, ఆధారం, ప్రతిపాదనలు ఉన్నాయి. రెండూ చిరకాలంనుండీ వాటి ఉనికిని నిలబెట్టుకుంటూ ఉన్నాయి. కాని ఏకాభిప్రాయం ఇంతవరకూ ఏర్పడలేదు. ఎవరికి వారు తమ అభిప్రాయం మీద స్థిర నిర్ణయం కల్గి ఉండటం వల్ల అప్పుడప్పుడు వీరి మధ్య సంఘర్షణ ఏర్పడుతూ ఉన్నది. దీనినే దేవాసుర సంగ్రామంగా పేర్కొనవచ్చు. "పదార్థంలోనే అంతా ఉన్నది" - అనేది దైత్య పక్షం వాదన. భావనలు భ్రాంతిగానూ, ప్రత్యక్షమే ప్రమాణంగానూ వీరు స్వీకరిస్తారు. దైవీ పక్షమువారు భావనలను ప్రధానంగానూ, పదార్థాన్ని భ్రాంతిగాను భావిస్తారు. వేదాంత పరిభాషలో వీటికి భౌతికత అనీ, ఆధ్యాత్మికత అనీ పేర్లు పెట్టారు. రెండు పక్షాల వారినీ తమ మాట మీద నిలబడేటట్లు చేస్తోంది పిడివాదం.

ఈ పరస్పర విరుద్ధ వైఖరులవల్ల - దేవతలు ఏదో విధంగా సంతృప్తి చెందుతారు, ఒక హద్దువరకు ఏకాభిప్రాయానికి వస్తారు. కానీ దైత్యులు ఎల్లప్పుడూ సంఘర్షణలోనే చిక్కుకుని ఉంటారు. వాళ్లు కేవలం దేవపక్షంతోనే కాక మోసగాండ్రతో, నేరస్థులతో, తమస్థాయి మనుషులతో తలపడుతూ ఉండాలి. అన్యాయంగా చేజిక్కించుకున్న సంపదలు వారిని ప్రశాంతంగా ఉండనివ్వవు. దోచుకున్నదానిలో ఎక్కువభాగం పొందాలనే ప్రవృత్తివల్ల వారిలో ఎల్లప్పుడూ ఘర్షణలు రాజుకుంటూనే ఉంటాయి.

అవసరానికి కావలసినన్ని సాధనాలు ఈ సువిశాల ప్రకృతిలో తగినంత పరిమాణంలో ఉన్నప్పుడు - వాటిని కలసి మెలసి పంచుకుని వాడుకునే సర్దుబాటు మనస్తత్వం అలవరచుకోగలిగితే ఎంత బాగుంటుంది? కాని దుర్బుద్ధి తెలివిగలవాళ్లం అనుకునే వ్యక్తుల శిరస్సు మీద ఎక్కి ఎందుకు తాండవమాడుతుందో తెలియదు. ఫలితంగా బలహీనులుగా చెప్పబడేవారికన్నా, సమర్థులు, శక్తిగలవారే ఎక్కువగా నష్టపోతున్నారు. ఇంతే కాదు. వారు ఉన్మత్త గజముల వలె ప్రవర్తించి, ఇతరులతో యుద్ధంచేసి, తమతమ ప్రదేశాలలోని మంచి ఉద్యానవనములను త్రొక్కి చిందరవందర చేస్తున్నారు. అప్పుడు వారు స్వయంగా అపకీర్తి పాలవుతున్నారు. ఆత్మ అనే నిప్పులో దూకి దగ్ధమవుతున్నారు. దానితోపాటు వాతావరణాన్ని బాధామయం చేస్తున్నారు. క్షణమైనా సుఖశాంతులతో ఉండలేరు, ఇతరులను ఉండనివ్వరు.

కలసిమెలసి పంచుకుతినగలిగేటన్ని సాధనాలను, వనరులను ప్రకృతి ఎల్లప్పుడూ సమకూర్చుతూనే ఉంటుంది. భవిష్యత్తులో ఇదే విధంగా కొనసాగుతుంది. కాని ప్రపంచంలో ఉన్నదంతా నాకే కావాలి. నేనే మూట కట్టుకోవాలి. మోహం, ఆత్రుత, "ఇంకా ఇంకా ఇంకా...." ఎంతో దాచుకోవాలన్నది వారి

**గొప్పవారు ఆశయాలపై, సగటు మనిషి సంఘటనలపై, అధములు వ్యక్తులపై చర్చిస్తారు.**

తపన. చందమామ దిగివచ్చి తమ ముంగిట్లో ఆడుకోవాలన్నది వారి కోరిక. కానీ భవిష్యత్తులో అటువంటి కోరిక నెరవేరుతుందనే ఆశ కనిపించటం లేదు. అమాయకుడైన పసివాడు తనకు తాను గందరగోళపడి ఇంట్లో వాళ్లను విసిగిస్తూ, ఆకాశానికి నిచ్చెనవేసి, చంద్రుడిని నేలమీదకు తీసుకురమ్మని పేచీ పెడితే ఏం చెయ్యగలం!

మనం అర్థం చేసుకొని ఇతరులకు అర్థంచేస్తే తప్ప దీనికి పరిష్కారం దొరకదు. మన ఆలోచనా ధోరణిని మార్చుకుంటే, ఎంతో ఇబ్బందిపెట్టే సమస్యనుకూడ చిటికెలో మాయం చెయ్యగలం. రంగుకళ్లద్దాలు పెట్టుకోవటంవల్ల ప్రపంచమంతా రంగులమయంగా కన్పడుతుంది. కళ్లజోడు తీసేస్తే ఆ గందరగోళం నుంచి బయటపడి ఏ వస్తువు ఎలా ఉంటుందో అలా కన్పడుతుంది. ప్రకృతి యొక్క సువిస్తృత వైభవం తన శరీరం మొదలు, సృష్టిలోని సమస్త ప్రాణుల పదార్థములలో అంతటా వ్యాపించి ఉన్నది. జరుగుబాటుకు అవసరమైనంత వరకు మాత్రమే దానిపై మన అధికారం పరిమితమై ఉన్నది. మిగిలినదంతా సృష్టిలో నివసించే జడచేతనముల కొరకు నిర్దేశింపబడింది. అన్నీ తమతమ బాధ్యతలను సరియైన రీతిలో నిర్వర్తిస్తూ సంతుష్టి చెందుతూ ఉండాలి. పిల్లలలా నవ్వుతూ నవ్విస్తూ ఆడుతూ పాడుతూ ఉండవచ్చు. కాని మనుషులు ఒకరి హక్కును ఒకరు ఆక్రమించటానికి, దురాక్రమణచేయటానికి సిద్ధమయితే, వారు పరస్పర స్నేహ సద్భావనలను కోల్పోతారు. పెద్దలచేత చీవాట్లు కూడ తింటారు.

మనం ఇటువంటి చెడు పిల్లలం కాకూడదు. ఎల్లప్పుడూ విజ్ఞతతో, నిజాయితీతో, బాధ్యతతో, సాహసంతో ఉండాలి. దొరికిన వాటిని న్యాయంగా విభజించి, పంచి, సదుపయోగం చేయాలి.

క్రమశిక్షణను పాటించడంలో ఉంది సభ్యత. మనకు మనం నీతిమంతులుగా ఉండటం, ఇతరులపట్ల ఉదారంగా వ్యవహరించటం – ఇదే మానవ జీవిత గరిమతో ముడిపడిన శిష్టాచారం. ఇంట్లో బాలురు, వృద్ధులు అసమర్థుల కొరకు ముందుగా ఏర్పాట్లు చేయాలి. ఆ తరువాత వ్యక్తి తన కోరికల వైపు దృష్టి సారించాలి. ఇదీ సదాచారం. అంతా తనకే చెందాలనుకునేవాడు ఉదారతకు దూరమవుతాడు. కఠోరత చూపించటంలో కూడ ఏమాత్రం వెనుకాడడు. ఇటువంటి వారికి ఇతరుల అధికారాలను హరించటానికి ఏమాత్రం సంకోచం, లజ్జ, భయం ఉండవు. ఇటువంటి జడత్వాన్ని అవలంబిస్తే – మానవ గౌరవ గరిమ మంటగలుస్తుంది.

ఈ రోజుల్లో రాక్షసత్వం అన్ని రంగాల్లోనూ ప్రబలి ఉన్నది. ప్రతి వ్యక్తీ తినటానికే కాక వృధా చేయటానికికూడ ముందుకు వస్తున్నాడు. సాధనాల సంఘర్షణలో పౌరాణిక కాలంనాటి సుంద ఉపసుందుల వలె, ఒకరినొకరు చంపుకుంటున్నారు. గర్హించదగిన ఈ దృష్టికోణాన్ని మార్చుకొనగలిగితే, వెనుకబడినవారికి ప్రాముఖ్యతనిచ్చి, వారి హక్కులను వారికి తిరిగి ఇవ్వగలిగితే, ఈ ప్రపంచంలో ఎంత సంపన్నత, ఆనందం, శాంతి నెలకొంటాయి! ఎవరికి వారు క్రమశిక్షణను ఏర్పరచుకొని, సంయమనాన్ని పాటిస్తూ, అనివార్యమైన అవసరాలను సమకూర్చుకుంటూ ఉన్నట్లయితే – దాని ప్రభావం ప్రపంచమంతటికీ విస్తరిస్తుంది. వ్యక్తి సత్ప్రవృత్తులను పెంపొందించడంలో తన సంపదలను వినియోగిస్తాడు. కృతయుగ వాతావరణాన్ని, స్వర్గమయ వాతావరణాన్ని నిర్మించగలుగుతాడు.

## మనఃస్థితి మారడమే పరిష్కారం

స్వర్గ నరక ద్వారాలు రెండూ ఒకదానితో ఒకటి అనుసంధించబడి ఉన్నాయి. గృహం ఒకటే. కాని ఒక ద్వారం గుండా వెళితే, మురికి, దుర్వాసనలతో కూడిన నరకం వంటి గది వస్తుంది. రెండవద్వారంలోనుండి వెళితే స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన, సుగంధపూరితమైన వాతావరణాన్ని దర్శించవచ్చు.

ఇప్పుడు మనం తగవులాడుకోవటం, కొట్టుకోవడం, దూషించుకోవడం, పరస్పర నిందారోపణలకు దిగడం ప్రారంభిస్తే – తక్షణమే, అవినీతికరమైన ఆత్మనిందకు లోనుగావలసివస్తుంది. బాహ్యమైన దెబ్బలను ఎంతైనా ఓర్చుకొనవచ్చు కానీ, అంతరాత్మ తీవ్రమైన బాధలకు లోనయితే, అది భరించశక్యం కానిది. కాలికి తగిలిన దెబ్బ, చేతికి అయిన గాయం భరించశక్యం గానివి కావు.

**నీకున్న సంపదతో తృప్తిపడు. నీకున్న జ్ఞానంతో తృప్తిపడకు.**

అపెండిసైటిస్, లేదా హృదయానికి తగిలిన దెబ్బవల్ల వచ్చే నొప్పి ప్రాణాంతకమైనది; మనిషిని తలక్రిందులు చేస్తుంది.

మానవత్వపు గరిమను కోల్పోయిన తర్వాత పొందగల్గినదేమీ ఉండదు. అందువల్ల అతనికి గర్వంగానీ, సంతోషంగానీ, ప్రసన్నత గానీ రావు. అతడు ఇతరులముందు గర్వంగా తల ఎత్తుకొని నిలబడలేదు. బయట వర్షం కురుస్తుంటే గొడుగు వేసుకొని మనల్ని మనం తడిసిపోకుండా రక్షించుకోగలం. కాని లోపలనుండి శాపాలు వర్షిస్తుంటే వాటినుండి ఎలా తప్పించుకోగలం? ఈ భూమిమీద నరకీటకాలు, నరపశువులు, నరపిశాచాలు తిరుగుతూ ఉన్నాయి. చూడటానికి వారు మనష్యులవలెనే ఉంటారు. అలవాట్లను బట్టి స్వభావాలు ఏర్పడతాయి. తద్వారా ఏర్పడిన ప్రకృతిని బట్టి తేడాను గమనించగలం.

నీచస్థాయివిగా పరిగణించబడే పశుపక్ష్యాదులకు నీతి నియమాలు, మర్యాదలు ఏమీ ఉండవు. గ్రద్దలు, కాకులు, నక్కలు వంటి పశువులకు భార్య, చెల్లెలు, పుత్రిక వంటి సంబంధాల తేడా తెలియదు. నాలుగు వీధుల కూడలిలో లైంగిక క్రియ జరపటం తప్పని తెలియదు. ఎక్కడ మలమూత్రాదులను విసర్జించాలో కూడ ఈ ప్రాణులకు తెలియదు. అవి ఎవడి పంటనైనా తినగలవు. చిన్న జలజంతువులను ఏమాత్రం దయలేకుండా నిస్సంకోచంగా మ్రింగగలవు. ఇది ఒక విలక్షణ ప్రపంచం. ఈ ప్రపంచంలో ప్రతిదానికీ కొన్ని హద్దులున్నాయి. కానీ, మనిషి కొన్ని ప్రత్యేక వరాలను పొంది జన్మించాడు. అతని గొప్పతనం సృష్టిలో అత్యున్నతమైనదిగా కీర్తించబడింది. కనుక - అతనికి కొన్ని ప్రత్యేకమైన బాధ్యతలు కూడ ఉన్నాయి. అతడు కొన్ని మర్యాదలను పాటించవలసి ఉంది. కొన్ని నిషేధాలను క్రమశిక్షణతో అమలు జరపవలసి ఉంది.

ఎవడిదగ్గరైనా కత్తి ఉన్నదంటే అర్థం - వాడు ఎప్పుడైనా ఎవడినైనా పొడిచివేయవచ్చని కాదు. మితిమీరిన తెలివికల్గి ఉండటమంటే - దాని సహాయంతో, ప్రపంచ వ్యవస్థను చెడగొట్టవచ్చని కాదు. విశృంఖలంగా అవినీతికి పాల్పడే లైసెన్సు వారికి ఇవ్వబడలేదు. ఆత్మ పరమాత్మల కళ్లుగప్పి, అహంకారంతో ఉన్మత్తులై, తన పనులద్వారా వాతావరణాన్ని ఉద్వేగంతో, చెడుపనులతో నింపడానికి ఈ చాతుర్యాలు వినియోగించ బడకూడదు.

దృష్టి సారించిచూస్తే - నాలుగువైపులా సమస్యలు, ఆపదలు, విపత్తులు, ద్రోహాలు, సంఘర్షణలు, కష్టాలు కానవస్తున్నాయి. ఏ ప్రకృతిమాత ఒడిలో పెరిగామో, ఏ తల్లి పాలు త్రాగి పెరిగామో, ఆ తల్లి మెడ విరిచి వెయ్యటానికి మనం సిద్ధపడుతున్నాము. ఎక్కడినుండైతే మనం అన్నం పాలు, నీరు, నెయ్యి స్వీకరించి ఈ దేహాన్ని ధారణ చేసి ఉన్నామో, ఆ సంపద మనకు సహోదరతుల్యమైనది. దానిని మనం నష్టపరిస్తే మన జీవితం కూడ పక్షవాతం వచ్చి సగభాగం చచ్చుబడిపోతుంది. భూగర్భనిధులను త్రవ్వి త్రవ్వి, భూమాతను వంధ్యగా చేస్తున్నారు. కార్ఖానాలు జలాశయాలలోని స్వచ్ఛమైన నీటిని విషపూరితంచేసి త్రాగటానికి పనికిరాకుండా చేస్తున్నాయి. ఆకాశం, వాతావరణం, అణుధూళితో కలుషితం నిరంతర కోలాహలంతో నిండిపోతోంది. పృథ్వియొక్క రక్షణ కవచం క్రమంగా బ్రద్దలయిపోవటం మనం గమనిస్తున్నాము. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతవల్ల మంచు ప్రదేశాలు కరిగి సముద్రం పొంగిపొరలి తద్వారా విస్తృత భూభాగాలు నీటిలో మునిగిపోయే స్థితి ఏర్పడుతోంది.

తేలు పిల్లలను గురించి వినే ఉంటారు. అవి తల్లిపొట్టను చీల్చుకొని బయటకు వస్తాయి. మనిషికూడ తేలు పద్ధతినే అనుసరిస్తున్నాడా అనిపిస్తోంది. వ్యక్తి ఈ జీవితాన్ని ధరించటానికి ఏ ప్రకృతి సహాయపడిందో, ఆ ప్రకృతినే సర్వనాశనం చేయటానికి అతడు ప్రయత్నిస్తున్నాడు. వ్యథచెందిన ప్రకృతి ప్రతీకారం తీర్చుకుంటుందా? అణ్వాయుధాలకు బదులుగా ప్రకృతి తానే సర్వనాశన కారకమైన ప్రళయాన్ని సృష్టిస్తుందా? దీన్ని గురించి ఆలోచించే తీరిక కూడ ఇప్పుడు ఎవ్వరికీ ఉండడం లేదు.

మనిషి తన తోటి మనుష్యునితో ప్రవర్తించే విధానం ఎంతో నిరాశాజనకంగా ఉంది. అతను తన సత్తాను, బలాన్ని టపాకాయవలె ప్రయోగించటానికి ఉవ్విళ్లూరుతున్నాడు.

**ఒక దీపంతో మరో దీపం వెలిగిస్తే - మొదటి దీపం కాంతి తగ్గదు.**

కళకళలాడే ఈ నేలపైన నివసిస్తూ మనం, ప్రేత పిశాచాల మాదిరిగా ఒకరినొకరు చంపుకోటానికి, తగులబెట్టుకోటానికి సిద్ధమవుతున్నాము. ఇందువల్ల పరస్పర సహకారం మాయమవుతోంది. వాతావరణంలో అవిశ్వాసం ఎంతగా పెరిగిందంటే – చివరికి వ్యక్తి తననీడను చూసి తానే భయపడవల్సి వస్తున్నది. విశ్వాసము, విశ్వాస ఘాతకత్వము రెండూ పరస్పరం సన్నిహితంగా ఉంటున్నాయి. మితిమీరిన విశృంఖలత్వం శారీరక, మానసిక ఆరోగ్యాలను నాశనం చేస్తోంది. డబ్బు మహిమ ఎంతగా పెరిగిందంటే – దానిని పొందటానికి పరమనీచమైన, క్రూరమైన పనులను చేయటానికి జనం వెనుకాడడం లేదు. ఇంతగా ప్రబలిన అనాచార, అవినీతికర వాతావరణంలో, శరీరం, మనస్సు, కుటుంబం, సమాజం, సమున్నతంగా ఉండగలవన్న ఆశ నశించిపోయింది.

సమయం అత్యంత క్లిష్టంగా ఉన్నది. ముందుకు పడుతున్న ఈ అడుగులు మానవీయ గరిమనే కాక బలాన్నికూడ అంతమొందిస్తాయని అనిపిస్తోంది. మనమంతా సామూహిక ఆత్మహత్యను ఆహ్వానిస్తున్నామా?

ఈ స్థితిని ఎలా మార్చగలం? ఈ సందర్భంగా రకరకాలైన ప్రతిపాదనలు, సాధనాలు, నిర్ధారణలు ఆలోచించబడుతున్నాయి. శాస్త్రవేత్తలు, మనీషులు, పాలకులు తమతమ ధోరణులలో ఆలోచిస్తున్నారు. ప్రస్తుత అనర్థాన్ని సువ్యవస్థగా మర్చడానికై గొప్పగొప్ప సాధనాలు అవసరం అవుతాయని వారు భావిస్తున్నారు. మరింత సాధన సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించడానికై పెద్దలు పెద్దపెద్ద చర్యలు తీసుకుంటున్నారనీ, పెద్దపెద్ద రాజ్యాంగాలను రూపొందిస్తున్నారనీ పలువురు చెపుతున్నారు. అయినా నిరాశను దూరంచేయడంలో సఫలత రవంతయినా కానరావడంలేదు. ఎందుకంటే – వాస్తవానికి మనఃస్థితియే పరిస్థితికి జన్మ నిస్తుంది. మనిషి మనస్తత్వంలో ఆదర్శవాదపు ఉత్కృష్టత చోటు చేసుకోకపోతే – పరిస్థితి మెరుగుకాదు. పైగా, ఆపదలు మరింత దగ్గరవుతాయి, తీవ్రతరం అవుతాయి. సమస్యల పరిష్కారం నేడు జరిగినా, వేయి సంవత్సరాల తర్వాత జరిగినా – అందుకు మార్గం ఒకే ఒకటి – మనఃస్థితిలో వ్యాపించి ఉన్న అవాంఛనీయతను నిర్మూలించడం; వెనుదిరిగిన ప్రవాహం దిశను తన ప్రచండ శక్తితో వెనుత్రిప్పే బలీయమైన చింతన వెలికిరావడం.

★★★

## దేవదూత సందేశం

కార్యక్రమ నిర్వాహకుల పన్నాగం మరొక రీతిగా ఉంది. వాళ్లు అనుకున్నది అనుకున్నట్లు చేయగల్గి ఉంటే భారతమాతకు సుపుత్రుడైన ఒక దివ్య పురుషుడు పై లోకాలకు వెళ్లి ఉండేవాడు. కాని స్వామీజీ ఏమాత్రం చలించలేదు. జంకుగొంకు లేకుండా సంతులనాన్ని కోల్పోకుండా సామాన్యమైన రీతిలో తన ప్రవచనం ఆరంభించారు. ఏసుక్రీస్తు యొక్క మహోన్నత త్యాగం, సేవాభావం, ఆత్మాహుతి మొదలైన గుణాలను గురించి వేనోళ్ల కొనియాడుతూనే స్వామీజీ క్రైస్తవ మిషనరీల స్వార్థపరత్వం గురించి వారొనర్చే దుష్కృత్యాలను గురించి దుమ్మెత్తి పోశారు. వివరాలు మీద వివరాలు ఇచ్చారు. ఎవరో దేవదూత తన శిష్యులను తీవ్రంగా మందలిస్తున్నాడా అని అనిపించింది.

చర్చి ఫాదరీలు నిస్సహాయులై మౌనంగా ఇదంతా వింటున్నారు. వారు మంత్రముగ్ధులైనారు. వారి ముఖాలలో పశ్చాత్తాపం తొంగి చూస్తున్నది. వారు పన్నిన పన్నాగం ఏమైపోయిందో తెలియదు. నిర్వాహకులలో ఒకరి నోటి నుండి ఈ మాటలు వెలువడ్డాయి, 'నేడు ఒక దేవదూత సందేశాన్ని వినే మహద్భాగ్యం మనకు లభించింది.'

వారి దుర్బుద్ధి, వారి కుతంత్రం వారి గుండెలను తొలిచివేస్తున్నాయి. సత్యం జయించింది. స్వాభిమానపూర్వకంగా, గౌరవ పురస్సరంగా స్వామి వివేకానంద వారి నుండి శెలవు తీసుకున్నాడు. స్వామీజీ దివ్యసందేశం, వారి నిర్భయప్రవృత్తి ధన్యమైనవి.

**తీవ్ర సంకల్పంతో సత్యాన్ని శోధించడం నిజమైన మతం.**

# ధారావాహిక : యువతరానికి మేలుకొలుపు - 4

# సాధన, సంయమనం, స్వాధ్యాయం, సేవ

## జీవన లక్ష్యాన్ని నిర్ణయించుకో

మనకు ఈ మానవ జీవితం ఎందుకు లభించిందో మనం తెలుసుకున్నాం. జీవితంలో మనం ఎదుర్కొనవలసి వచ్చిన పరిస్థితులన్నీ మన కర్మల ఫలములే. ఇప్పుడు కూడా మనం ఎలాంటి కర్మలు చేసినా, వాటి ఫలాలను మనమే అనుభవించాలి. ధర్మం యొక్క వాస్తవిక స్వరూపం ఏమిటో కూడా మనం అవగాహన చేసుకొన్నాం. మన కార్యకలాపాలన్నీ ధర్మానికి అనుగుణంగా జరగాలనే విషయాన్ని గుర్తించాం.

ఈ ఆధారంమీద మనం మన జీవన లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. డబ్బు సంపాదించడమే తమ ఒకేఒక లక్ష్యమని నేడు దాదాపు అందరూ నిర్ణయించుకున్నారు. విద్య లక్ష్యంకూడా ధన సంపాదనయేనని యువతరం భావిస్తున్నారు. విద్యయొక్క అసలు ప్రయోజనం ఇది; మన జ్ఞానం పెరగాలి; మన ప్రతిభ, మన సామర్థ్యం పెరగాలి; తద్వారా మనం సమాజానికీ మనకూ మంచి చేయగలగాలి. కానీ, నేడు విద్య వ్యాపారంగా మారిపోతోంది. జనం డాక్టర్లు కావాలని, ఇంజనీర్లు కావాలని కోరుతున్నారు. ఆ వృత్తులలో డబ్బు సంపాదించడానికి అవకాశాలు హెచ్చుగా ఉండడమే అందుకు కారణం. అలాంటి విద్యవల్ల ప్రయోజనం ఏముంది? చదువురాని వాళ్ళుకూడ డబ్బు సంపాదిస్తున్నారు. దొంగతనం, బందిపోటు, స్మగ్లింగ్, అపహరణ మున్నగు వాటిద్వారా కొద్ది సమయంలో హెచ్చు డబ్బు సంపాదిస్తారు. ఏదోవిధంగా డబ్బు సంపాదించడమే ముఖ్య ధ్యేయం అయినప్పుడు - దొంగలు - దోపిడీదార్లకూ, డాక్టర్లు - ఇంజనీర్లకూ తేడా ఏముంది? విద్యకన్న లక్ష్యం మిన్న. ఆ లక్ష్యం సముచితం అయితే, సమాజమంతకూ మేలు చేసేది అయితే, లోక కళ్యాణం అయితే - ఆ వ్యక్తి వందనీయుడు, పూజనీయుడు.

## యువ విప్లవవీరుల నుండి ప్రేరణ

మన జీవన లక్ష్యాన్ని నిర్ణయించుకునేటప్పుడు సుభాష్, గాంధీ, వివేకానంద, దయానంద, సర్దార్ పటేల్, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజగురు, సుఖదేవ్‌ల వంటి మహాయువ విప్లవవీరుల నుండి మనం ప్రేరణ పొందాలి. ఒక్కసారి ఢంకా బజాయించి మనం మన లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటే, ఫలితం కూడా అంతా ఉన్నతంగా ఉంటుంది. ఒకసారి లక్ష్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత - ఎన్నడూ దాన్ని మరువవద్దు. దృఢమైన ఇచ్ఛాశక్తితో ఆ మార్గంలో పురోగమించాలి. మార్గంలో ఎన్నెన్నో ఆటంకాలు ఎదురవుతాయి. వ్యతిరేకులు రకరకాల సమస్యలు సృష్టిస్తారు. అయినా - మీ సంకల్పం దృఢంగా ఉంటే, అవరోధాలన్నీ నెమ్మది నెమ్మదిగా తొలగిపోతాయి. ధైర్యంగా మీ మార్గంలో పురోగమించండి. వైఫల్యాలు ఎదురవుతాయి. మరోమారు ప్రయత్నించండి. మళ్లీమళ్లీ ప్రయత్నిస్తూ ఉండండి - లక్ష్యాన్ని చేరేవరకు. "ఉత్తిష్ఠత జాగృత ప్రాప్యవరాన్నిబోధత" - అనే సూత్రాన్ని మీ ధ్యేయ వాక్యంగా స్వీకరించండి. కష్టాలకూ, వైఫల్యాలకూ ఎన్నడూ గాబరాపడకండి. జీవితంలో ఎన్ని కష్టాలు వస్తే, ఎన్ని సమస్యలు ఎదురైతే - మన అంతర మనసులో వాటిని ఎదుర్కొనే సామర్థ్యం ఆ అనుపాతంలో పెరుగుతూ ఉంటుంది. మన ఆత్మ విశ్వాసం, దైవ విశ్వాసం దృఢంగా ఉంటే - ఏ ఆటంకం అయినా హెచ్చు సమయం మనముందు నిలువజాలదు.

## లక్ష్య సాధనకు నాలుగు మంత్రాలు

లక్ష్యాన్ని సాధించడానికీ, మార్గంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించడానికీ నాలుగు సూత్రాలను అభ్యాసం చేయాలి - సాధన, సంయమనం, స్వాధ్యాయం, సేవ. అలా చేస్తే - ఏ విషమ సమస్యనైనా ఎదిరించడానికి మిమ్మల్ని మీరు సన్నద్ధం చేసుకోగలుగుతారు. సైనికుడు నిరంతర అభ్యాసం ద్వారా యుద్ధంకోసం సదా సన్నద్ధంగా ఉంటాడు - యుద్ధం వచ్చే అవకాశాలు ఉన్నా లేకున్నా. అలాగే మనం కూడ జీవన సంగ్రామం కోసం తయారుగా ఉండాలి.

## సాధన

తనను తాను ఇలా తయారు చేసుకోవడమే సాధన. సోమరితనాన్నీ, పొరపాట్లనూ దరిచేయనివ్వకుండా నిర్ణీతమైన

శ్రమించకుండా వచ్చిన సంపద చెరుస్తుంది.

దినచర్య ఏర్పరచుకోవాలి. శారీరిక పరిశుభ్రత, ఆరోగ్యములపట్ల మెలకువతో ఉండాలి. బాహ్య పవిత్రతతోపాటు ఆలోచనల పవిత్రతకు కూడ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. మనసులో చెడు ఆలోచనలకు 'ప్రవేశం నిషేధం' (నో ఎంట్రీ) బోర్డు పెట్టాలి. ఎవరిపట్ల అయినా అసూయ, ద్వేషం, దుర్భావన, క్రోధం వంటి విషనాగులు తలలు ఎత్తితే – వాటిని వెనువెంటనే అణచివేయాలి. యువతరానికి అన్నిటికన్న పెద్ద సాధన తమ యోగ్యతలను, అర్హతలను పెంచుకోవడం. జనం అనుచిత మార్గాలలో డిగ్రీలు పొందవచ్చు. కానీ దానివల్ల వారి జ్ఞానం పెరగదు. ముందు ముందు వారు జీవన సంగ్రామంలో చిత్తుగా ఓడిపోతారు.

## సంయమనం

సంయమనం లేనిదే సాధన సాధ్యపడదు. మీ ఇంద్రియాలను కఠోరంగా అదుపు చేయండి. మీ వశంలో ఉంటే ఈ ఇంద్రియాలు సర్వశ్రేష్ఠుడైన మహాయోగి పాత్రను నిర్వహిస్తాయి. ఈ ఇంద్రియాలు విశృంఖలం అయితే, జీవితం నరకప్రాయం అవుతుంది. ఇంద్రియాలకు యజమాని అయిన మనస్సు మరిన్ని ఉపద్రవాలను సృష్టిస్తుంది. అది మనల్ని ఎక్కడెక్కడికో తీసుకువెళుతుంది, పెడదారి పట్టిస్తుంది. మన శక్తిని వృథా చేస్తుంది. మనషి మనస్సు గురించి ఒక కవి ఇలా వ్రాశాడు –

**మౌన హిలోర్ కిధర్ సె ఆతీ, కబ్ ఆతీ, క్యా ఆతీ ।**
**కౌన్ జాన్‌తా పర్ వహ నర్‌కో, కహా–కహా లే జాతీ ॥**

అనగా –

మనస్సు యొక్క మౌన తరంగాలు ఎక్కడ నుంచి వస్తాయో, ఎందుకు వస్తాయో ఎవరికి తెలుసు. అయినా, అవి మనిషిని ఎక్కడెక్కడికో తీసుకువెళతాయి.

ఈ మనస్సును అదుపు చేయడం అన్నిటికన్న అవసరమైన పురుషార్థం, అవసరమైన కార్యం. ఈ మనస్సే మన ఇంద్రియాలను కూడ పెడదారి పట్టిస్తుంది. నాలుకను అదుపులో ఉంచడం మన ఆరోగ్యం దృష్టిలో అతి ముఖ్యమైనది. యౌవనపు పొంగులో, ఉత్తేజంలో మనం ఇష్టం వచ్చినట్లు తినేస్తాం. మొదట్లో తెలియదు కాని – వయస్సు పెరిగిన తర్వాత, 40–45 సంవత్సరాల వయస్సులో శరీరంలో రకరకాల రోగాలు పుట్టుకువస్తాయి. యువతరం ఈ విషయంలో ప్రత్యేకంగా మెలకువ వహించాలి. బ్రహ్మచర్యాన్ని తప్పక పాటించాలి.

## స్వాధ్యాయం

సాధన, సంయమనాలద్వారా మన శరీరాన్నీ, మనస్సునూ ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనేలా తయారు చేయగలుగుతాము. స్వాధ్యాయం ఇందుకు ఎంతగానో సహకరిస్తుంది. ప్రేరణ ఇచ్చే ఆదర్శ సాహిత్యం చిమ్మచీకటిలో వెలుగుల వెల్లువగా పని చేస్తుంది. మంచి పుస్తకాలు చదవడం వల్ల వెనువెంటనే వెలుగు, ఉల్లాసం చేకూరుతాయి. ఆ గ్రంథాలను దైవ విగ్రహాలవలె ఆరాధించాలి.

## ఆత్మసమీక్ష

స్వాధ్యాయానికి మరో అర్థం కూడా ఉంది – తనను తాను అధ్యయనం చేయడం. ఆత్మ సమీక్ష చేస్తూ ఉండడంవల్ల మన లోపల ఏయే దోషాలూ దుర్గుణాలూ ఉన్నాయో తెలుస్తూ ఉంటుంది. వాటిని తెలుసుకుని ఆత్మ సంస్కరణ చేస్తూ ఉండాలి. ఈ ప్రక్రియ నిరంతరం సాగితే, మనం పలు విధములైన చెడుగులకు దూరంగా ఉండగలుగుతాము ప్రతి రోజూ నిద్రపోయేముందు రోజంతా మనం చేసిన పనులను తప్పకుండా సమీక్ష చేసుకోవాలి.

## పీడిత ప్రజల సేవ

సాధన, సంయమనం, స్వాధ్యాయముల ద్వారా మన వ్యక్తిత్వాన్ని వికసింప జేసుకుంటూ – మనం ఎల్లప్పుడూ ఇతరులకు సేవ చేయాలనే భావనను మనసులో నిలిపి ఉంచుకోవాలి. పరోపకారం జీవితానికి మౌలిక లక్ష్యమని గుర్తించాలి. మనవద్ద ఉన్న ప్రతిభ, సామర్థ్యం, ధన సంపత్తి – ఇవన్నీ మనం సమాజం యొక్క సహకారంతో ఆర్జించినవే. సమాజం చేసిన ఈ ఉపకారానికి ప్రత్యుపకారం చేయడం మన కర్తవ్యం. బలహీనులు, నిరుపేదలు, పీడితులు అయిన ప్రజల సేవకై తను, మన, ధనాలను సదా సమర్పిస్తూ ఉండాలి. మన ఆదాయంలో ఒక భాగం, కనీసం పది శాతం, ఇందుకోసం తప్పకుండా వినియోగించాలి.

## సంస్కారవంతుడవు కావాలి

మంచి వ్యక్తిగా, సంస్కారం శీలం కలిగిన వ్యక్తిగా మనల్ని మనం వికసింపజేసుకోవాలి. తల్లి దండ్రుల, అధ్యాపకుల, సమాజం యొక్క మార్గ దర్శనం మీకు లభించవచ్చు. అయితే, ఈ మార్గంలో నడవవలసింది మీరే. సంయమనం, సాధనల ద్వారా మంచి

**చేప కదలికకు నీరు సాయపడుతుంది. జీవుల కదలికకు ధర్మం సాయపడుతుంది.**

సంస్కారాలను అభ్యాసం చేయండి. కుసంస్కారాలతో నిండిన ఈ సమాజంలో జనం మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. దాన్ని గురించి పట్టించుకోకండి. నిర్ణీత మార్గంలో పురోగమించండి. పరిస్థితులు ఎలా ఉన్నా, వాటిని దృఢంగా ఎదుర్కొనండి. మనిషి పరిస్థితులకు దాసుడు కాడు. అతడు పరిస్థితుల నిర్మాత, నియంత, స్వామి. వ్యతిరేక పరిస్థితులలో సైతం నిజాయితీనీ, ధైర్య సాహసాలనూ నిలిపి ఉంచుకున్న వ్యక్తియే నిజమైన వీరుడు. సంస్కారవంతుడైన వ్యక్తిని గుర్తించే లక్షణం ఇదే.

## పొరపాట్లకు ప్రాయశ్చిత్తం చేసుకోండి

మనుషులే పొరపాట్లు చేస్తారు. పెద్దలూ పిన్నలూ అందరూ జీవితంలో వివిధ సమయాలలో పొరపాట్లు చేస్తూ ఉంటారు. ఇతరుల పొరపాట్లకు మనం చాలా త్వరగా ఉద్రేకపడతాం, వారిని శిక్షించాలని చూస్తాం. కానీ, మన పొరపాట్లను కప్పిపుచ్చుతాం ఎవరూ మనల్ని శిక్షించకుండా చూడడానికై శతవిధాల ప్రయత్నిస్తాం. ఇందులో సఫలత కూడ సాధిస్తాం. కనుకనే మనం మళ్లీ మళ్లీ పొరపాట్లు చేస్తూ ఉంటాం. వాటికి అలవాటు పడిపోతాం.

మన పొరపాట్లకు మనల్ని మనం శిక్షించుకునే స్వభావాన్ని మనలో వికసింపజేసుకోవాలి. మరొకరు మనల్ని శిక్షించడానికి ముందే మనం మన చెవులు పట్టుకోవాలి; చెంపలు వేసుకోవాలి; నీవు ఇలాంటి పొరపాటు చేసేటంతగా మూర్ఖుడవు అయినావా – అని మనల్ని మనం గద్దించుకోవాలి. ఒక న్యాయమూర్తివలె మన పొరపాటును తీవ్రంగా పరిగణించి, దానికి శిక్ష విధించాలి; ఆ శిక్షను కఠోరంగా అమలు చేయాలి. దీన్ని ప్రాయశ్చిత్తం అని అంటారు. ఇందువల్ల ఒక ప్రక్క కుటుంబంలో, సమాజంలో మన పరువు పెరుగుతుంది; మరోప్రక్క ఆత్మ సంతృప్తి కలుగుతుంది; అపరాధ భావన నుండి విముక్తి లభిస్తుంది; పరమేశ్వరుని శిక్షనుండి విడుదల లభిస్తుంది.

★★★

## సుభాష్ సజ్జనత్వం

అంటువ్యాధులు వ్యాపిస్తున్న సమయంలో సుభాష్‌చంద్ర బోస్ అధ్యక్షతన ఒక సేవాదళం ప్రారంభింపబడింది. సేవాదళానికి చెందిన స్వయంసేవకులు రోగుల ఇళ్లకు వెళుతున్నారు. రోగులకు మందులు ఇచ్చి శుశ్రూష చేస్తున్నారు. అంటురోగాలు రాకుండా కాపాడుకొనేందుకు ఆరోగ్య సూత్రాలు తెలియజేస్తున్నారు కూడా. ఆ ప్రాంతంలో హైదర్ అనే ఒక గూండా ఉన్నాడు. ఇలాంటి మంచి పనులు అంటే అతనికి ఇష్టంలేదు. అతను ఎన్నో నేరాలు చేశాడు. జైలుకు వెళ్లి వచ్చాడు. సేవాదళ్ సభ్యులంటే అతనికి గిట్టేది కాదు. వారికి విరుద్ధంగా ఉండేవి అతని చర్యలు. వారిని అతడు వ్యతిరేకించేవాడు. కుట్రలు పన్నేవాడు.

సుభాష్ బాబుకు ఇది తెలిసింది. ఆయన తన సహచరులను నిగ్రహంతో వ్యవహరించమని చెప్పాడు. ఆయన తన విశ్వాసాన్ని కూడా ప్రకటించాడు– 'చూడండి ఈ హైదరు ఏదో ఒక రోజున మనకు అందరికంటే ఎక్కువగా సహకరిస్తాడు.'

ఒకనాడు హైదరు కుమారునికి వ్యాధి సోకింది. డాక్టర్లు ఎవ్వరూ లభ్యంకాలేదు. నిరాశతో ఇంటికి తిరిగి వచ్చాడు. చూస్తే సేవాదళ సభ్యులు తన కుమారునికి ఉపచారాలు చేస్తున్నారు. హైదర్ నివ్వెరపోయాడు.

అతడు ఆ కార్యకర్తలను అడిగాడు, 'మీరు నా ఇంటికి ఎందుకు వచ్చారు? నేను మీకు గర్భశత్రువునని తెలుసుకదా!' సేవాదళ్ కార్యకర్తలు స్వయంసేవకులు చెప్పారు, 'ఇది మా ధర్మం, మిత్రమా. మేము వచ్చి ఉండక పోయినట్లయితే ఈ బాలుడి పరిస్థితి ప్రమాదంలో పడిఉండేది. మీ శత్రుత్వం మాతో ఉండవచ్చు. మీ కుమారుడు ఏ పాపమూ ఎరుగడు. సేవా కార్యంలో భేదభావాలకు తావు లేదు.'

ఈ మాటలతో హైదర్‌లోని కాలుష్యం అంతా కడిగివేయబడింది. అతని నేత్రాలనుండి అశ్రువులు రాలాయి. కన్నీరు తుడుచుకుంటూ అతడు చెప్పాడు, 'నా కుమారుని వంటివారు మీరు. అయినా నన్ను క్షమిస్తారుకదూ!' ఆ తరువాత అతను కూడా సేవాదళంలో సభ్యునిగా చేరిపోయాడు.

సజ్జనులకు శత్రువు అనేవాడే ఉండడు. సజ్జనులు పర హితాన్ని అభిలషిస్తారు. మిత్రులనీ, శత్రువులనీ వారికి పక్షపాతం ఉండదు.


**సింధువును చేరి బిందువు సింధువగును, ధ్యేయమునుబట్టి ప్రతి పని దివ్యమగును.**

# ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 27

# దీక్షా భూమికి యాత్ర - 3

### ఆలయాలు ధ్వంసం కావు

అన్నపూర్ణ ఆలయానికి చేరేసరికి శ్రీరామ్ బాగా ఖిన్నుడు అయినాడు. ఆలయం మెట్లు ఎక్కుతూ ఉండగా, ఆయనకు ఒక భిక్షుకుడు కనిపించాడు. అతడు ఎవరినీ ఏమీ అడగడం లేదు. వచ్చేపోయే జనాన్ని పరకాయించి చూస్తున్నాడంతే. అతడు చూచినప్పుడు మరొకరి చూపు కలిస్తే – అతడలా చూస్తూ ఉండిపోతాడు. భిక్షకుడి కళ్లలో విచిత్రమైన మెరుపు ఉంది. శ్రీరామ్ చూపు అతడి చూపుతో కలిసింది. అతడికి సదురూ బెదురూ లేదు. ఆ భిక్షకుడు ఇలా అన్నాడు –



"నీవు చూస్తున్న ఆలయాలు జీవం లేనివి. జీవం ఉన్న ఆలయాలను ఎవ్వరూ ధ్వంసం చేయలేరు. విచారపడకు. ముందు ముందు జీవం జవం ఉన్న ఆలయాలను నిర్మించే సంగతి ఆలోచించు. పాత ఆలయాలలో స్థాపించబడిన విగ్రహాలలో ఆయా దేవతలను ఆవాహన చెయ్యి."

శ్రీరామ్ విస్తుపోయారు. తమ మనసులో ఉన్నది ఈ భిక్షుకునికి ఎలా తెలిసింది ? తెలుసుకోవడమే కాదు. దానికి సమాధానం కూడ చెప్పాడు. అతడు మామూలు భిక్షుకుడు కాదని ఆయన అనుకున్నారు. అతడు భిక్షుకుని వేషంలో తనను తాను మరుగుపరుచుకొన్న ఒక సిద్ధ సాధకుడని ఆయన భావించారు.

పంచకోశీ పరిక్రమ పూర్తి చేసిన తర్వాత ఆయన తన మనసులో ఉన్న విషయాన్ని స్వామి విశుద్ధానంద ముందుంచారు. ఆలయాలపై దురాక్రమణ, వాటి విధ్వంసం, వాటి పునర్ నిర్మాణములను గురించి అడిగారు. స్వామీజీ ఇలా వివరించారు –

"ప్రాణ ప్రతిష్ఠకు కర్మకాండ చాలదు. ఆలయ వాతావరణం చైతన్యంతో, సాధన వలన లభించిన శక్తితో నిండి ఉండాలి. దేవశక్తి వైభవం అవిచ్ఛిన్నంగా ఉంటే, ఆ స్థలంలో నివసించడానికి అది ఇష్టపడుతుంది.

"హిమాలయంలోని సిద్ధిక్షేత్రంలో, సిద్ధాశ్రమంలో, జ్ఞాన గంజ్‌లో విజాతీయ (వ్యతిరేక) సంస్కారాలు కలిగిన వ్యక్తులు ప్రవేశించలేరు. ఆ స్థలం యొక్క తరంగాలు విరుద్ధ తత్వాలను ఆమడ దూరంలో ఉంచుతాయి. ఈ విషయాన్ని పరీక్షించాలంటే అక్కడివరకు వెళ్ళనవసరం లేదు.

"ఋషికేశ్ దుర్గమ క్షేత్రం కాదు కదా. పైన నీలకంఠ్ దాటి వెళితే, సిద్ధపురా అనే గ్రామం వస్తుంది. అక్కడ 40-50 ఇళ్ళు ఉన్నాయి. అన్నీ ఖాళీగా ఉన్నాయి. మామూలు వ్యక్తులు ఆ గ్రామం పొలిమేర దాటి లోపలికి వెళ్ళలేరు. ఎవరైనా, సాహసించి గ్రామం లోపలికి వెళితే అక్కడ పులులూ, సింహాలూ ఎదురవుతాయి. పాములు, కొండశిలువలూ, క్రూర జంతువులూ కానవస్తాయి. ఎవరూ లోపలికి రాకుండా ఈ ప్రాణులు పహారా కాస్తూ ఉంటాయి. సంస్కారీ, యోగ్యుడూ అయిన సాధకుణ్ణి ఇవి హింసించవు. సిద్ధపురాలో నివసించే యోగులూ, యతులూ ఎవరికి అనుమతి ఇస్తే వారే ఆ గ్రామంలో ప్రవేశించ గలుగుతారు. అలాంటి వ్యక్తులపై సిద్ధ జనుల అనుగ్రహం కూడ వర్షిస్తుంది. ఆలయం కాని, దేవస్థానం కాని, తపఃస్థలం కాని ఆయా స్థలాలలో నివసించే సాధకులవల్ల, సిద్ధ పురుషులవల్ల శక్తివంతములుగా నిలుస్తాయి.

**నవ్వడం భోగం. నవ్వించడం యోగం. నవ్వలేకపోవడం రోగం.**

"ఇతర స్థలాలలో కూడ ఇలాంటి సిద్ధ క్షేత్రాలు ఉన్నాయి. మామూలు దృష్టితో వాటిని కనుగొనలేము. అక్కడికి వెళ్లాలనే కోరికే కలగదు. కోరిక కలిగినా అక్కడికి వెళ్ళడం సాధ్యపడని పరిస్థితులు ఏర్పడతాయి."

విశ్వనాథ ఆలయం గురించి స్వామి విశుద్ధానంద ఇలా అన్నారు - వేయి, పన్నెండువేల సంవత్సరాల పూర్వం అక్కడ లభించిన శక్తి క్రమక్రమంగా నశించిపోయింది. ఎందుకంటే - ఆ శక్తిని నిలిపి ఉంచే సాధకులు అక్కడ లేరు. విశ్వనాథ ఆలయం పేరుతో ముందు ముందు నగరంలో పెక్కు మందిరాలు నిర్మాణం అవుతాయి. వాటిలో కొన్ని స్వర్ణ మందిరంకన్న భవ్యంగా ఉండవచ్చుకూడా. అయితే అవన్నీ దేవదర్శనానికీ, భజన పూజలకూ మాత్రమే వినియోగపడతాయి.

పంచకోశీ యాత్రలో శ్రీరామ్‌ను ఆకర్షించిన స్థలాలలో అక్షయవటం, అన్నపూర్ణ ఆలయం, కాశీ కరవత్, గోరఖ్‌నాథ్ మందిర్, తులసీఘాట్, కబీర్ చౌరా ప్రముఖమైనవి.

విశ్వనాథ ఆలయం యొక్క ఆధ్యాత్మిక రహస్యాన్ని వినికూడ శ్రీరామ్ సంతృప్తిచెందలేదు. స్వామి విశుద్ధానంద చెప్పిన మాటలు వాటి సందర్భంలో సరైనవే. కానీ - ఆలయం యొక్క దురవస్థ చరిత్ర, సంస్కృతుల దృష్టిలో శోచనీయమే.

యాత్ర ఫలితంగా శ్రీరామ్‌కు కాశీలోని చిన్న, పెద్ద ధర్మస్థలాలన్నీ పరిచయం అయినాయి.

కబీర్ చౌరా చేరగానే శ్రీరామ్‌కు విచిత్రమైన అనుభూతి కలిగింది. ఒకప్పుడు సంత్ కబీరు అక్కడ నివసించారు. కాశీలో చనిపోయినవారికి మోక్షం వస్తుందనీ, ఆ నగరం పొలిమేరల బయట చనిపోయేవారికి నరకం వస్తుందనీ ఒక గ్రుడ్డి నమ్మకం ఉంది. దీన్ని తొలగించడానికై కబీరు చివరి రోజులలో కాశీ వదలి వెళ్ళిపోయారు. అంతవరకు ఆయన కబీర్ చౌరాలోనే నివసించారు. ఆయన ఆసనం ఉన్న స్థలాన్ని దేవస్థానంవలె అలంకరించి ఉంచారు - అక్కడ దైవ విగ్రహం ప్రతిష్ఠించబడినట్లు. కబీరు గతంలో కూర్చున్న స్థలంలో, ఆ ఆసనం ప్రక్కన ఆయన టోపీ ఉంచబడింది. ప్రక్కనే ఆయన గురువు స్వామి రామానంద పటం ఉంది.

అక్కడి వాతావరణాన్ని చూచి, శ్రీరామ్ తనను తాను మరచిపోయారు. ఆయనకు ఇలా అనిపించింది - ఆసనంమీద కబీరు కూర్చొని ఉన్నారు. ఎదురుగా శ్రద్ధాళువులు ఉన్నారు. కబీరు వారి ఎదుట ఏదో పాట పాడి వినిపిస్తున్నారు. ఆ పాట బహుశా 'సాధో సహజ సమాధి భలీ' అనే మకుటం కలిగినది. 'ప్రతి పనిలో భగవానుని ఆరాధన' - అనే సందేశం ఆ పాటలో ఇమిడి ఉంది. ఆ పాట తానే పాడుతున్నట్లు శ్రీరామ్‌కు అనిపించింది కొద్ది క్షణాలపాటు.

దశాశ్వమేధ, మణికర్ణికా ఘట్టాలు తమ పౌరాణిక, చారిత్రక ప్రాముఖ్యం కారణంగా పేరొందాయి. వారణా సంగమం వెళుతూ శ్రీరామ్ దశాశ్వమేధానికి పలుమారులు వెళ్ళారు. ఈ ఘాట్ వారణ సంగమానికి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. పురాణాల ప్రకారం ఇక్కడ బ్రహ్మ పది అశ్వమేధ యజ్ఞాలు చేశాడు. కాశీ వచ్చి గంగా స్నానం చేసేవారు ఎక్కువగా ఈ ఘాట్‌నే ఎంపిక చేస్తారు.

మణికర్ణిక కూడ పౌరాణికంగా, చారిత్రకంగా ప్రముఖమైనది. ఘాట్‌వద్ద ఉన్న భైరవ కుండ్‌లో ఏడు రోజుల కొకసారి నీటిని తోడివేస్తారు. తోడివేసిన నీటి స్థానంలో లోపల జలంనుంచి స్వచ్ఛమైన నీరు సహజసిద్ధంగా ఊరుతుంది.

రామచరిత మానస రచించిన గోస్వామి తులసీదాసు శరీరం వదలిన స్థలం తులసీ ఘాట్. ఆ ఘాట్ వద్ద శ్రీరామ్‌కు దివ్య అనుభూతి కలిగింది. ఘాట్‌వద్ద గోస్వామిజీ స్థాపించిన హనుమంతుని విగ్రహం ఉంది. విగ్రహం వద్ద తులసీదాసు కూర్చునే స్థలంలో ఆయన చరణ పాదుకలు ఉన్నాయి. ఈ స్థలంలో తులసీదాసు రామకథను వినిపించేవారని చెపుతారు. హనుమంతుడు ఏదో రూపంలో స్వయంగా వచ్చి కూర్చుని రామకథ వినేవాడన్నది ప్రజల నమ్మకం. ఏదో ప్రత్యేక లక్షణం వల్ల తులసీదాసు ఆయనను గుర్తు పట్టాడు. హనుమంతుడే

"గడియారమా నీకు విశ్రాంతి ఎప్పుడు?" "టిక్కుకూ టిక్కుకూ మధ్య."

తనను తాను పరిచయం చేసుకున్నాడని కొందరు చెపుతారు. గోస్వామిజీ ఆయనకు ప్రణామం చేశారు. పూజ, అర్చన చేశారు. ఎక్కడ రామచరిత మానస ప్రవచనం జరిగితే అక్కడకు తాను ఏదో రూపంలో హాజరవుతాననీ, మొదటి నుంచి చివరి వరకు వింటాననీ అప్పుడు హనుమంతుడు మాట ఇచ్చాడు.

సంత్‌లూ, విద్వాంసులూ పేర్కొన్న ఈ సంఘటన తులసీ ఘాట్‌వద్ద శ్రీరామ్‌కు గుర్తు వచ్చింది. ఆయన హనుమంతుని విగ్రహాన్ని ఏకాగ్రతతో చూడసాగారు. అలా చూస్తూ ఉండగా ఆయన తన్మయులు అయినారు. తన ఉనికిని మరిచిపోయారు. ఒక్క హనుమంతుడే ఉన్నాడని ఆయనకు అనిపించింది. ఆ విగ్రహంలో స్పందన కనిపించింది. విగ్రహం కొద్దిగా ఒరిగినట్లు అనిపించింది. నెమ్మది నెమ్మదిగా జరిగింది. కాదు. విగ్రహం అక్కడే ఉంది. స్పందన, కదలిక ఊహ మాత్రమే. వాస్తవానికి ఆ విగ్రహం నుండి మరో విగ్రహం వెలువడింది. మళ్ళీ మరో విగ్రహం వెలువడింది. మళ్ళీ మరో విగ్రహం వెలువడింది. అలా నెమ్మది నెమ్మదిగా అనేక విగ్రహాలు వెలువడ్డాయి. చూస్తూ ఉండగానే, విగ్రహాలకు ప్రాణం వచ్చింది. హనుమంతుని సేన తన గుణ - స్వభావాలకు అనుగుణంగా గెంతుతోంది, దుముకుతోంది.

ఈ దృశ్యాన్ని అనుభూతి పొందుతూన్న శ్రీరామ్‌కు ఒక ఆలోచన వచ్చింది. రావణుడు ముల్లోకాలనూ జయించాడు. కాలాన్ని ఖైదు చేశాడు. అలాంటి రావణుని రాక్షసత్వాన్ని ఈ వానరులు అంతమొందించారు. భగవంతుడు తలచుకుంటే కేవలం సంకల్పబలంతో రావణుణ్ణి అంతం చేయగలడు. కానీ ఆయన క్షుద్ర ప్రాణులని పిలువబడేవారిచేత ఆ పని చేయించాడు. అసురత్వంతో సంఘర్షించే సూత్రం ఇందులో దాగి ఉంది.

శ్రీరామ్ కొంతసేపు ఈ భావ వీధిలో విహరించిన తర్వాత - దృశ్యం తనకు తానుగా అదృశ్యం అయింది. అంతా సహజ స్థితికి, యథాస్థితికి తిరిగి వచ్చింది.

జ్ఞానవాపి దగ్గర ఒక సందులో ఉన్న 'కాశీ కరవత్'ను చూడడానికి వెళ్ళినప్పుడు శ్రీరామ్‌కు ఒక విలక్షణ అనుభూతి కలిగింది.

కాశీ కరవత్ అనే స్థలంలో ఇప్పుడు ఒక బావి ఉంది. బావిలో చిమ్మచీకటి వ్యాపించి ఉంటుంది. బావిపైన మూతవేసి ఉంటుంది. లోపల శివలింగం స్థాపించబడి ఉంది. శుభ్రపరచడం, పూజ - హారతుల సమయంలోనే మూత తెరుస్తారు. పూజారి మెట్లుదిగి లోపలికి వెళతాడు. మామూలు సమయాలలో వచ్చే జనం ఆ మూతమీదనే అక్షతలూ, పువ్వులూ చల్లి తృప్తిపడతారు. ఒకప్పుడు బావిమీద దూలం ఉండేది. జనం దానిమీదకు దూకి తమను తాము బలి చేసుకునే వారు. ఇలా మృత్యువును వరించడంవల్ల సాయుజ్య ముక్తి లభిస్తుందని భావించేవారు.

## కాశీ కరవత్ రహస్యం

శ్రీరామ్ కాశీ కరవత్ వెళ్ళినప్పుడు దాన్ని గురించి ఎన్నో కథలు అక్కడి ప్రజలు చెప్పగా విన్నారు. వాటిలో ఆయనకు ఆసక్తి లేదు. ఆత్మహత్యకు ప్రాముఖ్యం ఇచ్చే ఈ తీర్థం గురించి ఆయన ఆలోచించసాగారు. ఆయన నలువైపుల నుండీ ఆ బావిని చూచారు. ఆత్మహత్యవల్ల మోక్షం వస్తుందనే ఈ నమ్మకం ఎక్కడ నుంచి పుట్టిందని ఆయన ఆలోచించారు. ఈ ఆలోచనతో ఆయన ముఖంపై వ్యంగ్యాత్మకమైన చిరునవ్వు విరిసింది. ఆయన తిరిగి గాంభీర్యం వహించారు. ఈ సంప్రదాయం వెనుక ఏదో అర్థం ఉండవచ్చునని ఆయనకు అనిపించింది.

కాశీ విశ్వవిద్యాలయంలోని ఒక విద్వాంసుడు కూడ అక్కడకు వచ్చి ఉన్నారు. శ్రీరామ్‌లోని గాంభీర్యం ఆయనకు మరోలా అర్థమయింది. ఎందువల్లనో ఆయన ఆకర్షితులు అయినారు. శ్రీరామ్‌తో పరిచయం పెంచుకున్నారు. తన పేరు శివరాజ్ గౌతమ్ అని ఆయన తెలిపారు. పేర్లు, కుటుంబాలు, నివాస స్థలాలు మున్నగువాటి పరిచయాన్ని ఇరువురూ ఇచ్చి పుచ్చుకున్నారు. గౌతమ్ కూడ బృందావనం సమీపంలోని మోర్

**సన్యాసిలా జీవించు. ఎద్దులా కష్టపడు. విజయం నీదే.**

గ్రామ నివాసి. గత 20 సంవత్సరాలుగా కాశీలో నివసిస్తున్నారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయ స్థాపన తర్వాత దానితో అనుబంధం ఏర్పరచుకున్నారు. "మీ ఉదాశీనతకు కారణం ఏమిటి?" – అని ఆయన శ్రీరామ్‌ను అడిగారు. శ్రీరామ్ ఇలా జవాబిచ్చారు –

"మన సమాజంలో ఎలాంటి మూఢత్వాలు వ్యాపించి ఉన్నాయి! ముక్తి వస్తుందని, స్వర్గం అందుతుందని వ్యామోహపడి, జనం తమ ప్రస్తుత జీవితాన్ని వదులుకునేవారు. ఇందులో విజ్ఞత ఏముంది?"

"మరో దృష్టితో చూస్తే – కాశీ కరవత్ జీవితం పట్ల అనాసక్తికీ, దాని వివిధ రూపాలను ఆమోదించడానికీ ప్రతీక కూడ. మన దేశం జీవితాన్ని వివిధ రూపాలలో ఆమోదించింది. మృత్యువు కూడ దాని రూపమే. తమ ఆంతరిక స్థాయిని శిఖరాగ్రాలకు పెంచుకున్న జాతులు మృత్యువును కాదనలేదు. అయితే మన దేశంలో వైవిధ్యానికి పరిమితి లేదు. కాశీ కరవత్ ఉత్సర్గానికి ఒక రూపం. మృత్యువును దాటివెళ్లే సాహసం.

"ఎవరో మనస్వి, ఉత్కృష్ట స్థాయి సాధకుడు దీన్ని ప్రారంభించి ఉంటాడు. ఇందులో – ప్రతి ఒక్కరికీ మరణించడానికి ప్రేరణ ఇచ్చేటంతగా మృత్యువు యొక్క సరళీకరణ జరగలేదు. ఆతర్వాత జరిగినది ఖచ్చితంగా ఆత్మవినాశకరమే."

– అని గౌతమ్ సమాధానం చెప్పారు. ఆయన ఆ ప్రశ్నను ముందుగానే ఊహించారనీ, సమాధానం కోసం సిద్ధమైనారనీ అందువల్ల తెలిసింది.

గౌతమ్ కాశీ కరవత్ ఆరంభాన్ని సమర్థించారు. అయితే, ఆ తర్వాత పలాయనం, పిరికితనంలతోపాటు ఆత్మహత్యవంటి అపరాధం కూడ ఆ బావితో ముడిపడ్డాయని ఆయన కూడ అంగీకరించారు.

గౌతమ్ దృక్పథాన్ని శ్రీరామ్ ఆమోదించారు. ఒక ఆచారంలో వికృతి ప్రవేశిస్తే, దానిని సవరించడానికి తగు ప్రయత్నంకూడ జరుగుతుంది. ఈ ప్రయత్నాలను గురించి చర్చిస్తూ ఆయన ఇలా అన్నారు –

"మధ్య యుగంలో కబీరు వంటి మహనీయుల అవతరణ ఇలాంటి వికృతులను తొలగించడానికే జరిగిందని మనం అంగీకరించాలి."

గౌతమ్ ఆ భావాన్ని ఆమోదించారు. ఆతర్వాత కాశీ హిందూ విశ్వవిద్యాలయం గురించీ, నగరంలో జరుగుతూన్న ఇతర ధార్మిక, సామాజిక కార్యకలాపాల గురించీ చాలాసేపు సంభాషణ జరిగింది. ఆ సంభాషణ ద్వారా శ్రీరామ్ వారణాసి పరిస్థితిని బాగా అవగాహన చేసుకున్నారు.

శ్రీరామ్ కాశీలో ఉన్న సమయంలో మహామనా మాలవ్యా జైలులో ఉన్నారు. శ్రీరామ్ కాశీకి బయలు దేరిన రోజున, ఆగస్టు 20న, ఢిల్లీలో మాలవ్యాజీ, కాంగ్రెసు కార్యవర్గంలోని మరి ఆరుగురు సభ్యులూ అరెస్టు చేయబడ్డారు. నిషేధించబడిన కాంగ్రెసు కార్యవర్గ సమావేశంలో పాల్గొనడం వారు చేసిన నేరం. అంతకుముందు విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు సహాయ నిరాకరణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొంటున్నారు.

విశ్వవిద్యాలయ వాతావరణాన్నీ, అక్కడి పరిస్థితులనూ తెలుసుకోవడం కోసం శ్రీరామ్ అక్కడికి వెళ్లారు. వాటిలో జోక్యం చేసుకుని, వాటికి సహకరించే స్థితిలో ఆయన లేనప్పటికీ – అక్కడి వ్యవస్థనూ, స్థితినీ తెలుసుకోవడం, అక్కడివారిని కలుసుకోవడం – ఇవి కాక, భావనాత్మకమైన మరో కారణం కూడ దీని వెనుక ఉంది. అయిదు సంవత్సరాల పూర్వం తనకు ఉపనయన దీక్ష ఇచ్చిన మహనీయుని కార్యక్షేత్రం ఇది. అంతకుముందు తనకు అయిదారు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు తన తండ్రిగారితోపాటు తాను అక్కడికి రావడం, విశ్వవిద్యాలయ స్థాపన మహోత్సవంలో పాల్గొనడం గురించిన స్మృతులు కూడ శ్రీరామ్ మనఃఫలకంపైకి ఉబికి వస్తున్నాయి.

★★★

**నిష్ప్రయోజనంగా తుప్పుపట్టిపోవడం కన్న ప్రయోజనకరంగా అరిగిపోవడం మిన్న.**

## వివేక వాణి

# జీవితం విజయవంతం కావాలంటే... 3

### నీ దైవత్వాన్ని తెలుసుకో!

నేనొకప్పుడు హిమాలయాల్లో ప్రయాణం చేస్తున్నాను. ముందు పోవలసిన దారి ఎంతో ఉన్నది. మా బీద సన్యాసులకు వాహనాలెక్కడ లభిస్తాయి? అందుచేత నడిచే వెళ్తున్నాము. మాలో ఒక వృద్ధుడున్నాడు. వెళ్లవలసిన దారి ఎత్తులూ పల్లాలతో కొన్ని వందల మైళ్లున్నది. ముందున్న దారి చూచి ఆ వృద్ధుడు 'అయ్యా! ఇవన్నీ దాటడమెట్లాగ? నేనింక నడువలేను. నా గుండె పగిలిపోతుంది' అంటూ చతికిలబడ్డాడు. మేమప్పుడు మంచి ఎత్తుమీద ఉన్నాము. నేనా వృద్ధుడితో 'బాబూ! క్రిందికి చూడు' అన్నాను. ఆయన చూచాడు. 'చూచారా! అదంతా మీరు నడిచివచ్చిన దారే! అటు వంటిదే ముందూ ఉన్నది. అదీ త్వరలోనే మీ పాదాక్రాంత మవుతుంది' అని ధైర్యం చెప్పాను. మనం దివ్యనక్షత్రాలం కాబట్టి అత్యున్నత విషయాలు కూడా మన పాదాలకు దిగువనే ఉంటాయి. నీవు కోరితే గుప్పిళ్లతో నక్షత్రాలను పట్టుకుని బిళ్లలవలె మింగివెయ్యగలవు. నీ సహజ ప్రకృతి అటువంటిది. శక్తిమంతుడవై మౌఢ్యం విడిచి స్వతంత్రుడవై ఉండు.

### ప్రశాంత నిర్విరామ కృషి

గొప్ప పదవిలో ఉన్నప్పుడు ఎవడైనా గొప్పగా కనిపిస్తాడు. విద్యుద్దీప సముద్దీపమైన రంగస్థలంలో పిరికివాడు కూడా ధైర్యం నటిస్తాడు. లోకం చూస్తుంది. అది చూచి ఎవడి గుండె గుబగుబలాడదు? ఎవరు ఉద్రిక్తుడు కాడు? చూడగా చూడగా నిజమైన గొప్పతనం నెమ్మదిగా శాంతంగా ఎడతెరపి లేకుండా క్షణక్షణమూ తన పని తాను చేసుకుపోయే క్రిమిలో ఉన్నదనిపిస్తుంది.

ఒక చిన్న ఉడత నీళ్లలో ఒళ్లు తడుపుకుని ఇసుకలో దొర్లాడి సేతువు కడ్తున్నచోట ఆ ఇసుక దులిపి మళ్లీ అలాగే చేస్తున్నదట. రామకార్య నిర్వాహణానికి పాపమా ఉడత తనకు చేతనైంది తాను చేస్తోంది. పెద్ద పెద్ద వృక్షాలూ, పర్వతాలూ పెకలించి తెస్తున్న వానర పుంగవులు ఒంటి కంటించుకువచ్చిన ఇసుక దులుపుతున్న ఉడతను చూచి నవ్వుకున్నారట. రాము డా ఉభయులనూ చూచి, 'ఎందుకలా నవ్వుకుంటారు? ఆ ఉడత కలకాలం వర్థిల్లాలి. దానికి చేతనైనది శక్తివంచన లేకుండా అది చేస్తోంది. అందుచేత మీరెంత గొప్పవాళ్లో అది అంత గొప్పదే!' అని చెప్పి ఉడత వెన్నుమీద తన వ్రేళ్లతో రాసి దాన్ని ప్రేమతో బుజ్జగించాడట! అప్పటినుంచీ ఉడతలకు వెన్నుమీద చారలేర్పడ్డాయని చెప్పుకుంటారు. ఈపూటకీ ఉడత వెన్నుపై చారలతో కనిపిస్తూనే ఉంటాయి.

### అన్ని విధులూ పవిత్రాలే!

ప్రతి విధీ పవిత్రమైనదే. శ్రద్ధాభక్తులతో విధిని నిర్వహించడమే భగవదర్చనా మార్గాలలో ప్రశస్తమైనది.

సన్నిహితమై ఉన్న విధిని, తత్కాలంలో నిర్వహించ వలసినదానిని సమర్థంగా చేసినందువల్ల మనలను మనం దృఢ పరుచుకుంటాము. అలా క్రమక్రమంగా మన దార్ఢ్యం పెరిగినకొద్దీ జీవితంలోనూ, సంఘంలోనూ ఉన్నతోన్నత విధులను నిర్వహించే అవకాశం మనకు లభిస్తుంది.

అదీకాక మనకు తగిన పదవులే మనకు లభిస్తాయి. నియమితమైన ఈ సృష్టిలో ప్రతిదీ యోగ్యతననుసరించి జరుగుతోంది. ప్రతి వస్తువుకూ తగిన ప్రయోజనమున్నది, ప్రతి వ్యక్తికీ తగిన విధి ఉన్నది. ఒకనికి ఒకని కంటే ఎక్కువ శక్తి ఉంటే దానికి తగిన ఆధిక్యాన్ని విశ్వం చూపిస్తుంది. అందుచేత అసంతృప్తి చెందటం ప్రయోజనకారి కాదు. ఒకానొక ధనవంతుడు కావలసిన యోగ్యత వాడిలో ఉంది. ఆ యోగ్యత మరెవరిలోనైనా ఉంటే వాళ్లూ ధనవంతులౌతారు. అది లేదు, ఇది లేదు అని ఆందోళన చేసినందువల్లా, పోరాడినందువల్లా ప్రయోజన మేముంటుంది? అలా చేస్తే మన ముత్తములం కాము.

### నీ అదృష్టాన్ని నిందించకు. ప్రతి విధినీ ప్రేమించు!

తనవంతుకు వచ్చిన చిన్న పని చెయ్యడానికి ధుమధుమలాడే వాడు అన్నిటికీ అలాగే ఉంటాడు. ఎప్పుడూ

**ఇతరులకు సహాయపడాలని ప్రయత్నించే వ్యక్తి ఆమేరకు తనకు తాను సహాయపడతాడు.**

ధుమధుమ లాడుతూ, చిరాకుపడుతూ ఉండడం వల్ల బ్రతుకే భారమైపోయి అన్నింటిలోనూ వైఫల్యమే పొందుతాడు. తన వంతుకు వచ్చిన విధిని సక్రమంగా నిర్వహిస్తూ ఉత్సాహంతో జీవితాన్ని గడిపేవాడు ఉన్నతోన్నత విధుల నందుకుంటూ సాఫల్యాన్ని పొందుతాడు.

ఫలాపేక్షతో కర్మాచరణ చేసేవాడే తనకు ప్రాప్తించిన విధిని గూర్చి బాధపడతాడు. నిస్సంగియై చేసేవానికి అన్ని విధులూ మంచివే అనిపిస్తాయి. పైగా వాటిని స్వార్థపరత్వాన్నీ ఇంద్రియలౌల్యాన్ని జయించేటందుకూ, ఆత్మ స్వాతంత్ర్యాన్ని సాధించేటందుకూ ఉపయోగించే సమర్థమైన సాధనాలుగా స్వీకరిస్తాడు.

ధుమధుమలాడేవాడికి అన్ని విధులూ అసహ్యమే అవుతాయి. ఏదీ అతనికి తృప్తి కలిగించలేదు. వాని జీవితం విఫలం కాక తప్పదు. జీవయాత్రలో మనకు ప్రాప్తమయ్యే విధిని సంతోషంతో నిర్వర్తిస్తూ ఉత్సాహంతో సాగిపోదాము. మన కంధకారం తొలగి వెలుగు కనిపించి తీరుతుంది.

ఏ పనీ అల్పం కాదు. ఇష్టమైన పని లభిస్తే పరమ మూర్ఖుడు కూడా చెయ్యగలడు. అన్ని పనులూ తన కిష్టమయ్యేటట్లు చేసుకోగలవాడే నిజంగా తెలివితేటలు కలవాడు.

ఈ జగత్తులో ప్రతి వస్తువూ మఱ్ఱి విత్తనం వంటిది. అది ఆవగింజ వలె మిక్కిలి చిన్నదైనా అందులోనే అవ్యక్తమైన మహావృక్షముంటుంది. దీన్ని గ్రహించి సమస్త కర్మనూ పరమశ్రేష్ఠం చేసుకోగలవాడే నిజమైన ధీశాలి!

## ఇతరులను నిందించకు! ఆత్మవిమర్శ చేసికో!

మనంతట మనం అవకాశమిస్తేనేగాని మనకేమీ కాదన్న సంగతి గ్రహించాలి. దేహం అనుకూలమైతేనేగాని రోగం రానేరాదు. కేవలం రోగక్రిములవల్ల కాక అనుకూల పరిస్థితులు దేహంలో ఉన్నప్పుడే రోగం వస్తుంది. అదీకాక మనకు యోగ్యమైందే మనకు లభిస్తుంది. వ్యర్థమైన దురభిమానం విడిచిపెట్టి చూస్తే మన కష్టాలు మనకు తగినవే అని తెలుస్తుంది. తగని దెబ్బ ఎన్నడూ తగలదు. ఏ అపకారికైనా మన చేతులతో మనమే అవకాశం కల్పిస్తాము. ఇది గ్రహించి తీరాలి.

ఆత్మవిమర్శ చేసుకో, నీకు వచ్చిన కష్టాలన్నింటికీ నీవే కారకుడవని స్పష్టమవుతుంది. నువ్వు సగం చేసావు, తక్కిన సగం బాహ్యజగత్తు చేసింది. ఈ నిర్ణయం మనకు శాంతిని కలిగిస్తుంది. ఇందులోనుంచి దుఃఖ నివారణకు ఉపాయమూ తెలుస్తుంది. 'బాహ్య జగత్తు నా అధీనంలో లేదు. నాలో ఉన్న సమస్తమూ నాకు పరమ సన్నిహితమై నా ఆధీనంలోనే ఉన్నది. ఏ కష్టానికైనా ఈ రెండూ కలవవలసి ఉన్నప్పుడు నా ఆధీనంలో ఉన్నచోట నే నవకాశం ఇవ్వని పక్షంలో నాకు కష్టం ఎలా కలుగుతుంది? నామీద నాకు సంపూర్ణమైన అధికారం ఉంటే నాకే కష్టమూ రాదు.' దుఃఖ నివారణానికి ఇదే పరమోపాయం.

అందుచేత నీ దోషాలకు ఇతరులను నిందించకు. నీ కాళ్లమీద నీవు నిలబడి బాధ్యత నంతటినీ స్వీకరించు. 'నే ననుభవిస్తున్న ఈ కష్టం నేను తెచ్చుకున్నదే. అందుచేత దీన్ని నేనే పోగొట్టుకోవాలి.' అని చెప్పుకో. నేను కట్టింది నేను పడగొట్టగలను. ఇతరులు చేసినదానిని నిర్మూలించడం నా తరం కాదు. ఈ నిశ్చయంతో లేచి నిలబడి ధైర్యం వహించి శక్తిమంతుడవు కా. సంపూర్ణ బాధ్యతను స్వీకరించి నీ భవితవ్యానికి నీవే కారకుడవని తెలుసుకో! కావలసిన శక్తి సామర్థ్యాలన్నీ నీలోనే ఉన్నాయి. అందుచేత నీ భవిష్యత్తు నీవు పండించుకో! గతం గతం, చచ్చినదాంతో జమ. దాన్ని గూర్చి బాధపడకు. ముందెంతో భవిష్యత్తు ఉన్నది. అది నీ అధీనంలో ఉన్నది. నీ మాట, నీ ఊహ, నీ చేత అన్నీ నీ భవిష్యత్తును నిర్మిస్తూనే ఉంటాయి చెడ్డ ఊహలూ, చెడ్డ పనులూ పెద్ద పులుల్లా దూకడానికి ఎలా సిద్ధంగా ఉంటాయో మంచి ఊహలూ మంచి పనులూ వెయ్యిమంది దేవతల శక్తితో నిన్ను సంరక్షించడానికి అలాగే సిద్ధంగా ఉంటాయి. ఇది విస్మరించకూడదు. హెచ్చరికతో ప్రవర్తించు.

## మన భవితవ్యానికి మనమే కారణం

తగిన యోగ్యత సంపాదిస్తేగాని ఎవరికీ ఏదీ రాదు. ఇది ఒక నిత్య సత్యం. ఒక్కొక్కప్పుడు ఇది కాదేమో అనిపించవచ్చు. కాని చివరకు దీన్ని మనం నమ్మక తప్పదు. ఒక డైశ్వర్యం కోసం జీవితమంతా కష్టపడతాడు. ఎన్నో మోసాలు చేస్తాడు. కాని చివరకు ఆ ఐశ్వర్యానికి వాడు తగడన్న సంగతి తేలిపోయి జీవితం చిక్కుల్లో పడి దుర్భరమే అవుతుంది. మన భోగం కోసం ఎన్నెన్నో పదార్థాలు సంగ్రహించి పెట్టుకోవచ్చును. కాని వాటిల్లో మనకు యోగ్యత ఉన్నంతవరకే అనుభవానికి వస్తాయి. ఒక మూర్ఖుడు ఆబకొద్దీ

**తల్లి శరీరాన్ని పోషిస్తుంది. ఉత్తమ గ్రంథం హృదయాన్ని పోషిస్తుంది.**

లోకంలోని పుస్తకాలన్నీ కొనవచ్చు. కాని చదవగలగడం వాని యోగ్యతను బట్టే ఉంటుంది. ఆ యోగ్యతను నిర్ణయించేది వాడు చేసుకున్న కర్మే.

మన కర్మే మన యోగ్యతనూ మన సామర్థ్యాన్నీ నిర్ణయిస్తుంది. మన మిప్పుడీ స్థితిలో ఉండడానికి మనమే బాధ్యులం. మనమేం కాదలచుకుంటే అది కాగలం. ఆ శక్తి మనలో ఉన్నది. ఇప్పుడు మనమున్న ఈ స్థితి మన పూర్వ కర్మ ఫలితమే అయినపుడు భవిష్యత్తులో మనం ఏ స్థితిని పొందదలిచినా ఇప్పటి కర్మలతో సాధించవచ్చునని స్పష్టమవుతూ ఉంది. అందుచేత మన లక్ష్యానికి అనుగుణంగా సంచరించడం మనం తెలుసుకోవాలి.

## సహాయం లోనుండే లభిస్తుంది

మనం పట్టుపురుగుల వంటివాళ్లం. లోని పదార్థాల నుండి మనకు మనమే దారం తీసి దాంతో గూడుకట్టుకుని అందులో మన్ని మనమే బంధించుకుంటాము. కాని ఇది ఇలాగే ఎల్లకాలమూ ఉండదు. ఆ గూడులోనే ఆధ్యాత్మిక సాక్షాత్కారాన్ని పొంది సీతాకోకచిలుకలా ఎగిరిపోతాము. ఈ కర్మవాగురను మనమే అల్లుకుని మన చుట్టూ పరుచుకున్నాము. ఆ సంగతి తెలియక అజ్ఞానంతో బంధితులమయ్యామని బాధపడుతూ సహాయానికి గోలపెడ్తాము. కాని సహాయం వెలపలినుంచి ఎన్నడూ రాదు. మనలో నుండే వస్తుంది. ఉన్న దేవతలందరితోటి మొరపెట్టుకో! నే నలా ఏళ్ల తరబడి మొరపెట్టుకున్నాను. చివరికి సహాయం లభించింది. కాని అది లోనుండే వచ్చింది. పొరపాటున నా అంతట నేను చేసుకున్న దానిని నేనే దిద్దుకోవలసి వచ్చింది. ఇది ఒక్కటే మార్గం. నా చుట్టూ నేను వేసుకున్న వలను నేనే తెంపుకోవాలి. అలా తెంపుకునే శక్తి నాలోనే ఉన్నది.

మంచివిగాని చెడ్డవిగాని అన్ని ఆశయాలూ నా జీవితంలో ఫలించాయనీ, అయినా నేను పూర్వకృత సుకృత దుష్కృత సమాహార ఫలితాన్నే అనీ నా నిశ్చయం. నా జీవితంలో నే ననేక దోషాలు చేశాను. కాని ఆ దోషాలే నేను చేసి ఉండకపోతే నేనిప్పుడున్న స్థితిలో ఉండేవాణ్ణి కాను. ఈ నమ్మకం నాకున్నది. కాబట్టి ఆ దోషాలు చేసినందుకు నాకేమీ బాధలేదు. దీన్నిబట్టి మీరంతా ఇళ్లకు వెళ్లి ఇష్టపూర్వకంగా దోషాలు చెయ్యాలని నా ఉద్దేశ్యం కాదు. అలా నన్ను దురర్థం చేసుకోకండి. కాని దోషాలు జరిగినందుకు మిమ్మల్ని మీ రసహ్యించుకోకండి. చివరికి అంతా సక్రమమవుతుందని తెలుసుకోండి. మన సహజ స్వభావం మంచితనమూ, పవిత్రతా అయినందువల్ల మరొకవిధంగా కావడానికి వీలులేదు. స్వభావం వినాశం పొందేది కాదు. మన మూల స్వభావం ఎప్పుడూ ఒక రకంగానే ఉంటుంది.

## సౌశీల్యం ఎట్లా సాధ్యం?

తనవైపుకు విశ్వంలోని సర్వశక్తులనూ ఆకర్షించి వాటినన్నిటినీ తనలో కరిగించి వేసి మళ్లీ వాటిని మహాప్రవాహంగా బైటికి పంపే కేంద్రం వంటివాడు మానవుడు.

మంచి చెడ్డలూ, సుఖ దుఃఖాలూ అన్నీ అతని కభిముఖంగా వెళ్లి అతన్ని ఆవరిస్తున్నాయి. వాటిల్లో నుండే అతను శీలం పేరిట మహాప్రవాహ తుల్యమైన దృక్పథాన్ని సృష్టించి వెలిజిమ్ముతున్నాడు. అన్నిటినీ ఆకర్షించే శక్తి ఉన్నట్టే వెలిజిమ్మే శక్తి అతనిలో ఉన్నది.

ఎప్పుడూ చెడ్డమాటలే వింటూ, చెడ్డ భావాలే ఆలోచిస్తూ, చెడ్డ పనులే చేస్తూ ఉండే మానవుని మనస్సు దుష్టసంస్కారపూరితమై ఉంటుంది. అతనికి తెలిసినా తెలియకపోయినా అతని ఊహలూ పనులు ఆ సంస్కార ప్రభావంతోనే కూడి ఉంటాయి. ఈ దుష్ట సంస్కారం ఎప్పుడూ పని చేస్తూనే ఉంటుంది. దాని ఫలితం చెడుకాక తప్పదు. అందుచేత వాడు చెడ్డవాడే అవుతాడు. తప్పించుకుందామన్నా వీలు లేదు. వెనుక సంపాదించుకున్న దుష్ట సంస్కారం ప్రబలమై అతన్ని చెడ్డ పనులకే ప్రేరేపిస్తుంది. ఆ సంస్కారం చేతిలో అతను వట్టి పనిముట్టై చెడ్డపనులే చేస్తూ ఉంటాడు.

ఇదేవిధంగా ఎప్పుడూ మంచిమాటలే వింటూ, మంచి భావాలే ఆలోచిస్తూ మంచి పనులే చేసేవాడికి ఏర్పడే సంస్కారం మంచిదవుతుంది. అందుచేత అది అతనికి తెలియకుండానే అతన్ని మంచిపనులు చెయ్యడానికే ప్రేరేపిస్తూ ఉంటుంది. ఎన్నో మంచి పనులు చేసి, ఎన్నో మంచి భావాలు ఆలోచించి ఎంతో మంచి సంస్కారం పొందినవాడు తానొకవేళ చెడ్డపని చెయ్యాలని సంకల్పించినా అతని సంస్కారం దాన్ని చెయ్యనివ్వదు. అతన్ని వెనక్కి మరలిస్తుంది. అతడు దానికి అధీనుడై ఉంటాడు. అటువంటి స్థితిలో ఉన్న మానవుడు సచ్ఛీలుడు. అతనిలో, సౌశీల్యం స్థిరపడినదన్నమాట.

పొగడ్త పన్నీరులాంటిది. దాన్ని వాసన చూసి వదిలివేయాలి; త్రాగుతూ కూర్చోకూడదు.

వీణ మొదట్లో నేర్చుకునేటప్పుడు ఏ వేలు ఏ మెట్టుమీద ఉంచి మ్రోగిస్తే ఏ స్వరం పలుకుతుందో ఎంతో జాగ్రత్తగా అభ్యాసం చెయ్యవలసి ఉంటుంది. తిరిగి తిరిగి అభ్యాసం చెయ్యగా వేళ్ళకు అవసరమైన కదలిక అలవాటయిపోతుంది. చివరికి ఏ మెట్టుమీది కే వేలు పోతోందోనన్న ఊహే లేకుండా అవి వాటంతటవే కదులుతూ ఉండగా సాధకుడు వీణాగానం చెయ్యగలుగుతారు. అలాగే మన విషయంలో కూడా మనం పూర్వం తెలిసి చేసిన పనుల మూలంగానే మన స్వభావాలు ఏర్పడుతూ ఉంటాయి.

## ఆత్మ నిగ్రహం

భావోద్వేగాన్ని యధేచ్ఛగా పోనిస్తే ఎంతో శక్తి వృధా అవుతుంది. నరాల పటుత్వం సడలి మనస్సు చెదరి ఏ పనీ కాదు. క్రియగా పరిణమించవలసిన శక్తి అంతా ఎందుకూ పనికిరాని ఉద్వేగంలోనే వ్యయమవుతుంది. మనస్సు నిబ్బరమై ఏకాగ్రంగా ఉన్నప్పుడే ఉన్న శక్తి నంతటినీ మంచి పని చెయ్యడానికి ఉపయోగించగలుగుతాము. మహాకార్యాలు సాధించిన మహానుభావుల జీవిత చరిత్రలు చూస్తే వాళ్లందరూ పరమశాంత మనస్కులని స్పష్టమవుతుంది. వాళ్ల నిబ్బరాన్ని ఏ శక్తీ చెడగొట్టలేకపోయింది. నిబ్బరానికి ఈ ప్రాముఖ్యం ఉన్నందువల్లనే కోపం వచ్చినవాడు ఏమీ చెయ్యలేకపోవడమూ, దేనివల్లా కోపం పొందనివాడు ఎంతోపని చెయ్యగలగడమూ చూస్తూ ఉంటాము. కోపం, విద్వేషం మొదలైన ఉద్రేకాలకు లొంగేవాళ్లు ఏమీ చెయ్యలేరు. అవి వాటి ఆశ్రయమిచ్చినవాళ్లనే నాశనం చేస్తాయి. శాంతుడై క్షమాశీలియై, మనస్స్వాస్థ్యం చెడకుండా ఉండేవాడు ఎంతో గొప్పపని చెయ్యగలుగుతాడు.

నిగ్రహింపబడిన ప్రతి ఉద్వేగమూ నీ నిబ్బరాన్ని పెంచుతుంది. అందుచేత కోపంతో ఎదుర్కోకుండా ఉండడమే మంచి పద్ధతి. అందులోనూ నీతి ఉన్నది. దౌష్ట్యాన్ని నిరోధించవద్దని క్రీస్తు బోధించాడు. ఈ హితబోధ తాత్పర్యం మనకు మొదట్లో అర్థంకాదు. కోపోద్రేకం పొందడం ఉన్న శక్తిని పాడుచేసుకోవడమే అవుతుంది. కాబట్టి నైతికంగా కాని తాత్త్వికంగా కాని ఎదుర్కోకపోవడమే మంచి పద్ధతి అని తెలిసిన తర్వాత అర్థమవుతుంది. క్రోధ విద్వేషాలకు మన మనస్సులను లొంగి పోనీయగూడదు.

నాలుగు గుఱ్ఱాల బంటి పర్వతంపై నుండి క్రిందికి నిర్విరోధంగా పరుగెత్తవచ్చు లేదా సారథి గుఱ్ఱాలను అదుపులో పెట్టవచ్చు. ఎందులో నిజమైన శక్తి ఉందంటారు? వాటిని పోనీయడంలోనా అదుపులో పెట్టడంలోనా? గాలిలోకి పేల్చిన తుపాకిగుండు చాలాదూరం పోయి పడిపోతుంది. గోడను గురిచూచి పేలిస్తే గుండు వెళ్లి గోడను తాకి ఘర్షణవల్ల తీవ్రమైన వేడి పుట్టుతుంది. స్వార్థ పరత్వంలో బహిర్గతమయ్యే శక్తి యావత్తూ చెల్లాచెదురైపోతుంది. అది మళ్లీ మనకు చేరదు. నిగృహీత మయితే మనలోని శక్తి పెరుగుతుంది. ఈ ఆత్మనిగ్రహం వల్ల దృఢ సంకల్పమూ ఉత్తమశీలమూ కలిగి క్రీస్తులూ, బుద్ధులూ ఆవిర్భవిస్తారు.

తీవ్రమైన క్రోధావేశం వస్తే దాన్ని మనం ఎలా నిగ్రహించడం? దానికి వ్యతిరేకమైన మరొక ఆవేశం తెచ్చుకోవాలి. క్రోధం కలిగినప్పుడు ప్రేమను భావన చేస్తే సరిపోతుంది. తల్లికి భర్తమీద కోపం వచ్చిన సమయంలో పసివాడు సమీపించాడనుకోండి. ఆ కోపాన్ని అలా ఉంచి ఆమె పసివాణ్ణి లాలించి ముద్దు పెట్టుకుంటుంది. ఆమె మనస్సులో ఒక ఉద్రేకం అణగి మరొక ఉద్రేకం వచ్చిందన్నమాట. ఈ ప్రేమ పొంగుతో ఆ కోపం పొంగు అణగిపోయింది. క్రోధానికి ప్రతిస్పర్థి ప్రేమ. ఇలాగే దొంగిలించాలన్న దుర్బుద్ధి పుట్టినప్పుడు ఇవ్వాలన్న సద్భావాన్ని స్మరించాలి. కానుకలు స్వీకరించే తలపును దానికి వ్యతిరేకమైన తలపుతో జయించాలి.

నిస్తబ్ధ నైశ్చల్యంతో తీవ్ర చైతన్యాన్నీ, తీవ్ర చైతన్య మధ్యంలో నిశ్చల నిస్తబ్ధతనూ అనుభవించగలిగినవాడే ఆదర్శ మానవుడు. వానికి నిగ్రహ రహస్యం తెలిసిందన్న మాట. అతడు తనను తాను నిగ్రహించుకున్నవాడు. అట్టివాడు అనేక కార్యకలాపాలతో నిర్విరామంగా తిరుగుతూ ఉండే రకరకాల శకటాలతో నిత్య సంకులమై ఉండే మహా పట్టణాల్లో సంచరిస్తున్నా ఏకాంతమైన కొండగుహలో ఉన్నట్టే అతని మనస్సు నిశ్చలంగా ఉంటుంది. చుట్టూ జరుగుతున్న వాటితో సంబంధం లేకుండా అతడెప్పుడూ తన పని తాను చేస్తూనే ఉంటాడు. అదే ఆదర్శ కర్మయోగం. అది నీకు లభిస్తే నీకు కర్మ రహస్యం తెలిసిందన్నమాట.

## యథార్థ భావాల శక్తి

గౌతమ బుద్ధుడు తాను ఇరవై ఐదవ బుద్ధుడనని పదే

**ప్రదక్షిణం అంటే అంతా తనలోనే ఉన్నదని తెలుసుకోవడం** - రమణ మహర్షి

పదే చెప్పినట్టు అతని జీవిత చరిత్రలో కనిపిస్తుంది. చరిత్రకు తెలిసిన బుద్ధుడు తన పూర్వులు వేసిన పునాదుల మీదనే పెరిగినవాడైనా అతనికి వెనుకనున్న ఇరవై నలుగురు బుద్ధుల సంగతీ లోకానికి తెలియరాలేదు.

మనుష్యులలో అత్యున్నతులెప్పుడూ శాంతులూ, మౌనులూ అవిదితులూ అయి ఉంటారు. భావనా బలాన్ని నిజంగా తెలుసుకున్న మహానుభావులు వాళ్లే. తాము గుహలో కూర్చుని ఎవరికీ తెలియకుండా ఉండి తమలో తాము ఏ ఉత్తమ భావాలను భావించి చనిపోయినా ఆ భావాలు శాశ్వతంగా నిలుస్తాయని వాళ్లకు తెలుసు. నిజంగా అటువంటి భావాలు పర్వతాలను దూసుకుపోయి సముద్రాలు దాటి, సర్వ ప్రపంచం లోనూ వ్యాపిస్తాయి. అవి మానవుల హృదయాల్లోనూ, మనస్సుల్లోనూ అంతరాంతరాల్లో ప్రవేశించి వాళ్ళ నుద్ధరిస్తాయి. వాళ్ల మూలంగానే ఆ భావాలు మానవ జీవితంలో ఆచరణలోకి వస్తాయి.

## మీరు స్వయంగా ఋషులు కావాలి

ఋషులు బోధించే దేమిటో తెలుసుకుని ఊరుకుంటే చాలదు. ఆ ఋషులు వెళ్లిపోయారు. వాళ్లతోపాటే వాళ్ల అభిప్రాయాలూ వెళ్లిపోయాయి. మీ అంతట మీరు ఋషులు కావాలి. మీరు కూడా ఈ జగత్తులో ఉద్భవించిన ఉత్తమ మానవులెంత గొప్పవాళ్లో అవతార పురుషులెంత గొప్పవాళ్లో అంత గొప్పవాళ్లు. వట్టి పుస్తక జ్ఞానం వల్ల ప్రయోజనమేమిటి? ధ్యానం మాత్రం ఏం చేస్తుంది? మంత్ర తంత్రాలు ఏం చేస్తాయి? మీ కాళ్లమీద మీరు నిలబడాలి.

## నిజమైన మానవుడు

మానవతా ప్రతిష్ఠాపన మనే ఈ నవ్య మార్గాన్ని మీరవలంబించాలి. నిజమైన మానవుడంటే మూర్తీభవించిన బలమై ఉండీ కూడా స్త్రీ హృదయం కలవాడు కావాలి. నీ చుట్టూ ఉన్న జీవకోటి కొరకు పరితపించే వాడవు కావాలి. అయినా సడలని శక్తి సామర్థ్యాలతో మెత్తబడకుండా ఉండాలి. వీటికితోడు విధేయతా ఉండాలి. ఇవన్నీ పరస్పర విరుద్ధంగా తోస్తాయిగాని పైకి అలా అనిపించే ఈ లక్షణాలన్నీ నీలో ఉండాలి. నీకంటే ఉన్నతుడు నిన్ను సముద్రంలోకి దూకి మొసలిని పట్టుకోమంటే ముందా పని విధేయతతో చేసి తర్వాత అవసరమయితే అతనితో వాదించాలి. ఆజ్ఞలో దోషమున్నా సరే, ముందు విధేయుడవు కావాలి. తర్వాత వ్యతిరేకించాలి.

మనలో ఎవరికైనా అభిప్రాయంలో ఏ కొంచెం తేడా వచ్చినా వాడు పోయి కొత్త వర్గాన్ని ప్రారంభిస్తాడు. కొంచెం ఆగుదామన్న ఓపిక బొత్తిగా ఉండదు. ఇది మన వర్గాల్లో ఉన్న పెద్ద జబ్బు. అందుచేత నీవు ఉన్న సంఘం పట్ల ఆత్మ దఘ్నమైన గౌరవం కలిగి ఉండాలి. సంఘంలో అవిధేయతకు స్థానం లేదు. శిబిరంలో ద్రోహులుండడానికి వీలులేదు. గాలి అంత స్వేచ్ఛగా ఉంటూ కుక్కవలె మొక్కవలె విధేయుడై ఉండాలి.

## సన్యాసులే ఇప్పుడు కావలసింది

కొందరైనా గార్హస్థ్యంలో పడిపోక బైట నిలబడి తమ జీవితాలను భగవదర్పితం చేసి ప్రపంచ క్షేమానికై మతాన్ని రక్షించాలి. నీవు వస్తే రా, ధైర్యంగా నిలబడు. ఒక వందమంది ప్రాణాలు కోలుపోయినా పతాకాన్ని పట్టుకుని ముందుకు నడు. ఎవరు పడినా, ఎంతమంది పడినా లెక్కలేదు. భగవంతుడున్నాడు. నీవు పడిపోయే పరిస్థితి వస్తే ముందుకు తీసుకుపోయే మరొకడికి పతాకాన్ని అందించు! మనుష్యులు పడవచ్చు గాని అది పడనేపడదు!

అల్ప జీవితాలలో కాలక్షేపం చేసే గృహస్థులు ఏం చేయగలరు? శివుని ప్రమథ గణాలవంటి సన్యాసులే హరహర మహాదేవ శంభో అంటూ జయ జయ నినాదాలతో ఆకాశాన్ని చీల్చి వెయ్యాలి.

భవిష్యత్తును గూర్చిన నా ఆశయాలన్నీ శీలవంతులై, ప్రతిభావంతులై, ఇతరుల సేవకై అన్నీ త్యజించి, విధేయతతతో, నా భావాలను ఆచరణలో పెట్టి తమకు తాము మేలు చేసుకుంటూ దేశాని కుపకారం చేసేటందుకు జీవితాలు అర్పించగల యువకుల మీద ఆధారపడి ఉన్నాయి. కాకపోతే సామాన్య యువకులు గుంపులు గుంపులుగా వస్తూనే ఉన్నారు. ఇంకా వస్తారు. వాళ్ళ ముఖాల్లో తెలివితేటలు కనిపించవు. హృదయాల్లో ఉత్సాహం శూన్యం. మనస్సుల్లో ధైర్యం లేదు. దుర్బల శరీరాలతో ఏ పని చెయ్యడానికీ పనికిరారు. ఇటువంటి వాళ్ళతో పనేమవుతుంది? నచికేతుని వలె గాఢ విశ్వాసం కలవాళ్ళు పది పన్నెండుమంది దొరికితే ఈ దేశాన్నంతటినీ కదిలించి వేసి భావంలోనూ

**జ్ఞానం పడవ నడిపే సరంగు. ధ్యానం గాలి. ప్రవర్తన పడవ. వీటితో సంసార సాగరాన్ని దాటు.**

నడతలోనూ కొత్త మార్గానికి తిప్పగలను.

నాకు తటస్థపడిన యువకులలో సమర్థులనిపించిన కొందరు అప్పుడే గార్హస్థ్య బంధాలలో చిక్కుకుని ఉన్నారు. కొందరు లౌకిక ప్రయోజనాల కమ్ముడుపోయారు. కొందరు దుర్బలులు. అధిక సంఖ్యాకులయిన మిగిలిన వాళ్ళు ఉన్నత భావాలు స్వీకరించే యోగ్యత లేనివాళ్ళు.

ఏమైనా భగవదిచ్ఛ ఉన్నట్లయితే ఈ చేరిన యువకులలో నుంచే కర్మశూరులూ ఆధ్యాత్మిక వీరులు బయలుదేరి భవిష్యత్తులో నా భావాలకు కార్యరూపం తేగలిగేవాళ్ళు కావచ్చు.

## విద్యావంతులైన యువకులను సంఘటితం చెయ్యాలి

విద్యావంతులైన యువకుల నాకర్షించి, వాళ్ళందరినీ ఒకచోట చేర్చి సుశిక్షితమైన సంఘాన్ని నిర్మించాలి. మహాకార్యాలు మహత్తర త్యాగాలతోనే అవుతాయి. ధీరోదాత్త సుజనులారా, రండి పని చెయ్యండి. జాతీయాదర్శభావాన్ని, ప్రణాళికను ఆచరణలో పెట్టండి. నడుములు కట్టి ఉద్యమించండి. పేరూ ప్రతిష్ఠా మొదలైన వ్యర్థ విషయాలకోసం ఆగిపోయి వెనక్కి చూడకండి. స్వార్థాన్ని దూరంచేసి కార్యరంగంలోకి దూకండి. గడ్డిపరకలైనా అన్నీ ఏకమైతే ఉన్మత్తగజాన్ని కూడా బంధించగలవన్న మాట జ్ఞప్తికుంచుకోండి.

## హే భగవాన్! శ్రీ రామకృష్ణా

విశ్వ సమన్వయ సిద్ధాంత ప్రవక్తలు, జగద్గురువులు నయిన శ్రీరామకృష్ణ పరమహంసలను మీ అందరి హృదయాల్లోనూ ఆవిష్కృతం కావలసిందని నేనిప్పుడు ప్రార్థిస్తున్నాను. ఆయన అనుగ్రహంతో మీరు మీమీ ఆశయాలను సఫలం చేసుకుంటూ భయంకరమైన అజ్ఞాన సాగరంలో నిమగ్నులై ఉన్న ఇతరులను ఉద్ధరించడానికి ధీర నిర్భయ హృదయాలతో శక్తివంచన లేకుండా కృషి చెయ్యగలుగుతారు.

మీరెప్పుడూ ధైర్యసాహసవంతులై ఉందురుగాక! దాస్యవిమోచనం వీరునకే సమీపంలో ఉంటుంది. భీరునకు కాదు. వీరులారా! నడుములు కట్టి ఉద్యమించండి. మీరు ఎదుర్కోవలసినది అవివేక మహాప్రభువు బలవత్తర సైన్యాలను! ఎన్నో అవరోధాలను అతిక్రమించందే ఏ మహా కార్యమూ సాధ్యంకాదన్న మాట నిజమే! అయినా మీరు వాటికి జంకక మీ శక్తి సామర్థ్యాలు వినియోగించి సర్వాత్మనా కృషి చెయ్యండి.

పురశ్చల! ప్రస్థితోభవ! ధీర యువకులారా! బంధనాలలో మగ్గుతున్న దీనులను విడుదల చెయ్యడానికి, దుస్థితిలో ఉన్నవారి దుఃఖభావాన్ని తొలగించడానికి, అజ్ఞానాంధ తమస్సులో పడి ఉన్నవారి హృదయాలలో జ్ఞానజ్యోతి వెలిగించడానికి ధైర్యంతో పురోగమించండి. డిండిమాన్ని మ్రోగిస్తూ వేదాంతం ఏమి చెపుతుందో గమనించండి. 'నిర్భయుడవై యుండు!' ఈ డిండిమధ్వానం భూలోకవాసుల హృదయగ్రంథులను విచ్ఛిన్నం చేయునుగాక!

## ఓ హిందువులారా! మూర్ఛనుండి తేరుకోండి

మన మీ ఉపనిషత్ప్రబోధాన్ని ప్రతి జీవునకు అందిద్దాము. ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధత! లెండి, మేలుకోండి, లక్ష్యం సిద్ధించే వరకూ ఆగబోకండి! – లెండి, మేల్కొండి! అదీ మాట. ఎవ్వరూ నిజానికి దుర్బలులు కారు. ఆత్మ అనంతమూ, సర్వవ్యాపీ, సర్వగతమూ! లేచి నిలబడండి. సర్వాత్మనా కృషి చెయ్యండి. మీలోని దైవాన్ని ప్రకటించండి. ఆయన్ని కాదనకండి. విడిపోని జడత్వం, దుర్భర దౌర్బల్యం, ఎడతెగని మూర్ఛా మనజాతిని క్రమ్ముకున్నాయి.

ఆధునిక హిందువులారా! మీ మోహాన్ని మీరు పోగొట్టుకోవాలి. మోహ నిరసన మార్గాలు మీ పవిత్ర గ్రంథాల్లోనే ఉన్నాయి. మీకు మీరే బోధించుకోండి! అందరికీ చెప్పండి! స్వస్వభావ మేమిటో తెలిస్తే నిద్రిస్తున్న జీవులందరూ ఎలా మేల్కొంటారో చూడండి. సుప్తమైన జీవాత్మ ప్రబుద్ధమై సహజ చైతన్యాన్ని పొందినప్పుడు శక్తి వస్తుంది. ఔజ్జ్వల్యం వస్తుంది. మంచితనం వస్తుంది. అన్ని మంచి లక్షణాలూ వస్తాయి.

## ప్రబుద్ధ సముజ్జ్వల భారతం

నేను భవిష్యత్తు నూహించడం లేదు. అలా ఊహించాలన్న దృష్టీ లేదు. నా కళ్ళ ముందు ఈ జీవితంతో తుల్యంగా ఒకే ఒక దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. అనాదియైన మన దేశమాత మళ్లీ నిద్రలేచింది. సింహాసనస్థయై ఎప్పటికంటే ఉజ్జ్వలంగా ప్రకాశిస్తోంది. శాంతి సందేశంతోనూ, శుభాకాంక్షలతోనూ ప్రపంచానికామెను ప్రకటించండి!

★★★

ప్రార్థించే పెదవులకన్న సాయపడే చేతులు పవిత్రమైనవి – మదర్ థెరీసా.

నావారితో నామాట

# యోగ విప్లవ, భావ విప్లవాల విస్తరణ

2006 వసంతం – 2012 వసంతముల మధ్యకాలం మహత్తరమైనది. ప్రపంచ భవిష్యత్తు ఎలా ఉంటుందో ఈ ఆరు సంవత్సరాలూ నిర్ణయిస్తాయి. పరివర్తన జరగడం నిశ్చయం – రేపటి సూర్యోదయం అంత నిశ్చయం. దాన్ని ఎవ్వరూ ఆపలేరు. ఉల్లాసభరితమైన ఈ వాతావరణం దేశమంతటా, భారతీయులు నివసిస్తూన్న దేశాలలో కానవస్తోంది. వినియోగవాద – భోగవాద మనస్తత్వంతో తాత్కాలిక సుఖంకోసమే జీవించేవారి సంఖ్య ప్రపంచంలో పెరుగుతోంది. మరోప్రక్క – ఆశావాదంతో, ఆదర్శవాదంతో నిండిన మన దేశపు యువతరం సాంకేతికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా మన దేశాన్ని విశ్వగురువుగా చేయడానికి సన్నాహాలు జరుపుతోంది. హిమాలయంలో సూక్ష్మరూపంలో ఉన్న ఋషిసత్తాల క్రీడ ఇది : విశ్వపరివర్తనకు మార్గదర్శిగా వారు భారతదేశాన్ని ఎంపిక చేశారు. అందరికీ ఆహ్వానాలు పంపారు. గాయత్రీ పరివార్ వారందరికీ నాయకత్వం వహిస్తోంది. నిరంతరం పురోగమిస్తోంది.

### భవిష్యవాణిలోని సత్యం

ఈ వాక్యాల వెనుక అధ్యాత్మ చేతనకు ధ్రువకేంద్రం అయిన హిమాలయంలోని ఋషిసత్తాల మార్గదర్శనమే ఉంది. ఇదంతా కపోల కల్పన కాదు. ఊహావిహారం కాదు. ఇది భవిష్యవాణి. దీన్ని ఎవ్వరూ నిరోధించజాలరు. యుగపరివర్తన అనే ఈ తుపాను పరోక్ష జగత్తులో ఎప్పుడో ప్రారంభమయింది. ప్రత్యక్ష జగత్తు మొత్తాన్ని కదిపివేయడానికి, కుదిపివేయడానికి మనందరి మధ్యకూ వస్తోంది. ఇక ఆలోచించడం మన వంతు: మనల్ని మనం ఎంతవరకు మార్చుకుంటామో, యుగ ప్రవాహానికి అనుకూలంగా జీవించడానికి మనం ఎంతవరకు తయారవుతామో.

2006 ఫిబ్రవరి 2వ తేది వసంతపంచమి నాడు ప్రారంభమవుతూన్న ఆరేళ్ల కాలఖండం విప్లవాత్మక పరివర్తనలతో నిండి ఉంటుంది. అద్భుతమైన మార్పులు నలువైపులా కానవస్తాయి. పూర్తిగా అసాధ్యం అనుకున్నవి సాధ్యపడతాయి. అవి జరిగితీరుతాయి. ఎందుకంటే – సృష్టికర్త అలా కోరుతున్నాడు. హిమాలయవాసులైన ఋషిసత్తాలు ఆ పరివర్తన కోసం శ్రేష్ఠ ఆత్మలను ఎంపిక చేసి ఉన్నారు. నలువైపులా వసంత వాతావరణం ఏర్పడి ఉంది.

### భారతమాత ఆకాంక్ష

ఈ వసంత పర్వం చరిత్రాత్మకమైనది. మనం మన గురుసత్తా శతజయంతి ఉత్సవాల వరకు (2011–2012) నిరంతరం మన క్రియాశీలతను పెంచుకుంటున్నాం. యుగ పరివర్తన ప్రక్రియ ఉధృతం అవుతోందని మనం గ్రహించ గలుగుతాము.

**ఎంతటి అదృష్టం! జాతియొక్క సాంస్కృతిక నవోన్మేషానికి సమర్పితమైన ఋషిసత్తా గురు గోల్వాల్కర్‌జీ శతజయంతి (2006 – 2007)తో ఈ పరివర్తన ప్రారంభం అవుతోంది. ఇది క్రమంగా వేగం పుంజుకుంటుంది. ప్రజ్ఞావతార సత్తా, మహాకాలుని సత్తా అయిన పరమపూజ్య గురుదేవుల శతజయంతి నాటికి ఈ పరివర్తన శిఖరాగ్రాన్ని చేరుతుంది. ఈ శతజయంతి ఉత్సవాలు 2011 వసంత పంచమి నుండి 2012 వసంత పంచమి వరకు జరుగుతాయి.**

యోగి శ్రీ అరవిందులు పేర్కొన్న కాలఖండం ఇదే. రామకృష్ణ పరమహంస భూమిపై అవతరించడంతో (1836)

మననం చేయకపోతే విద్య నశిస్తుంది – చాణక్యుడు.

కృతయుగ ఆగమనం జరిగిందని వారు చెప్పారు. అయితే - 175 సంవత్సరాల సంధి సమయం మిగిలి ఉందని చెప్పారు. విస్తృతమైన ఎగుడు దిగుడులతో కూడిన ఈ సమయం పూర్తికాగానే, కృతయుగ అరుణోదయ ప్రభాత పర్వం సమీపిస్తుందని ఆయన వివరించారు. 1836కు 175 కలిపితే, 2011 వస్తుంది కదా.

ఈ 175 సంవత్సరాల సమయంలో గదర్ ఉద్యమం సాగింది. స్వరాజ్య సమరం నడిచింది. యోద్ధ - సన్యాసి స్వామి వివేకానంద ఉద్భవించారు. రామకృష్ణ మిషన్ ఆవిర్భవించింది. జాతీయ నాయకులు పలువురు జన్మించారు. వారు క్రియాశీలురు అయినారు. మహిళా జాగరణ ఉద్యమం ఊపు అందుకున్నది. సాంఘిక దురాచారాలలో, జన్మ ఆధారంగా హెచ్చుతగ్గులలో పరివర్తన వచ్చింది. సామాజిక న్యాయాన్ని గురించి మాట్లాడే సమాజం వికసించింది. వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో ప్రగతి కనిపించింది. ఎందరో సంత్‌లు ఉదయించారు. గాయత్రి సార్వజనీనం అయింది. యజ్ఞీయ జీవన గడపాలనే ఉత్సాహం ప్రజలలో ఉరకలు వేసింది. 21వ శతాబ్దపు ప్రభాత పర్వం వచ్చింది.

ఇక ఈ సంధి సమయంలోని చివరి ఆరు సంవత్సరాలు మిగిలాయి. మరింత మహిమ కలిగిన కాలఖండం ఇది. ఈ వసంత ఉత్సాహంతో మనం అనుక్షణం జీవించాలి. అనుక్షణం ఈ పరివర్తనలో భాగస్వాములం కావాలి. ఈ సమయాన్ని వృధాచేస్తే, ఆతర్వాత మనకు మిగిలేది ఘోర పశ్చాత్తాపమే. ఈ కాలఖండంలోని ప్రతిక్షణాన్ని సద్వినియోగపరచుకోవాలని భరతమాత పిలుపు ఇస్తోంది.

### ఈ సంవత్సరపు కార్యాచరణ పథకం

ప్రపంచమంతటా విస్తరించి ఉన్న గాయత్రీ పరిజనుల గురుద్వారా అయిన శాంతికుంజ్ ఈ సంవత్సరాన్ని ఆరు సంవత్సరాల మహా పురుషార్థానికి ప్రారంభ సంవత్సరంగా పరిగణిస్తోంది.

దేశంలోని వివిధ క్షేత్రాలకు పంపబడ్డ పరివ్రాజక కార్యకర్తలు శక్తిపీఠాల స్థాపనా సంకల్ప రజత జయంతి సందర్భంగా (ఇది రెండు సంవత్సరాలపాటు జరుగుతుంది) సమన్వయం, సంగతీకరణ, సృజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మవాదిని సోదరీమణుల కార్యక్రమాలు కూడా వీటితోపాటు జరుగుతున్నాయి. 2007 మార్చినెల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. శక్తిపీఠాల ట్రస్టీలు, సమన్వయ సమితుల సభ్యుల సమావేశాలు 2005 ఆగస్టు 24 నుండి నవంబరు 8 వరకు శాంతికుంజ్‌లో జరిగాయి.

ఇటీవలనే ఆస్ట్రేలియాలో చరిత్రాత్మకమైన అశ్వమేధ మహాయజ్ఞం జరిగింది. దక్షిణాఫ్రికాలోని మన ఆశ్రమం విస్తరించబడుతోంది. జోహాన్స్‌బర్గ్‌లో 2006 మేనెలలో మరో అశ్వమేధ యజ్ఞం జరుగుతుంది. అమెరికాలోని న్యూజర్సీలో 30 ఎకరాల స్థలంలో గాయత్రీ చేతనా కేంద్రం స్థాపించబడుతోంది.

మరోప్రక్క - దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో, గాయత్రీ తీర్థంలో నవనిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయ విద్యార్థినీ విద్యార్థుల కార్యశూరత దేశమంతటా కానవచ్చింది. ఇక వారు అంతర్జాతీయ స్థాయిలో యోగ-మనోవిజ్ఞానం, భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతుల నగారా మ్రోగిస్తారు. విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభం అవుతున్నాయి. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 400 కళాశాలల స్థాపనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

గాయత్రీ తీర్థంలో సాధకుల కోసమై కొత్త భవనం నిర్మాణం అయింది.

దేశమంతటా విస్తరించి ఉన్న సుమారు 2400

**కాపట్యం కడుపులో కత్తెర, నోటిలో చక్కెర.**

శక్తిపీఠాలు నూతనోత్సాహంతో, కొత్త కార్యకలాపాలతో కళకళలాడుతున్నాయి.

పరమపూజ్య గురుదేవుల సాహిత్యాన్ని వ్యక్తి వ్యక్తికీ అందించడం ఈ సంవత్సరపు కార్యాచరణ ప్రణాళిక. అఖండజ్యోతి, యుగనిర్మాణ యోజన, యుగశక్తి గాయత్రి వంటి పత్రికలను కనీసం పదిరెట్లమంది వ్యక్తులకు అందించాలి. ఈ పత్రికల ప్రతుల సంఖ్య కోటిన్నర కావాలి.

### యోగ విప్లవ విస్తరణ పథకం

దీనితోపాటు ఈ సంవత్సరం యోగ విప్లవ విస్తరణకు సమర్పించబడింది. ఆరు సంవత్సరాల యోజనలో అంతర్భాగంగా ఈ సంవత్సరం సాధన - ఆరోగ్య అభివృద్ధి, భావ విప్లవాలకు కేటాయించబడింది. విశ్వవిద్యాలయం నుండి ఈ సంవత్సరం వందకుపైగా బృందాలు యోగ విప్లవ ప్రసారం కోసం దేశంలోని వివిధ స్థలాలకూ, విదేశాలకూ పంపబడతాయి.

ఈ సంవత్సరంలో కనీసం లక్షంబావు గాయత్రీ అనుష్ఠానం కాని, 24 వేల గాయత్రీ జప అనుష్ఠానంకాని నిర్వహించి పరిజనులందరూ తమ జీవన సాధనను తీవ్రతరం చేయాలి.

ఈ సంవత్సరం పరమపూజ్య గురుదేవుల గ్రంథాలలో కనీసం 200 గ్రంథాలను దేశంలోని, ప్రపంచంలోని 20 భాషలలోనికి అనువదింపజేయాలనే విరాట్ సంకల్పం కూడా తీసుకోబడింది.

ఈ కార్యక్రమాలన్నింటి ద్వారా మనం రానున్న సంవత్సరంలో ఒక మహత్తర సోపానాన్ని చేరుకుంటామని అనిపిస్తోంది.

ప్రతి పరిజనుని చింతనలో నవవసంతం కనిపించాలి. యుగదేవత పిలుపు ఇది.

★★★

## వార్త

### భీమిలి శక్తిపీఠంలో వసంత పంచమి ఉత్సవం

ఫిబ్రవరి 2 వసంత పంచమి సందర్భంగా భీమిలిలోని దుర్గా గాయత్రి శక్తి పీఠంలో పంచకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. వందమంది పాల్గొన్నారు. శ్రీ అవతారం రాజు దంపతులు, శ్రీ బి.గణపతి శాస్త్రి అనుష్ఠానం చేసి, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఆరోజున పరిజనులు సామూహిక అఖండ జపం జరిపారు.

## మార్చి, ఏప్రిల్ నెలలలో పర్వదినాలు

**మార్చి :**

1. రామకృష్ణ పరమహంస జయంతి
14. హోళి, వసంతోత్సవం
30. ఉగాది

**ఏప్రిల్ :**

4. రమణమహర్షి జయంతి
6. దయానంద జయంతి
6. శ్రీరామనవమి
7. సమర్థరామదాసు జయంతి
11. మహావీర జయంతి
13. హనుమజ్జయంతి
14. అంబేద్కర్ జయంతి
30. పరశురామ జయంతి

**కోర్కెలను మనం తినడం లేదు - కోర్కెలే మనల్ని తినివేస్తున్నాయి - భర్తృహరి.**

వార్తలు

# విశ్వవిద్యాలయ విశేషాలు

## ప్రతిభల సద్వినియోగానికి చతుస్సూత్ర పథకం

వసంత పర్వం సందర్భంగా దేవసంస్కృతి విశ్వవిద్యాలయానికి మహాకాలుని నూతన సందేశం అందింది. ప్రతిభలను సద్వినియోగపరచాలన్నది దాని సారాంశం. ప్రతిభలను సంస్కరించడంతోపాటు వాటిని సద్వినియోగ పరచడం కూడ అవసరం కదా.

ఆ సందేశానికి అనుగుణంగా – సత్ప్రవృత్తులను అనుకూలించేవారినీ, మహాకాలుని అంశలనూ ఒకే సూత్రంలో గుదిగ్రుచ్చడానికై విశ్వవిద్యాలయం ఒక పథకాన్ని రూపొందించింది. పథకాన్ని కులాధిపతి స్వయంగా సంచాలన చేస్తారు. పథకంలో నాలుగు సూత్రాలు ఉన్నాయి.

మొదటి సూత్రం : మన పరిజనులనూ, జోనల్ కార్యాలయాలనూ, శక్తిపీఠాలనూ విశ్వవిద్యాలయం సంపర్క సూత్రంతో కలుపుతుంది. దీని లక్ష్యం భావ విప్లవానికి అగ్రేసర సంస్థగా విశ్వవిద్యాలయం యొక్క పాత్రనూ, ప్రాముఖ్యాన్నీ తెలియ జెప్పడం; విశ్వవిద్యాలయంలో ఉదయించే ప్రతిభావంతులను సద్వినియోగపరచడంలో పరిజనుల క్రియాశీల భాగస్వామ్యాన్ని పొందడం.

పథకంలోని రెండవ సూత్రం విశిష్టులనూ, వరిష్ఠులనూ, నిపుణులనూ ఒకే సూత్రంలో కలపడం. మంచి మనసు కలవారు, ఉదార హృదయులు, సంస్కృతిపట్ల సంవేదన కలిగినవారు పలువురు ఉన్నత స్థానాలలో ఉన్నారు. వీరు ఉద్యోగులు కావచ్చు. ఉన్నతాధికారులు కావచ్చు. వివిధ రంగాలలో నిష్ణాతులు కావచ్చు. ప్రతిభల సద్వినియోగంలో వీరందరి సహకారం, మార్గదర్శనం అవసరం. ఇలాంటి పెద్దలందరినీ విశ్వవిద్యాలయం హార్దికంగా ఆహ్వానిస్తోంది – ఇక్కడికి రండి; చూడండి; తెలుసుకోండి; భాగస్వాములు కండి.

పథకంలోని మూడవ సూత్రం ఇతర స్వచ్ఛంద సంస్థలనూ, సాంస్కృతిక సంస్థలనూ కలుపుకోవడం. భాగస్వాములు కావలసిందిగా ఇలాంటి సంస్థలన్నింటినీ విశ్వవిద్యాలయం ఆహ్వానిస్తోంది. మా విద్యార్థుల ప్రయోజనాన్ని పరీక్షించండి; వారిని సద్వినియోగపరచడంలో సాయపడండి – ఇదీ ఆయా సంస్థలకు చేస్తున్న ఆవాహన. సమాజం కోసం, సంస్కృతికోసం, మానవాళి కోసం అంకితభావంతో పనిచేస్తున్న సంస్థలు దేశంలో అనేకం ఉన్నాయి. ఆ పని కోసం ఆయా సంస్థలకు సమర్థులూ, శీలవంతులూ అయిన సహచరులు అవసరం అవుతారు. విశ్వవిద్యాలయం సద్గుణ సంపన్నులైన ప్రతిభావంతులను రూపొందించింది. వీరికి తగిన అవకాశం లభించాలి. ఈ సంస్థలు వీరికి ఆ అవకాశాన్ని ఇవ్వగలుగుతాయి. పరస్పర భాగస్వామ్యం ఉభయులకూ ప్రయోజనకారి కాగలదు.

పథకంలోని నాల్గవ సూత్రం – విశ్వవిద్యాలయం తన పూర్వ విద్యార్థులతో, విద్యార్థినులతో నియమితంగా, నిరంతరంగా సంపర్కం కొనసాగించడం. ఉత్తర ప్రత్యుత్తరాల పద్ధతి ఇందుకు సమర్థవంతమైన సాధనం.

ఇది ఒక బృహత్ పథకం. దీని అమలుకై అందరి సహకారం కావాలి. మన సహచరులందరి సంపర్కంకోసమై విశ్వవిద్యాలయంలో మానవ వనరుల విభాగం ఏర్పాటు చేయబడింది. ఈ విభాగం విశ్వవిద్యాలయం కులాధిపతి ద్వారా, కులపతిద్వారా ప్రతి స్థాయిలో సంపర్కం ఏర్పరచుతుంది. అందరూ తమ ఉత్తరాలను వీరిద్దరినీ సంబోధించి వ్రాయవచ్చు. పాఠకులూ, పరిజనులూ, విద్యార్థినీ విద్యార్థులూ అందరూ తప్పకుండా ఉత్తరాలు వ్రాయండి. ఇతరులచేత వ్రాయించండి.

**చిరునామా :**

Chansellor / Vice - Chansellor,
Devasamskriti Vishwa Vidyalaya,
Shanti Kunj, HARIDWAR

కవరుమీద"Human resources and genius deployment"అని వ్రాయాలి.

★★★


**స్నేహమనే దారం మనస్సులో కలిగే ఛిద్రాలను కుట్టివేస్తుంది –** చాణక్యుడు.

# సద్గురు లీలామృతం

## హృదయాలను కదిలించే కథా కథన శైలి

సంస్మరణలద్వారా ఆధ్యాత్మిక తత్వజ్ఞానాన్ని లోతుగా వివేచన చేసి, శ్రోతలకు సరళమైన రీతిలో అందించడం ఒక మహత్తర సాఫల్యం. సాధకుని స్థాయి కలిగిన వక్త మాత్రమే దాన్ని సాధించగలుగుతాడు. ఈ సిద్ధి గురుదేవులకు అవలీలగా అందింది.

వారి ప్రవచనాల మూలాధారం ప్రేరకంగా, మార్మికంగా, హృదయాన్ని కదిలించేదిగా ఉండేది. జపాన్‌లోని గాంధీ కాగాబా, పిసన్‌హారీ, హజారీ కిసాన్, జరారామ్ బాపా, నరసీ మెహతా, మీరా, చైతన్య, మహాత్మా గాంధీ మున్నగువారి జీవితాలలోని ఏదో ఒక్క సంఘటనపైననే వారు పూర్తిగా వివేచన చేసేవారు, శ్రోతలను ఉద్రూతలు ఊగించేవారు. గంటన్నర సేపు వారిని మంత్రముగ్ధులను చేసేవారు. అలాంటి అద్భుత నైపుణ్యం వారి సొత్తు. దేవ కన్యలకు వక్తృత్వంలో శిక్షణ ఇచ్చేటప్పుడు వరకట్నం, కోడళ్లపై అత్యాచారాలు, ఆడంబరపు వివాహాలు మున్నగు విషయాలపై ఉదాహరణలు చూపేవారు. ఆ ఉదాహరణలు మార్మికంగా ఉండేవి. హృదయాలలోకి సూటిగా దూసుకుపోయేవి. వారి ప్రవచనాలు వింటూన్న శ్రోతలు చలించిపోయేవారు, పరవశించిపోయేవారు.



''రామచరిత మానసకీ ప్రగతిశీల ప్రేరణ'', ''గీతా కథా'', ''బాల నిర్మాణ్ కీ కహానియా'', "ప్రజ్ఞాపురాణ్" వంటి గ్రంథాలలో ఈ కథా కథన శైలి ప్రాధాన్యం వహించింది, ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నది.

## మతసామరస్యానికి మచ్చుతునక

అప్పుడు అఖండ జ్యోతి కార్యాలయంలో కాలితో త్రొక్కి నడిపే ట్రెడిల్ మెషీన్‌ను (ముద్రణ యంత్రం) అమర్చారు. వృద్ధుడైన నస్రూ మియా, యువకుడైన లతీఫ్ ఆ యంత్రాన్ని నడిపేవారు. వారు నిరంతరం పనిచేస్తూ, దానిమీద అఖండజ్యోతి పత్రికను ముద్రించేవారు. వారికి బ్రతుకు దెరువుకూడ అదే.

ఈలోగా 1947లో దేశ విభజన జరిగింది. నగరాలన్నీ ఆ కల్లోలంలో మునిగిపోయాయి. నస్రూ, లతీఫ్‌లు పనిలోకి రాకపోవడంతో, ఆ ముద్రణ యంత్రం ఆగిపోయింది. పూజ్య గురుదేవులు స్వయంగా లతీఫ్ ఇంటికి వెళ్లారు. అతడి కుటుంబం మొత్తాన్ని తమ సంరక్షణలో తమ ఇంటికి తీసుకువచ్చారు. నస్రూ పొరుగూరు వెళ్లిపోయాడు. ఆ తర్వాత మతోన్మాదం చల్లబడింది. లతీఫ్ పాకిస్తాన్ వెళ్లిపోవాలని వాంఛించాడు. అతడి కుటుంబం మొత్తం పాకిస్తాన్ వెళ్లడానికి గురుదేవులు తగు ఏర్పాటు చేశారు.

మత సామరస్యానికి అద్భుత ఉదాహరణ ఇది.

1948లో ఆ లతీఫ్ కరాచీనుండి వీసా తీసుకుని భారతదేశానికి వచ్చాడు. వందనీయ మాతాజీని, గురుదేవులనూ కలిసి వెళ్లిపోయాడు.

1947 నుండి ఇప్పటివరకు అఖండజ్యోతి పత్రిక "3876, కారంగీ కాలనీ, కరాచీ" అనే చిరునామాకు లతీఫ్‌కు వెళుతోంది.

## స్నేహబంధం

1943లో పూజ్య గురుదేవులు ''మిత్రభావ్ బఢానే కీ కలా'' (మిత్రభావాన్ని పెంపొందించే కళ) అనే గ్రంథాన్ని రచించారు. "సద్‌జ్ఞాన్ గ్రంథమాలా" సంస్థ ప్రచురించిన 23వ గ్రంథం అది.

ఆ గ్రంథం పేరు వలెనే – గురుదేవులకు ఆరోజులలో ఎందరో మిత్రులు ఉండేవారు. కొందరు గ్రామంలోని సహచరులు. వారు గురుదేవులను "మత్తజీ" అని పిలచేవారు. ఎప్పుడు పడితే అప్పుడు ఇంటికి వచ్చేసేవారు. కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు. కొందరు ఆర్య సమాజ్‌కు చెందిన ధర్మోపదేశకులు. కొందరు పండితులు, కొందరు ముస్లింలు, కొందరు క్రైస్తవులు. అందరికీ స్నేహాన్ని పంచే గుణం, అందరికీ గౌరవాన్ని అందించే గుణం వారిని వారందరికీ ప్రాణమిత్రునిగా చేశాయి.

**ప్రేమ లేని శరీరం స్మశానంలోని శవం – కబీరు.**

సందర్భం వచ్చినప్పుడు వారిలా చెప్పేవారు–

"నాకు రెండున్నరమంది మిత్రులు."

వారు ఎవరు? వారిలో ఇద్దరు ఎవరు? మిగతా సగంలో ఎవరెవరు ఉన్నారు?

ఈ ప్రశ్నలు అడిగితే, ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకునేవారు.

## విచిత్రమైన సంత్

గౌరవం అనేది ఒక మూలధనం. అది ఇస్తే అందుతుంది. పంచితే పెరుగుతుంది. ఖర్చుచేస్తే నశిస్తుంది. గురుదేవుల సహజ స్వభావం గౌరవాన్ని పంచే స్వభావం.

ఒక రోజున ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి కుటుంబ సమేతంగా గురుదేవులను కలుసుకోవడానికి వచ్చాడు. పై అంతస్థులోని గదిలోకి వెళ్లారు. వారంతా కుర్చీలమీద కూర్చోవాలని గురుదేవులు గట్టిగా కోరారు. ఆ కుటుంబంవారు మొదట సంకోచించారు. కూర్చోము, కూర్చోము– అన్నారు. కానీ ఆ తర్వాత స్నేహభరితమైన ఒత్తిడికి వశులయి వారు కూర్చోవలసివచ్చింది. కుటుంబ విషయాలు, వ్యక్తిగత విషయాలు, ఆఫీసు విషయాలు – అన్నిటిపైనా ఆ సంభాషణలో కొద్దిసేపు చర్చ జరిగింది. ఆ అధికారి గురుదేవుల మాటలకు ఆశ్చర్యచకితులు అవుతూవచ్చారు.

క్రిందికి దిగిన తర్వాత ఆయన తన భార్యతో ఇలా అన్నారు–

"చాలా విచిత్రమైన సంత్ వీరు!"

"ఎందువల్ల? వీరిలో ఏమి విచిత్రం ఉంది?"

– అని ఆవిడ అడిగింది.

ఆ అధికారి ఇలా జవాబిచ్చాడు –

"ఇతర సంత్‌లవద్దకు వెళితే – మనం వారిని గౌరవించవలసి వస్తుంది. ఇక్కడ అందుకు విరుద్ధంగా ఉంది. వారే స్వయంగా మనల్ని గౌరవిస్తున్నారు."

ఈ అధికారి మాత్రమే కాక – ఎందరెందరో గురుదేవుల సాన్నిధ్యంలో ఇలాంటి అనుభూతి పొందారు.

★★★

## వార్త

### శ్రీకాకుళంలో గాయత్రీ మంత్రలేఖన స్థూప ఆవిష్కరణ, 108 కుండీయ యజ్ఞం

శ్రీకాకుళంలోని గురుజాడ విద్యా సంస్థలో 2005 నవంబరు 26, 27లలో గాయత్రీ మంత్రలేఖన స్థూప ఆవిష్కరణ, 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగాయి. 25 వేలమంది పాల్గొన్నారు.

26 ఉదయం 108 కలశములతో కలశయాత్ర జరిగింది. 108 మంది మహిళలు, 500 మంది భక్తులు పాల్గొన్నారు.

ఆతర్వాత జరిగిన 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞంలో 5 వేలమంది పాల్గొన్నారు. డాక్టర్ తుమ్మూరి, శ్రీయుతులు అశ్విని సుబ్బారావు, డి.వి.ఆర్.మూర్తి, శంకరరావు, హయగ్రీవరావు, గోదావరి రాజు, అప్పలనాయుడు, పూరణ్‌చంద్, పవన్ కుమార్, సంతోష్ ప్రసాద్ అగ్నిహోత్రి, గౌరు నాయుడు, శ్రీమతులు అనసూయమ్మ, రూపవాణి మున్నగు ప్రముఖులు యజ్ఞంలో పాల్గొన్నారు. నాటి సాయత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, దీపయజ్ఞం జరిగాయి. 4 వేలమంది పాల్గొన్నారు. సంత్ డాక్టర్ బ్రిజ్‌మోహన్‌జీ ప్రవచనం ఇచ్చారు.

27న జరిగిన యజ్ఞంలో 12 వేల మంది పాల్గొన్నారు. నాటి మధ్యాహ్నం గాయత్రీ గాన విభావరి, గాయత్రీ మంత్ర లేఖన స్థాపక స్థూప ఆవిష్కరణ జరిగాయి. సత్యవర సిద్ధాంతి శ్రీ బుచ్చిరామయ్య ఆధ్వర్యం వహించారు. స్థూపంలో కోటి ఎనిమిది లక్షలకుపైగా గాయత్రీ మంత్రలేఖన కలిగిన పుస్తకాలు భద్రపరచబడ్డాయి. గురుజాడ విద్యా సంస్థ అధినేత శ్రీ జి.వి.స్వామి నాయుడు స్థూపాన్ని నిర్మింపజేశారు.

★★★

**లలితకళలలో ఆసక్తి లేని మనిషి నర పశువు – శ్రీ అరవిందులు**

# హైదరాబాదు సభలో డా॥ప్రణవ్ పండ్యాజీ ఉపన్యాసం



సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ.




వేదికపై (కుడి నుండి) డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్,
శ్రీ అశ్విని సుబ్బారావు, ఆదరణీయ శైలదీదీ,
డా॥ ప్రణవ్ పండ్యాజీ, శ్రీ రామన్న, శ్రీ ఎమ్.బాబూరావు,
శ్రీరావ్ చోడగం.



భరతనాట్య ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినీ విద్యార్థులు, వారి గురువులు.



భరతనాట్యం చేసిన బాలికను సత్కరిస్తున్న డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ.

# శ్రీకాకుళంలో గాయత్రీ మంత్రలేఖన స్థూప ఆవిష్కరణ



వేదికపై డాక్టర్ చంద్రశేఖర్, సంత్ డాక్టర్ బ్రిజ్ మోహన్,
డాక్టర్ తుమ్మూరి, శ్రీ స్వామి నాయుడు కుటుంబం.



భీమిలిలోని దుర్గా గాయత్రి శక్తిపీఠంలో
పంచకుండీయ గాయత్రీ యజ్ఞం.

YUGASHAKTI GAYATRI (Telugu Monthly), March - 2006
RNI No. APTEL / 2000/1656. Postal Reg. No. L-II/RNP/H-HD-953/2006-08

హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో

# గాయత్రీమాత విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ



జ్యోతి ప్రజ్వలనతో గాయత్రీ విగ్రహ ప్రాణప్రతిష్ఠను ప్రారంభిస్తూన్న డాక్టర్ సాహెబ్, శైలదీదీ.



ప్రాణప్రతిష్ఠ చేసి ప్రసంగిస్తూన్న డాక్టర్ సాహెబ్.

# వానప్రస్థ సంస్కార ప్రదానం



బ్రహ్మదండం ప్రాముఖ్యాన్ని వివరిస్తూన్న డాక్టర్ సాహెబ్.



శ్రీ అశ్విని సుబ్బారావుకు వానప్రస్థ సంస్కారం ఇస్తూన్న డాక్టర్ సాహెబ్, శైల దీదీ.



వానప్రస్థం స్వీకరించడానికి యజ్ఞ కుండములముందు కూర్చున్న పరిజనులు.

If Undelivered please return to:
GAYATRI CHETANA KENDRA & MEDITATION CENTER
Near Aswini House, H.P.Road, Moosapet,
Hyderabad - 500018, Ph : 040-30986922,09392506888.
E-mail:hyderabad.ap.in@awgp.org, hyd@aswini.com

Chief Editor : Dr. PRANAV PANDYA
Printed & Published By Sri B.CH.V.SUBBA RAO (Aswini)
(For SRI VEDAMATHA GAYATRI TRUST)
5-283, H.P.Road, Moosapet, Hyderabad-500 018.
Printeda at Bharathi Art Printers, Chikkadapally, Hyderabad - 20

Global Head Quarters : GAYATRI TEERTH, SHANTIKUNJ,
Haridwar - 249411 Ph: (01334) 260602, 261955, 260309 Fax : (01334) 260866,
E-mail : shantikunj@awgp.org, southindiazone@awgp.org, website : www.awgp.org

SUNDAR GRAPHICS : 9391030025